నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెలుగులో విజ్ఞానం, సాహిత్యం
2015 11 Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

ఐక్య కార్మికోద్యమం నేటి అవసరం 06

విధుల నిర్వహణలో సిఎక్యూఎం విఫలం 05

సంపుటి 09, సంచిక: 40 | బుధవారం | 07-01-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ప్రజారోగ్యం కోసమే హిల్ట్

**కాలుష్య పరిశ్రమల తరలింపుపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ ; అపోహలు, ఆరోపణలకు ఖండన**



ప్రజాపక్షం/హైదరాబాద్

భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన తెలంగాణను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం హైదరాబాద్ పారిశ్రామిక భూ వినియోగం మార్పిడి–2025 పాలసీని (హిల్ట్) తీసుకు వస్తోందని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో మంగళవారం హైదరాబాద్ పారిశ్రామిక భూ వినియోగం మార్పిడి విధాన పత్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెక్నాలజీలో దూసుకుపోతున్నామని గర్వంగా చెప్పుకుంటున్న మనం ఈ భూమి మీద పుట్టిన ప్రతి జీవికి ప్రాథమిక హక్కులైన గాలిని, నీటిని, ఆహారాన్ని కూడా స్వచ్ఛందంగా అందించలేని అసమర్థ నాగరికతలో ఉన్నామనే చేదు నిజాన్ని మాత్రం మనం గుర్తించడం లేదన్నారు. ఏదో ఒక చోట... ఎప్పుడో ఒకప్పుడు చరిత్రలో గొప్ప మార్పులన్నీ ఒక్క అడుగుతోనే ప్రారంభం అయ్యాయన్నారు. ఆ 'ఏదో చోటు' మనం నిలబడ్డ ఈ పోరాటాల పురిటిగడ్డ 'తెలంగాణ' ఎందుకు కాకూడదు..? ఆ 'ఎప్పుడో ఒకప్పుడు'... ఇప్పుడే ఎందుకు కాకూడదని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చారిత్రక బాధ్యతను భుజానికెత్తుకుందన్నారు. అందులో భాగంగానే రేపటి తరాల భవిష్యత్తు కోసం, ఈ నేల మనుగడ కోసం తాము హిల్ట్ పాలసీ పేరిట ఓ చరిత్రాత్మక మార్పు వైపు మొదటి అడుగు వేశామన్నారు.

**పాలసీ అమలుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘం :**

ఈ పాలసీ పూర్తిగా పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో పాటు తన కూడిన మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 21 పారిశ్రామిక వాడలు ఉన్నాయని వీటిలో రెడ్ ఆరెంజ్ కేటగిరిలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ పారిశ్రామిక వాడలకు సంబంధించి భూములు సర్వ హక్కులు పరిశ్రమల యాజమన్యాలకే ఉన్నాయని ఆ భూములను ఎస్ఆర్ఓ మార్కెట్ ధరలో 80 అడుగులపై రోడ్ల ఉన్న వాటిని 50 శాతం, అంతకన్న తక్కువ రోడ్లు ఉన్నవాటికి 30 శాతం మేర రుసుం చెల్లించి భూ వినియోగం మార్పడికి అవకాశం కల్పించాలని ప్రభుత్వ నిర్ణయించిందని తెలిపారు. అది కూడ ఎలాంటి బలవంతం లేదని, ఇష్టం ఉన్న వారు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించామని చెప్పారు. ఈ ప్రక్రియను ఇంతా పారదర్శకంగా చేపడుతున్నా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఇది మంచింది కాదన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.

**పాలసీని స్వాగతిస్తున్నాం : దానం నాగేందర్**

భవిష్యత్ తరాల కోసం హిల్ట్ పాలసీని, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ రెండు పాలసీలు పూర్తిగా సమర్థిస్తున్నానని సభ్యులు దానం నాగేందర్ తెలిపారు. హిల్ట్ పాలసీలో భాగంగా పరిశ్రమలను ఒఆర్ఆర్ అవతలి వైపు కు తరలిస్తే ఇప్పటికే వీటి పనిచేస్తున్న వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉన్నందున వారికి జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన రైజింగ్ తెలంగాణ పాలసీతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నత స్థితికి చేరుకుంటాయని పూర్తిగా విశ్వసిస్తున్నామని తెలిపారు.

**పరిశ్రమల స్థలాల్లో లాంగ్ స్పేస్ ఏర్పాటు చేయాలి : ఏలేటి మహేశ్వరరెడ్డి**

హిల్ట్ పాలసీలో భాగంగా 21 పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్యం వెద జల్లుతున్న పరిశ్రమలను ప్రభుత్వం ముందు ఎక్కడికి తరలించనుందో స్పష్టం చేయాలని బిజెపి శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశ్రామిక ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి

తరువాయి 2లో

ఆర్‌టిసి విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణపై

## త్వరలోనే మార్గదర్శకాలు

- విడుదల చేస్తామని అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి
- తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిదని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆర్‌టిసి విలీన అంశంతో పాటు గత ప్రభుత్వం రద్దు చేసిన ఆర్‌టిసి కార్మిక సంఘాల పునరుద్ధరణ అంశం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నదని, త్వరలోనే మార్గదర్శకాలు వస్తాయని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్‌టిసి డ్రైవర్లు,

తరువాయి 2లో

కార్మిక సంఘాల ఏర్పాటును

## పరిశీలించండి

కూనంనేని సాంబశివ రావు

ఆర్‌టిసి విలీన ప్రక్రియను, కార్మిక సంఘాల ఏర్పాటు అంశాలు పరిష్కరించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి, బ్యాంకింగ్ ఇలా అన్ని సంస్థలలో కార్మిక సంఘాలు ఉన్నాయని, కానీ ఆర్‌టిసిలో మాత్రం ఆర్‌టిసి యూనియన్లు లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్యాయమన్నారు. ఆర్‌టిసి యూనియన్ల విషయంలో ప్రభుత్వం సొంత నిర్ణయం తీసుకుంటుందా? లేదా అధికారుల పైన ఆధారపడ్డారా? తద్వారా వారు తప్పుదోవ పట్టిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఆర్‌టిసి సంస్థకు

తరువాయి 2లో

'తెలంగాణ రైజింగ్ 2047'

TELANGANA RISING 2047

చిన్నారుల భవిష్యత్తుకు

## దిశా నిర్దేశం

- ప్రభుత్వ నివేదిక కాదు.. రాజకీయ ప్రణాళికా పత్రం అంతకన్నా కాదు
- శాసనసభలో తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రాన్ని ప్రవేశపెట్టిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- దేశ విదేశాల్లో మేధావులు, ఆర్థికవేత్తలతో చర్చించి రూపొందించామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047'(విజన్ డాక్యుమెంట్) కేవలం ప్రభుత్వ నివేదిక కాదని, రాజకీయ ప్రణాళికా పేపర్ అంతకన్నా కాదని, ఇది మన పిల్లల భవిష్యత్తుకు ఒక దిశా నిర్దేశమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు తెలిపారు. శుక్రవారం శాసనసభలో తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రాన్ని ఉపముఖ్యమంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదగడమే లక్ష్యంగా రాష్ట్రం, దేశం, విదేశాలలోని ఎంతో మంది ఆర్థిక వేత్తలు, మేధావులతో చర్చించి తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ లక్షాన్ని చేరుకునే భాగంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరిని అభివృద్ధి బాట పట్టించడమే ధ్యేయంగా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర

తరువాయి 2లో

## శాసనమండలి నిరవధిక వాయిదా

ఐదు రోజుల్లో 20 గంటలు నడిచిన సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ శాసనమండలి మంగళవారం సాయంత్రం నిరవధికంగా వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన శాసనమండలిలో పలు కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. మున్సిపల్ సవరణ బిల్లును ఆమోదించారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల తర్వాత సభను స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన 25వ శాసనమండలి సమావేశాలు ఐదురోజులు పాటు కొనసాగి మంగళవారంతో ముగిశాయి. ఐదు రోజుల్లో 19 గంటల 52 నిమిషాలు పాటు సమావేశాలు జరిగాయి. సభ్యులు మొత్తం 33 ప్రశ్నలను వేయగా 13 బిల్లులు పాస్ అయ్యాయి. సభలో మొత్తం 34 మంది సభ్యులు మాట్లాడారు.

## జిల్లాల విభజన అశాస్త్రీయం

- గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తాం : శాసనసభలో మంత్రి పొంగులేటి హామీ
- ఇష్టానురీతిలో మొక్కుబడిగా ఏర్పాటు చేశారని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గత పాలకుల హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లను, జిల్లా లను పునర్వ్యవస్థీకరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీనిచ్చారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు రామ్మోహన్ రెడ్డి, వీరేశం, పాల్వాయి హరీష్‌బాబు తదితరులు లేవనెత్తిన

తరువాయి 2లో

ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ

## జాతీయ ప్రయోజనాలకు ముప్పు

- అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు
- 'ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకుందాం - దేశాన్ని రక్షించుకుందాం' నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్త జనజాగృతి సైకిల్ యాత్ర ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ వినాశకరమైన ఆలోచన అని, కేంద్రంలోని ఫాసిస్ట్ మోదీ ప్రభుత్వం దీనిని వెంటనే విరమించుకోవాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణ పౌరులకు కాకుండా కార్పొరేట్లకు ప్రయోజనం చేకూరుస్తుందని, ఇది భారతదేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తూ జాతీయ ప్రయోజనాలకు

తరువాయి 2లో



రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ

## అవార్డు ప్రదానోత్సవానికి రండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆహ్వానం
- అవార్డు గ్రహీత జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, నల్లగొండ లోక్‌సభ మాజీ సభ్యులు రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి రావాలని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆహ్వానించింది. ఈ మేరకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప రెడ్డి, సభ్యులు రావి భారతి, కె.శ్రీనివాస్ రెడ్డి తదితరులు మంగళవారం శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఒక లేఖను అందజేశారు. రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డును ఈ ఏడాది సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని ట్రస్ట్ నిర్ణయించిందని ట్రస్ట్ అధ్యక్షులు చాడ వెంకట్‌రెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు. నిరంకుశ నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించేందుకు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలో ఒకరైన రావి నారాయణ రెడ్డి పోరాట స్ఫూర్తిని తర తరాలు స్మరించుకునే విధంగా ఆయన విగ్రహాన్ని ఎల్‌బి నగర్‌లో ఏర్పాటు చేయాలని, ఎల్‌బి నగర్ (కొత్తపేట)లో నిర్మిస్తున్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ప్రభుత్వ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి పేరు పెట్టాలని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి

తరువాయి 2లో

డెంగీ నియంత్రణలో హైదరాబాద్

## దేశానికి ఆదర్శం

జిహెచ్‌ఎంసికి కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు 12

## ఆసుపత్రిలో చేరిన సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారని మంగళవారం వర్గాలు తెలిపాయి. అయితే ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని, ఛాతీ వైద్యుడి పర్యవేక్షణలో ఉంచారని వారు చెప్పారు. ఆమెకు దీర్ఘకాలిక దగ్గు సమస్య ఉందని, ముఖ్యంగా నగరంలో ఈ కాలుష్యం కారణంగా ఆమె తరచుగా తనిఖీల కోసం వస్తుంటారని ఆసుపత్రి వర్గాలు పిటిఐకి తెలిపాయి. ఆమె సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో చేరారని వారు తెలిపారు. సోనియాగాంధీకి డిసెంబర్ 2025లో 79 ఏళ్ల నిండాయి.



ఇద్దరు చిన్నారులను

## హతమార్చిన తండ్రి

తానూ ఆత్మహత్యాయత్నం

ప్రజాపక్షం/ నారాయణపేట్ / మరికల్

ఓ తండ్రి ఇద్దరు పిల్లలను అత్యంత కర్కషంగా హతమార్చి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఘటన

తరువాయి 12లో

భారీ ఆన్‌లైన్ పెట్టుబడి స్కామ్

## 'ఫాల్కన్' ఎండి అరెస్టు

- రూ.4,215 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరణ
- 7,056 మందికి నమ్మకద్రోహం
- ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది అరెస్టు
- సిఐడి చీఫ్ చారుసిన్హా వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

అధిక లాభాల ఆశ చూపించి వేలాది మంది పెట్టుబడిదారులను మోసం చేసిన భారీ ఆన్‌లైన్ పెట్టుబడి కుంభకోణం కేసులో సిఐడి కేసు మంగళవారం కీలక మలుపు చోటుచేసుకుంది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమర్‌దీప్ కుమార్‌ను తెలంగాణ సిఐడి పోలీసులు అరెస్ట్ చేసినట్లు అదనపు డిజి చారుసిన్హా వెల్లడించారు. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో పనిచేసిన ' క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ' అక్రమంగా డిపాజిట్లు సేకరించి, నమ్మకద్రోహం, మోసం, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని

తరువాయి 12లో

'సర్' కోసం బిజెపి

## ఐటి సెల్ యాప్

**తప్పుడు విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం**

అర్హత ఉన్నా చనిపోయిన వారీగా పేర్కొంటూ ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోంది : ఇసిపై సిఎం మమతా బెనర్జీ ఆగ్రహం



**కోల్‌కతా :** బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)ప్రక్రియపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం బిజెపి ఐటి సెల్ అభివృద్ధి చేసిన మొబైల్ అప్లికేషన్స్‌ను ఇసి వినియోగిస్తోందని సిఎం ఆరోపించారు. దక్షిణ 24 పరగణ జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఆమె ఓటరు జాబితా సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం తప్పుడు విధానాలను అవలంబిస్తోందని అన్నారు. అర్హత కలిగిన ఓటర్లను చనిపోయిన వారిగా పేర్కొంటూ ఓటరు జాబితా నుంచి వారి పేరును తొలగిస్తోందని తెలిపారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఆరోగ్యం క్షీణించిన వారిని బలవంతంగా విచారణకు పిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసి చర్యలు అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని మమత తెలిపారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పాల్గొనేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరో వైపు ఇసికి వ్యతిరేకంగా టిఎంసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సర్ ప్రక్రియను చట్టవిరుద్ధ, ఏకపక్ష విధానాలతో ఇసి చేపడుతోందని పిటిషన్‌లో పేర్కొంది. మరోవైపు ఎస్‌ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలోని ఓటర్లను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. 'ఎస్‌ఐఆర్ నిర్వహణ కోసం ఇసి అన్ని రకాల తప్పుడు విధానాలను అవలంబిస్తోంది. అర్హత కలిగిన ఓటర్లను 'చనిపోయిన' వారిగా గుర్తించి, వృద్ధులు, అనారోగ్యంతో

తరువాయి 12లో

# మదురోపై కోర్టు విచారణ మార్చి 17కు వాయిదా



**న్యూయార్క్:** అమెరికాకు కిడ్నాప్ చేసి తీసుకుపోయిన వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురో దంపతులపై బనాయించిన మాదక ద్రవ్యాల ఉగ్రవాదం కేసు తదుపరి రెండో విడత విచారణను మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టు మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకూ మదురో (63) ఆయన సతీమణి సిలియా (70) అక్కడ జైలులోనే ఉంటారు. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం తర్వాత మదురో దంపతులు కోర్టు బోనులో నిలబడ్డారు. కోర్టులో ఆయనపై విచారణ ప్రక్రియ 30 నిమిషాలలో పూర్తయింది. తొలుత న్యాయమూర్తి ఆల్విన్ హెల్లెర్‌స్టీన్ అభియోగ పత్రాలను వారికి అందజేశారు. వారిపై ఏ ఏ అభియోగాలు మోపారో తెలియజేశారు.
"నేను వెనిజులా దేశాధ్యక్షుణ్ణి, మర్యాదస్తుణ్ణి, నన్ను నా పడక గదిలో నుండి కిడ్నాప్ చేసి తీసుకు వచ్చారు, యుద్ధ ఖైదీని చేశారు, నేను ఏ తప్పూ చేయలేదు, మేం నిర్దోషులం, ఇప్పటికీ నేను వెనిజులా దేశాధ్యక్షుడినే" అని మదురో న్యాయమూర్తికి తెలియజేశారు. నార్కో–టెర్రరిజం కుట్ర, కొకైన్ ఎగుమతులు, మెషిన్‌గన్స్, ఇతర ప్రమాదకరమైన ఆయుధాలను గుట్టలుగా పేర్చుకుని ఉండటం వంటి నేరాలకు మదురో పాల్పడ్డారని సిఐఏ కేసు నమోదు చేసింది. అదేసమయంలో కోర్టు వెలుపల పెద్దసంఖ్యలో మదురో అనుకూల ప్రదర్శనలు, ట్రంప్ అనుకూల ప్రదర్శనలు జరిగాయి. నాలుగుసార్లు దేశాధ్యక్షుడుగా పనిచేసి వెనిజులాలో పేదరికాన్ని నిర్మూలించిన హ్యూగో ఛావెజ్ (58) మరణానంతర నికొలస్ మదురో 2013లో అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. అమెరికా ప్రైవేటు చమురు కంపెనీలను దేశం నుండి వెళ్ళగొట్టి వాటిని జాతీయాకరణ చేసిన హ్యూగోఛావెజ్, వెనిజులాలపై కక్ష పెంచుకున్న అమెరికా అదనుచూసి ఆంక్షలు అమలు చేసింది. ఇక ఆ తర్వాత వెనిజులాలో ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. ట్రంప్ రెండో విడత అధికారంలోకి రాగానే నికొలస్ మదురోను పదవీచ్యుతుణ్ణి చేసేందుకు చాపకింద నీరులాగా వ్యూహరచన చేశారు. వేరే దేశానికి పారిపోయి గౌరవంగా జీవించాలని బాహాటంగానే కొద్దివారాలుగా ట్రంప్ బెదిరింపులు చేసినప్పటికీ మదురో వాటిని ఎంతమాత్రం పట్టించుకోలేదు. దేశాన్ని కాపాడుకుంటామని ఆయన ప్రకటించారు. కానీ కరీబియన్ జలల్లో క్రమంగా వెనిజులాను చుట్టుముట్టిన ట్రంప్ కొత్త ఏడాదిలో జనవరి మూడో తేదీ తెల్లారకముందే డెల్టాఫోర్స్ ద్వారా మదురోను దొంగ దెబ్బ తీసి కిడ్నాప్ చేసి తీసుకుపోయారు.
మదురో అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ పదేళ్ళుగా అమెరికా–వెనిజులా మధ్య మరింత శత్రుత్వం పెరిగింది. ఇక అప్పటినుండీ అమెరికాతోపాటు పాశ్చాత్యదేశాలు కూడా మదురోపై ఆరోపణలు గుప్పిస్తున్నాయి, మదురో ఎన్నికల మోసాలకు పాల్పడ్డారనీ, పచ్చి నియంత, అవినీతిపరుడు, మానవహక్కులను ఉల్లంఘించాడనీ ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఆయన ఎన్నికల చెల్లదంటూ ప్రతిపక్ష నేత జుయాన్ గుయైడోను 2019లో ప్రత్యామ్నాయ దేశాధ్యక్షుడుగా గుర్తించారు. వెనిజులాలో పూర్తిస్థాయిలో సైన్యాన్ని మోహరించాల్సిన అవసరం లేకుండా వందల మంది సిఐఏ ఏజంట్లు రంగంలోకి దిగి అనేక సంవత్సరాలుగా సైన్యంలో మదురోపట్ల అవిధేయతను ప్రోత్సహించారు.

# అధ్యక్షురాలు రోడ్రిగ్జ్‌కు మదురో కుమారుడు మద్దతు

## వెనిజులా వీధుల్లో భారీ భద్రత, సాధారణ జీవితం

**కారకస్:** సుప్రీంకోర్టు ఆదేశం మేరకు వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ (56) దేశాధ్యక్షురాలుగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. జాతీయ పార్లమెంటులో ఆమె మాట్లాడుతూ, దేశంలో శాంతి, స్థిరత్వాలను కాపాడటం కోసం, ఆర్థిక, సాంఘిక పరివర్తన సాధించడంకోసం ఎంతో ఆవేదనతో అధ్యక్ష బాధ్యతలు చేపట్టానని ప్రకటించారు. నికొలస్ మదురో మాత్రమే తమ నాయకుడని ఆమె ఉద్ఘాటించారు. దేశంలో పరిస్థితులు చక్కబడి సాధారణ స్థితికి వస్తున్నాయన్నారు. వెనిజులా వీధుల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు కాపలా తిరుగుతున్నాయి. దుకాణాలు తెరిచారు. ఐతే దుకాణదారులు ఒకేసారి ఐదుగురు కంటే ఎక్కువమందిని లోనికి అనుమతించడంలేదు. దుకాణాల వెలుపల వ్యాపారులు పెంపుడు కుక్కలను కాపలాగా ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాలలో నిత్యావసర వస్తువుల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. లూటీలు జరగకుండా ఉండటంకోసం వ్యాపారులు తమ సొంత ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రోడ్రిగ్జ్‌కు నికొలస్ మదురో కుమారుడు, వెనిజులా చట్టసభ సభ్యుడు నికొలస్ మదురో గెర్రా బేషరతుగా తన పూర్తి మద్దతు తెలియజేశారు. వెనిజులాను మోసం చేసినవారు ఎవరో త్వరలోనే బాహ్య ప్రపంచానికి తెలుస్తుందని ఆయన అన్నారు. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు దేశంలో 4,5 తేదీలలో భారీ ఎత్తున ప్రజలు అమెరికాకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. సోమవారం రాధాని కారకస్‌లో వేలాదిమంది అమెరికాకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిపారు.

### ట్రంప్‌కు గుస్తావో పెట్రో సవాల్

వెనిజులా పరిణామాల తర్వాత కొలంబియాను ట్రంప్ హెచ్చరించినప్పటికీ ఆ దేశం భయపడకుండా ధైర్యంగా నిలబడింది. ట్రంప్‌కు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో సవాలు విసిరారు. "రా..వచ్చి తీసుకెళ్ళు, నేను నీ కోసమే ఎదురుచూస్తున్నా..." అని ట్రంప్‌కు సవాలు విసిరారు. వెనిజులాపై దాడి తర్వాత వంతు కొలంబియా, మెక్సికోలదేనని ట్రంప్ హెచ్చరించిన తర్వాత గుస్తావో పెట్రో పైవిధంగా స్పందించారు. ట్రంప్ చేసిన హెచ్చరికలను ఆయన తోసిపుచ్చారు. ఒకప్పుటి గెరిల్లా యుద్ధ నాయకుడు గుస్తావో పెట్రో ఎక్స్ వేదికగా సోమవారం రాత్రి పొద్దుపోయాక ఒక ప్రకటన చేస్తూ, "ఇక ఆయుధాలు నా చేత్తో మళ్ళీ పట్టుకోకూడదని అనుకున్నా, కానీ నా మాతృభూమి సంరక్షణకోసం తిరిగి ఆయుధాలు చేపట్టక తప్పడంలేదు" అని పేర్కొన్నారు. ఒక రోగిష్ఠి నాయకుడు కొలంబియాను పాలిస్తున్నాడని ట్రంప్ ఆరోపణలు చేశారు.
కాగా వెనిజులా పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయించి ఖండించిన పొరుగుదేశం కొలంబియా తన సరిహద్దులను కట్టుదిట్టం చేసింది. వెనిజులా నుండి తమదేశంలోకి ప్రజలు భారీసంఖ్యలో వలసలు రాకుండా, వచ్చినవారికి మానవతా సహాయం చేయడం కోసం మానవతా సహాయం చేసింది. కొలంబియా రక్షణకోసం తాను ఆయుధాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు పెట్రో చెప్పారు.



# బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

## నిరసన ప్రదర్శన

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్యకు గురయ్యాడు. పలాష్ ఉపజిల్లా నార్సింగ్దీలోని చార్‌సిందూర్ బజార్‌లో సరుకుల దుకాణం యజమాని మోనీ చక్రవర్తి (40) ని దుండగులు నరికి చంపారు. ఎంతోకాలంగా హిందూవ్యాపారి ఈ బజారులో దుకాణం నడుపుతున్నారు. నిష్కారణంగా ఆయనను నరికిచంపారంటూ ఆ ప్రాంతంలో దుకాణదారులు మంగళవారం ఉదయం నిరసన ప్రదర్శన జరిపారు. పోలీసు అధికారి ఓసి షాహెద్ అల్ మామన్ ఈ ఘటన గురించి వివరిస్తూ, ప్రతిరోజూ లాగానే మోనీ చక్రవర్తి రాత్రి 11 గంటలకు దుకాణం మూసివేసి షిబ్‌పూర్ ఉపజిల్లాలోని షాదర్‌చార్ యూనియన్‌లో ఉన్న తన ఇంటికి వెళుతుండగా ఆకస్మికంగా గుర్తుతెలియని దుండగులు ఆయనపై పదునైన ఆయుధాలతో దాడిచేసి హత్య చేశారని, ఆయన తీవ్ర గాయాలతో అప్పటికే మరణించారని చెప్పారు. సోమవారం రాత్రి ఈ హత్య సంఘటన జరిగినట్లు చెప్పారు. సోమవారం రాత్రి ఈ హత్య జరగడానికి ముందుగా సోమవారం సాయంత్రం ఖుల్నా డివిజన్ జెస్సోర్ కేశవ్‌పూర్ ఉపజిల్లాలోని అరుయా గ్రామ నివాసి రాణా ప్రతాప్ బైరాగి (38) కపలియా బజార్‌లో హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని ఆయనను హత్యచేశాడు. అంతకుముందు శనివారం (జనవరి 3వతేదీ) ఖోకన్ చంద్ర దాస్ (50)ను నరికిచంపి అగ్నికి ఆహుతి చేశారు. 2025 డిసెంబరు 24న అంటే ఖోకన్ చంద్రదాస్ హత్యకు 10 రోజుల ముందుగా పంగ్సా ఉపజిల్లాలోని రాజ్‌బరి పట్టణంలో బెదిరించి డబ్బులు గుంజుతున్నాడని ఆరోపిస్తూ స్థానికులు అమృత్ మండన్ అనే హిందూ మైనార్టీని కొట్టి చంపారు. డిసెంబరు 18వ తేదీన మైమెన్‌సింగ్ నగరంలో మత దూషణ చేశాడన్న ఆరోపణపై దీపూ చంద్ర దాస్ (25) అనే యువకుణ్ణి అల్లరిమూకలు దాడిచేసి కొట్టి చంపి మంటల్లో దగ్ధం చేశాయి. డిసెంబరు 23వ తేదీన ఛత్తోగ్రామ్ శివారు ప్రాంతం రావుజన్ లో శుఖ్‌శీల్, అనిల్ షిల్ అనే ఇద్దరు కార్మికులను కూడా గుర్తుతెలియని వ్యక్తుకలు సజీవదహనం చేసి చంపారు.



# ఇరాన్‌లో కొనసాగుతున్న ప్రజాందోళన

## 35కు చేరిన మృతుల సంఖ్య

**దుబాయ్:** ఇరాన్‌లో గడచిన వారం రోజులుపైగా జరుగుతున్న ప్రజాందోళనల్లో ఇప్పటివరకూ 35 మంది ప్రదర్శకులు మరణించారు. ప్రభుత్వం ప్రదర్శకులను అణచివేతకు గురిచేస్తోంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని ఇలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. తాజాగా ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం కూడా ఈ విషయంలో జోక్యం చేసుకుంది. ప్రజలకు నిరసన తెలియజేసే హక్కు ఉందని, వారికి హక్కులను గౌరవించాలని కోరింది. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న మానవహక్కుల కార్యకర్తలు చెప్పిన సమాచారం ప్రకారం ఈ అల్లర్లను నివారించేందుకు ప్రభుత్వం 1200 మంది ప్రదర్శకులను అరెస్టు చేసి జైళ్ళల్లో నిర్బంధించింది. ఒక ఇరాన్ భద్రతాదళ అధికారితోపాటు నలుగురు పిల్లలు, 29 మంది ప్రదర్శకులు మరణించినవారిలో ఉన్నారు. ఇరాన్ దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలలో ఉన్న 27 ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. దీంతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ దేశీయమంత్రికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అసలు నిరసన ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలని కోరారు. ప్రధానంగా ఇలామ్ రాష్ట్రంలో ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఖుర్దిష్‌లు, లుర్ జాతి ప్రజలు ఉన్నారు. వారంతా తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారు ధరల పెరుగుదలను భరించలేకపోతున్నారు.

## అవార్డు ప్రదానోత్సవానికి రండి
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ రావి నారాయణ రెడ్డి అవార్డు ప్రదానోత్సవానికి వస్తానని చెప్పినట్లు చాడ వెంకట రెడ్డి తెలిపారు.

## పరిశీలించండి
(మొదటి పేజీ తరువాయి)

పోలీసులను ఎండిగా నియమిస్తారని, దాదాపు వారికి పోలీసు, లాఠీ దర్పం ఉంటుందన్నారు. ఆర్‌టిసి సంస్థలో యూనియన్ల ఏర్పాటు అంశాన్ని ఇదివరకే తాను సిఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన యూనియన్లు ఉండాల్సిందేనని చెప్పారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆర్‌టిసిలో యూనియన్ లేకపోవడం మాత్రం దుర్మార్గమన్నారు.

## ప్రజారోగ్యం కోసమే హిల్ట్
(మొదటి పేజీ తరువాయి)

అనుమతులిస్తే వారు వాటిని భవనాలు నిర్మించుకుని ఆర్థికంగా మరింత బలపడి పరిశ్రమలను ఏర్పాటు చేయకపోతే రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని, అందుకే పరిశ్రమ స్థలాల్లో ప్రజల కోసం లాంగ్ స్పేస్ ఏర్పాటు చేయాలన్నారు.

**హైదరాబాద్ మరో ఢిల్లీలా మారకూడదనే హిల్ట్ పాలసీ : యెన్నం శ్రీనివాస రెడ్డి**

కాలుష్యంలో హైదరాబాద్ నగరం మరో ఢిల్లీలా మారకుడదనే ప్రభుత్వం పరిశ్రమల తరలింపు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎందుకంటే వాయు కాలుష్యంలో ఢిల్లీ , కొల్‌కత్తా తర్వాత స్థానం హైదరాబాదే ఉందన్నారు. అందుకు భూములు, రెవెన్యూ పరంగా చూడకుండ భవిష్యత్ తరాలను కోసం ఆలోచించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి న తర్వాత ఈ ప్రాంతం దశ దీశను మార్చే అవకాశం బిఆర్‌ఎస్‌కు వచ్చినా వారు ఏమి చేయలేదన్నారు.ఇప్పుడు ఆ అవకాశం కాంగ్రెస్ వచ్చిందని చేసి చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

## జిల్లాల విభజన అశాస్త్రీయం
(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మండలాల ఏర్పాటు మొదలుకుని, జిల్లాల పునర్వ్యవస్థీకరణ వరకు ఇష్టానురీతిలో మొక్కుబడిగా జరిగాయని, తద్వారా ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమను పొగిడినవారి కోసం ఒక విధంగా, పొగడని వారికోసం మరో విధంగా, తమ అదృష్టసంఖ్యను ఊహించుకుని అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేపట్టాలరని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త మండలాలు, డివిజన్ల ఆవశ్యకతను కూడా గుర్తించామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితో, మంత్రి వర్గంలో చర్చించి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపడతామన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా నివేదిక తెప్పించి ఇదే శాసనసభలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని హామీనిచ్చారు.

## త్వరలోనే మార్గదర్శకాలు
(మొదటి పేజీ తరువాయి)

కండక్టర్ల సంక్షేమాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందన్నారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిదని, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణంలో ఆర్‌టిసి కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని, దాదాపు ప్రతిరోజు 65 లక్షల మంది ప్రయాణికులను తీసుకుని 35 లక్షల కిలోమీటర్ల తిరుగుతూ 342 బస్ స్టేషన్లు కనెక్టివిటీ చేస్తూ 12 వేల గ్రామాలు కనెక్ట్ చేస్తూ ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయని వివరించారు.
సన్మానం జాతీయ రోడ్డు భద్రత మాహోత్సవంలో భాగంగా గత 30 సంవత్సరాలుగా ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్లకు సత్కరించుకున్నామని, ఆర్‌టిసి ఉద్యోగి ఎవరైనా చనిపోతే ఇన్సూరెన్స్ విషయంలో యూనియన్ బ్యాంక్‌తో కలిసి ఒక కోటి రూపాయల నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నామన్నారు. పది సంవత్సరాల క్రితం ఆర్‌టిసి నుంచి సర్వీస్ రిమూవ్ అయిన వారు ప్రజావాణి దరఖాస్తు చేసుకుంటే త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసి, వారిని తిరిగి ఉద్యోగంలోనికి తీసుకున్నామని తెలిపారు.
కార్మికులు చనిపోతే కారుణ్య నియామకాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ఒక్క కొత్త బస్సు కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేస్తుందని, ఉద్యోగాలు ఇస్తుందన్నారు.

# పేదరికాన్ని మార్చే ఆయుధం...విద్య

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదరికం అనే సంకెళ్లను తెంచి, సామాన్యుడి తలరాతను మార్చే శక్తి ఉన్న ఏకైక ఆయుధం విద్య మాత్రమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ అన్నారు. తరగతి గదిలో నేర్పే చదువే రేపటి సమాజాన్ని, దేశ భవిష్యత్తును నిర్మించే అసలైన పునాది అని పేర్కొన్నారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో జాతీయ విద్యా విధానంపై సభ్యులు మల్కా కొమురయ్య, శ్రీపాదరెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు చెప్పారు. గతంలో సరియైన సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో గురుకులాలను ప్రారంభించారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని మంత్రి రాజనరసింహ తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఒక్కో స్కూల్‌ను రూ.200 కోట్ల తో, 25 ఎకరాల సువిశాల ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నామన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో టైమ్ ట్రేమ్ మార్చే అంశాన్ని పరిశీలించి విద్యార్థులు, టీచర్ల సౌకర్యం మేరకు అవసరమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. డాక్టర్ కె.కేశవరావు (కెకె) అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎన్ఇపి అమలుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

**లగచర్లలో 8 నెలల్లో పరిశ్రమలు పెట్టి తీరుతాం: మంత్రి శ్రీధర్‌బాబు**

ఎన్ని అడ్డంకులు వచ్చిన లగచర్లలో పరిశ్రమలు పెట్టి తీరుతాం అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనమండలిలో స్పష్టం చేశారు.ఈ మేరకు శాసనమండలిలో మంగళవారం కొత్త పరిశ్రమలుపై ఎంఎల్‌సి వెకటంట్ నర్సింగ్‌రావు బల్మూర్‌తో పాటు సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, అంజిరెడ్డిలు అడిగిన ప్రశ్నలకు శ్రీధర్‌బాబు సమాదానాలు చెప్పారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం పరిశ్రమలు పెడుతుంటే ప్రతిపక్ష పార్టీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. లగచర్లను కూడా ఇదే విధంగా అడ్డుకోవవడంతో కొంత నిరసనల నేపథ్యంలో ఆలస్యం అయిందన్నారు. రాష్ట్ర ప్రగతిలో అంద రి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇప్పటివరకు వివిధ కంపెనీలతో తాము చేసుకున్న ఎంఒయులలో 60 శాతం కంపెనీలు నెలకొల్పారని మిగతా 40 కంపెనీలు నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. గతంలో ఆయా దేశాలకు వెళ్లి సమయంలో రూ.2,71,000 కోట్లు పెట్టుబడి సామర్థ్యంతో 1,33,000 ఉపాధి సామర్థ్యం కలిగిన 73 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ నెల 19న దావోస్‌లో జరిగే అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో పెట్టుబడులు రాబట్టేందుకు సిఎం నేతృత్వంలో వెళ్తున్నామన్నారు. ప్రైయివేటు ఇంజనీరింగ్ కాలేజీలు విద్యార్థులను దోచుకుంటున్నాయని శాసన మండలిలో ఎంఎల్‌సి విజయశాంతి పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు లేని ఇంజనీరింగ్ కాలేజీల మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్రాడ్ కాలేజీల వివరాలు ప్రభుత్వం బయటపెట్టాలన్నారు.

**సిర్పపల్లి డంపింగ్ యార్డ్‌ను విరమించుకోవాలి: ఎంఎల్‌సి డాక్టర్ బల్మూర్ వెంకట్**

హుజూరాబాద్ నియోజకవర్గంలో హుజూరాబాద్ పట్టణాన్ని ఆనుకుని ఉ న్న సిర్సపల్లి గ్రామం లో నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డ్ సమస్యపై శాసనమండలిలో మంగళవారం ఎంఎల్‌సి డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడారు. సిర్సపల్లిలో తలపెట్టిన డంపింగ్ యా ర్డు ఏర్పాటును విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**రూ.500 కోట్లతో ఎర్త్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం: మంత్రి దామోదర్ రాజనర్సింహ**

కొత్తగూడెంలో రూ.500 కోట్లతో ఎర్త్ యూనివర్సింటీని అభివృద్ధి పరుస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. డాక్టర్ మన్మో హన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత కల్పించే తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లును శాసనమండలిలో మంగళవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశ పెట్టారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ వివరాలను మండలికి మంత్రి వివరించారు. 310 ఎకరాల సువిశాల ప్రాంగణంలో యూనివర్సిటీ విస్తరిస్తున్నామన్నారు. చర్చ అనంతరం బిల్లును శాసన మండలి సభ్యులు ఆమోదించారు.
సింగరేణి వెనుకబడిన ప్రాంతం లో తెలంగాణ ఎర్త్ యూనివర్సిటీ నెలకొల్ప డం హర్షణీయమని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. యూనివర్సిటీలో మంచి కోర్సు లు పెట్టాలని, తగిన సంఖ్యలో ప్రొఫెసర్లను నియమించాలని, నిధులను కూడా పెంచాలని కోరారు.విద్యను ప్రయివేటికరణ చేస్తున్నారని రానున్న రోజుల్లో ఇలా చేస్తే వాటిలో రిజర్వేషన్లు అమలు కావని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## నిరవధిక వాయిదా
(మొదటి పేజీ తరువాయి)

మార్చవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సుదీర్ఘ చర్చ జరిగింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కృష్ణాగోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన నీటి కేటాయింపులు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు వైఫల్యాలపై అధికార పక్షం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చింది. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై చర్చ సాగింది. సుమారు ఏడాది కాలం తర్వాత మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు సభకు హాజరుకావడం ఈ సమావేశాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కెసిఆర్ వద్దకు వెళ్లి పలకరించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రధానంగా ఉపాధి హామీ పథకానికి బదులుగా కేంద్రం తెచ్చిన కొత్త చట్టంపై చర్చలు కొనసాగాయి. జిఎస్‌టి సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ఎంఐఎం, బిజెపి సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. ధరణి, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరికంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు పోటీ చేయకూడదనే నిబంధనను రద్దు చేస్తూ తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు2026ను ఏకగ్రీవంగా ఆమోదించారు. జిహెచ్‌ఎంసి వార్డులను 150 నుండి 300కు పెంచే బిల్లుతో పాటు, శివారులోని 27 మున్సిపాలిటీలను విలీనం చేసే బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. తెలంగాణ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లుపై తీవ్ర చర్చ అనంతరం ఆమోదం లభించింది. డెలివరీ బాయ్స్, ఓలా, ఉబర్ డ్రైవర్ల కోసం సామాజిక భద్రత కల్పించే గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లుపై చర్చ జరిగింది.

**ఐదు రోజుల్లో 20 గంటలు పనిచేసిన మండలి :** తెలంగాణ శాసనమండలి మంగళవారం సాయంత్రం నిరవధికంగా వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన శాసనమండలిలో పలు కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. మున్సిపల్ సవరణ బిల్లును ఆమోదించారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల తర్వాత సభను స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన 25వ శాసనమండలి సమావేశాలు ఐదురోజులు పాటు కొనసాగి మంగళవారంతో ముగిశాయి. ఐదు రోజుల్లో 19 గంటల 52 నిమిషాలు పాటు సమావేశాలు జరిగాయి. సభ్యులు మొత్తం 33 ప్రశ్నలను వేయగా 13 బిల్లులు పాస్ అయ్యాయి. సభలో మొత్తం 34 మంది సభ్యులు మాట్లాడారు.

# సమృద్ధిగా ఎరువుల నిల్వలు

## మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం రాష్ట్రం లో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ఇప్పటి వరకు 1,67, 884 మెట్రిక్ టన్నుల యూరియా, డిఎపి 51, 458 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,67,661 మెట్రిక్ టన్నులు, ఎస్.ఎస్.పి 22,367 మెట్రిక్ టన్ను లు, ఇతర ఎరువులు 30,880 మెట్రిక్ టన్నులు నిల్వల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయం సభ్యులు మదన్ మోహన్ రావు, పాల్వాయి హరీష్‌బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకున్న యూరియా సరఫరాలో జరిగిన జాప్యంతో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్.ఎఫ్.సి.ఎల్) మూతపడటంతో గత ఖరీఫ్ సీజన్‌లో కొంత ఇబ్బంది ఏర్పడిందని వివరించారు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రానికి మొత్తం 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. 2024–25 సంవత్సర ఖరీఫ్‌తో పోల్చితే 13 వేల మెట్రిక్ టన్నులు అధికమన్నారు. 201819 నుండి 202324 వరకు యూరియా అమ్మకాల గణాంకాలను పరిశీలిస్తే, రబీ సీజన్‌లో ఏ సంవత్సరంలోనూ డిసెంబర్ 31 నాటికి 3 లక్షల మెట్రిక్ టన్నులకు మించి అమ్మకాలు జరగలేదని,కానీ రబీ సీజన్‌లో మాత్రం డిసెంబర్ 31 నాటికి 3.93 లక్షల మెట్రిక్ టన్నులు, ఈ రోజు వరకు మొత్తం 4.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని మంత్రి వివరించారు.

# రాష్ట్రాల హక్కులు హరించే విధంగా జిఎస్‌టి బిల్లు

## సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆవేదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఎస్‌టి బిల్లు రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉందని, ఈ బిల్లును సిపిఐ వ్యతిరేకిస్తుందని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం చెప్పారు. శాసన మండలిలో మంగళవారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టిన జిఎస్‌టి బిల్లుపై జరిగిన చర్చలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. వన్ నేషన్ వన్ ట్యాక్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన జిఎస్‌టి బిల్లును వ్యతిరేకిస్తున్నామని సత్యం చెప్పారు. ఈ బిల్లు రాష్ట్రం నుంచి మనం చెల్లించిన పన్నులు తిరిగి కేంద్రం నుంచి రాష్ట్రాలకు రాబడి ఉండడం లేదన్నారు. జిఎస్‌టి పేరుతో పన్నులను కేంద్ర తీసుకుపోయి రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకే ఈ బిల్లును తీసుకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా కేంద్రం చేనేత వస్త్రాలపై జిఎస్‌టి విధించిందని ఆయన తెలిపారు. విలాసవంతమైన వస్తువులపై నాలుగు స్లాబ్‌ల స్థానంలో రెండు స్లాబులు తెచ్చిందన్నారు. దీంతో అనేక రాష్ట్రాలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందన్నారు. చివరకు సభ్యుల చర్చ అనంతరం బిల్లును శాసనమండలి ఆమోదించింది.

## భవిష్యత్తుకు దిశా నిర్దేశం
(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ పాలసీ తీసుకువచ్చిందని తెలిపారు. 1991 నుండి ప్రతి దశాబ్దంలో మన ప్రాంతం యొక్క స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి) రెట్టింపు అవుతూ వస్తూ ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్నామన్నారు. కానీ తనను వెంటాడుతున్న, ఈ సభలోని ప్రతి సభ్యుడిని వెంటాడాల్సిన ప్రశ్న ఏమిటంటే తర్వాత ఏమి జరుగుతుందోనని అన్నారు. మనం ఏమీ చేయకపోయినా ఇలాగే 'యథావిధిగా' కొనసాగితే— 2047 నాటికి మనం సహజంగానే 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ఆర్థికవేత్తలు అంచనా అన్నారు. ఇది గౌరవప్రదంగానే అనిపిస్తున్నప్పటికీ ఈ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి సరిపోదన్నారు. ఆ 1.2 ట్రిలియన్ డాలర్ల సహజ వృద్ధికి, మనం ఆశించే 3 ట్రిలియన్ డాలర్ల గమ్యానికి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడానికే తెలంగాణ రైజింగ్ 2047'(విజన్ డాక్యుమెంట్) రూపొందించుకోవడం జరిగిందన్నారు. మనం నిర్ధేశించుకున్న ఒక కఠినమైన లక్ష్యాన్ని చేరుకుకోవాలంటే మా పెట్టుబడి రేటును జిఎస్‌డిపిలో 52% శాతానికి పెంచడం. దీని కోసం మనం మూలధనాన్ని నియంత్రించే రాష్ట్రం నుండి దానిని ఉత్ప్రేరకపరిచే రాష్ట్రంగా మారాలని డిప్యూటీ సిఎం వివరించారు. 2014లో సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో మనం రాజకీయ తెలంగాణ కలను సాకారం చేసుకున్నామని, 2024 నుంచి సంపన్న తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగుదాం అన్నారు.

## జాతీయ ప్రయోజనాలకు ముప్పు
(మొదటి పేజీ తరువాయి)

ముప్పు కలిగిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకుందాం దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో హైదరాబాద్ కెనరా బ్యాంకు ఉద్యోగి జి.ఉమామహేష్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్త 'జనజాగృతి సైకిల్ యాత్ర'ను హైదరాబాలోని కోఠి సెంట్రల్ బ్యాంకు వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఎపిటిబిఈఎఫ్) అధ్యక్షులు టి.రవీంద్రనాథ్ ఎఐబిఈఎ జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశంలో చాలా ప్రైవేట్ బ్యాంకుల్లో నిధుల దుర్వినియోగం జరిగి, కుప్పకూలిన సంఘటనలు అనేకం జరిగి, ప్రజల సొమ్ము లూటీ అయిందని, కేవలం ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కష్టపడి సంపాదించిన ప్రజల పొదుపు భద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెంటనే విరమించుకుని ప్రభుత్వరంగ బ్యాంకుల బలోపేతం చేసి ఉద్యోగ భద్రతకు, ప్రజల నిధులకు ముప్పు వటిల్లకుండా చూసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకునేందుకు ప్రజలను భాగస్వామ్యం చేసి భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమిస్తామని అయన హెచ్చరించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ప్రయోజనాలను చేకూర్చే ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయడానికి బదులుగా వాటిని ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఉద్దేశం దీర్ఘకాలంలో ప్రజా సంపద నష్టానికే దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఎపిటిబిఈఎఫ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, పి.ఉదయ్ భాస్కర్, మధుసూదన్, అజయ్, సంయుక్త కార్యదర్శి నల్లపు రెడ్డి, ఎఐబిఓఎ సంయుక్త కార్యదర్శి బిఎన్ఆర్.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న
# వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టుల భర్తీ

భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను మార్చి నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. కార్మికుల భద్రతకు భరోసా కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి సంస్థపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా కేవలం బ్యాంకుల ద్వారానే కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యులు రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు భట్టి విక్రమార్క సమాధానమిస్తూ సింగరేణి మనుగడ, కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు ముగిసిన పది రోజుల్లోగా సింగరేణి పరిధిలోని మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలతో పాటు సంస్థ సిఎండి, డైరెక్టర్లతో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇండ్ల నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించే అంశాన్ని బోర్డులో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ సింగరేణి సంస్థను వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు అందరిపై ఉందని చెప్పారు.

ప్రస్తుతం 11 మంది కాంట్రాక్ట్ డాక్టర్లు పనిచేస్తున్నారని, 32 మంది డాక్టర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలోనే ఆ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. 176 పారామెడికల్ సిబ్బంది అంతర్గత నియామకం ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. రామగుండంలో క్యాత్ లాబ్ నిర్మాణాన్ని పిపిపి మోడల్‌లో చేపడుతున్నామని కాంట్రాక్ట్ అవార్డు కూడా పూర్తయిందని, 75 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి ఆసుపత్రుల్లో మందుల సౌకర్యం కల్పిస్తున్నామని, సిపిఆర్‌ఎంఎస్ పథకం అందుబాటులో ఉన్నదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు 8లక్షల వరకు మందులను తీసుకునే అవకాశం కూడా కల్పించామని, టెర్మినల్ బెనిఫిట్స్ కూడా అందిస్తున్నామని వివరించారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సవాళ్ల మధ్య సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాల వల్ల రాష్ట్రంలోని బొగ్గు గనులను నేరుగా సింగరేణికి కేటాయించకుండా వేలం నిర్వహిస్తున్నారని, దీనివల్ల ప్రైవేట్ ఏజెన్సీలు రంగ ప్రవేశం చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర కంటే ప్రైవేట్ సంస్థలు తక్కువ ధరకే బొగ్గును సరఫరా చేస్తున్నాయని, వినియోగదారులు సహజంగానే తక్కువ ధర ఎక్కడ ఉంటే అక్కడ కొనుగోలు చేస్తారని భట్టి వివరించారు. ఈ పరిస్థితి సింగరేణి బొగ్గు అమ్మకాలపై ప్రభావం చూపుతున్నదన్నారు.

## ✻ మీడియా పాయింట్

### సభకు రాని బిఆర్‌ఎస్‌నేతలు సభా హక్కుల గురించి ఎలా మాట్లాడుతారు?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సభకు రాని బిఆర్‌ఎస్ నేతలు సభా హక్కుల గురించి ఎలా మాట్లాడతారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలపై తమ తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోవడంతోనే బిఆర్‌ఎస్ నేతలు సభ నుంచి వెళ్లిపోయారని, ఇప్పుడు ఎక్కడో దాక్కొని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను పరిష్కారం చేసే తపన బిఆర్‌ఎస్ పార్టీ నేతల్లో కనబడడం లేదని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్మారక జ్యోతి నిర్మాణం వరకు అంతటా అవినీతి జరిగిందని, వారి కుటుంబ సభ్యురాలు ఎంఎల్‌సి కవిత బిఆర్‌ఎస్ పార్టీపై చేసిన అవినీతి ఆరోపణలకు సమాధానం ఇవ్వలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి వల్ల కృష్ణా జలాల దోపిడి కాకుండా ఆగిపోయిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

### ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మార్చి 1వ తేదీ లోపు ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే మార్చి 02 వ తేదీ నుండి తాను నిరాహార దీక్షలో కూర్చుంటానని బిజెపి ఎంఎల్‌ఎ కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తుల సహకారం లేకుండా ఏ ప్రభుత్వం ముందుకు సాగదని, ఉద్యోగస్తులు పెన్ డౌన్ చేసే పరిస్థితి వస్తే పరిపాలనా వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం తప్ప ఏమీ ఇవ్వడంలేదని ఆరోపించారు. టిఎ, డిఎ మాట లేదని, పిఆర్‌సి ఊసే లేదని, ఉద్యోగులు చనిపోతే కనీసం అంత్యక్రియలకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆయన విమర్శించారు. ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన బిల్లులు ఇప్పటికీ సుమారు రూ.14 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించే వరకు తాను శాసనసభకు రానని, నిరాహార దీక్షతో కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షలో కూర్చుంటానని వెంకటరమణ స్పష్టం చేశారు.

### రాజ్యాంగేతర శక్తిగా పనిచేస్తున్న విడిసిని రద్దు చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రాజ్యాంగేతర శక్తిగా మారి దౌర్జన్యాలు చేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీల (విడిసి)ని వెంటనే రద్దు చేయాలని, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళవారం శాసనమండలిలో నెల్లికంటి సత్యం ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఆర్మూర్ కేంద్రంగా పనిచేస్తున్న విడిసి అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలు నిత్యం పెరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని సంబంధిత కలెక్టర్, ఎస్‌పిల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందన్నారు. నిజామాబాద్‌లో ఎవరు వ్యాపారం చేయాలన్నా విడిసిలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు కట్టాల్సిందేనని, కట్టనట్లయితే వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారన్నారు. విడిసి అక్రమాలపై పోరాడుతున్న బట్టు శ్రీధర్‌పై విడిసి నేతలు దాడి చేయడమే కాకుండా అతనిపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విడిసి ప్రభుత్వానికి సమాంతరంగా పనిచేస్తూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలను వేదిస్తున్నదన్నారు. తాడిచెట్టు ఎక్కే గౌడ కులస్తులను సైతం వేధిస్తున్నారన్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా విడిసి దుర్మాగాలను ఆపకపోతే ఆ ప్రాంతంలో సామాన్యులు బతకడం కష్టమన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా ఆలోచించి వారిని కట్టడి చేయాలన్నారు. విడిసిని రద్దు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్ స్పందిస్తూ విడిసి దౌర్జన్యాలపై సంబంధిత అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇవి వాహనాల కొనుగోలు


మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ వాహనాలు, పాఠశాల బస్సులు, ఫార్మా, ఐటి సంస్థల అవసరాల ఆధారంగా 25 నుంచి 50 శాతం వరకు ఈవి వాహనాలను కొనుగోలు చేసే విధానాన్ని తీసుకురాబోతున్నామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కొనుగోలు చేసే వాహనాలను కూడా ఇవి వాహనాలనే కొనుగోలు చేయాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు పిఎంఇ ఈ డ్రైవ్ కింద 2800 బస్సులు దశల వారీగా వస్తున్నాయని, వరంగల్ మున్సిపాలిటీ 100, నిజామాబాద్ మున్సిపాలిటీలో 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని వివరించారు. కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐలయ్య, నాగరాజు, భూపతిరెడ్డి, బిజెపి సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ రాష్ట్రంలో ఇవి వాహనాలు గణనీయంగా పెరిగాయని, 0.3 శాతం నుండి ఇప్పుడు 2 శాతానికి గణనీయంగా పెరిగిందన్నారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చూస్తే అక్కడ గాలిలో డేంజరస్ బ్యాక్టరీ ఉన్నట్టు తెలుస్తుందని, అక్కడ రాష్ట్రపతి, ప్రధాని, పార్లమెంట్ వ్యవస్థ ఉన్నప్పటికీ కాలుష్యం నుండి కాపాడుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకే ఇవి పాలసీ ద్వారా ఈవి వాహనాలు, సిఎన్‌జి, ఎల్‌పిజి వాహనాల వినియోగం పెంచుతున్నామన్నారు. 15 సంవత్సరాల పైబడిన వాహనాలు స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని, గతంలో స్క్రాప్ పాలసీ లేదని గుర్తు చేశారు. గ్రీన్ ట్యాక్స్‌ను రూ. 30 వేలకు పెంచారన్నారు. ఆర్‌టిసిలో డీజిల్ బస్సుల స్థానంలో రెట్రోఫిట్ చేసి ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామన్నారు. ఆటోలు కూడా డీజిల్ వాహనాలు కనిపించకుండా రెట్రోఫిట్ కి అవకాశం ఇచ్చామని, గేటెడ్ కమ్యూనిటీ లో చార్జింగ్ స్టేషన్‌లు, ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో చార్జింగ్ స్టేషన్లు, రెడ్కో ద్వారా చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాబోయే తరానికి కాలుష్యరహిత తెలంగాణ అందించాలన్నారు.

## యూనియన్ నాయకులతో సమావేశమై
# సింగరేణి సమస్యలను పరిష్కరించాలి

కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థ ప్రాంతానికి సంబంధించిన ఎంఎల్‌ఎలు, అధికారులు, యూనియన్ నాయకులతో సమావేశమై సమస్యలను పరిష్కరించాలని సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో కోల్‌ను కార్మికులు తీయకుండా కాంట్రాక్ట్ వారే తీసే పరిస్థితి రావడం సంస్థ మనుగడకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి ఉత్పత్తి చేస్తారన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్న కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇస్తారని, మెడికల్ ఇన్‌వాలిడేషన్స్ నిర్వహించకపోవడంతో కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోందన్నారు. ఇటీవల రిటైర్డ్ అయిన కార్మికులకు అత్యంత తక్కువగా రూ.200ల నుంచి రూ.500 ల వరకు పెన్షన్ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తంగా లక్ష రూపాయల లోపే బెనిఫిట్స్ పొందిన రిటైర్డ్ అయిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే పెన్షన్, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. మైన్స్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాలకు ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదని, ఖాళీగా ఉన్న స్థలాలను కార్మికులకు ఇచ్చే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. సింగరేణి సంస్థ కోసం కష్టపడి క్వార్టర్స్‌లో ఉంటున్న రిటైర్డ్ అయిన వారిని తొలగించకుండా వారికి ప్రత్యామ్నాయాన్ని చూపాలని, రిటైర్డ్ కాగానే వారిని తొలగించడకుండా వారి సంక్షేమాన్ని కూడా చూడాలని కూనంనేని సూచించారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కారించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకి ఆర్‌టిసి జెఎసి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆర్‌టిసి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని, వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, బి.యాదగిరి, ఎన్.కమలాకర్ గౌడ్ (టిఎంయు), ఎండి అక్తర్ పాషా, కె.రాంరెడ్డి(ఇయు), ఎం.ఎ.మజీద్, వల్లూరి బాబు(ఎన్ఎంయు), బి.శ్రీనివాస్ గౌడ్ (బిడబ్ల్యుయు), తదితరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటి చైర్మన్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని వారి నివాసంలో కలిసి ఎన్నికల హామీలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత ఆర్‌టిసి జెఎసితో అన్ని విషయాలు చర్చిస్తానని వెల్లడించినట్లు తెలిపారు. అలాగే అసెంబ్లీలో ఆర్‌టిసి కార్మికుల ప్రశ్నించే గొంతుకగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నల వర్షం కురిపించిన ఎర్ర సూర్యుడు సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేనేని సాంబశివరావుకి జెఎసి పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సిఎం పేషీలో లేఖ ఇచ్చినట్లు జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు.

# కమ్యూనిస్టు పార్టీకి గ్రామీణ ప్రజలే బలం

గిరిజనులకు పోడు పట్టాల కోసం కొట్లాడింది, కొట్లాడేది సిపిఐనే

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా




**ప్రజాపక్షం/ములకలపల్లి :** ప్రజా హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న పార్టీ ఒక్క సిపిఐ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. మంగళవారం సిపిఐ ప్రచార జాతలో భాగంగా మండల పరిధిలోని మాదారం నుండి ములకలపల్లి ప్రధాన సెంటర్ వరకు సిపిఐ పార్టీ కార్యకర్తలు సుమారు 100 బైకులతో భారీ ర్యాలీతో ప్రచార జాతా ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజలతోనే మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నో పార్టీలు పుట్టాయని అలాగే కాలగర్భంలో కలిసిపోయాయని కానీ ప్రజాదరణతో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ఈ దేశ స్వాతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ మాత్రమే, కార్మిక, విద్యార్థి, రైతు, మహిళా వ్యవసాయ కార్మిక యువజన, అనేక ప్రజా సంఘాల నిర్మించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వర్లు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న లక్ష్మి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్క అజిత్, ములకలపల్లి సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, ములకలపల్లి సిపిఐ ఉపసర్పంచ్ పువ్వాల లలితారావు, మూక మామిడి ఉపసర్పంచ్ కుర్సం సీతమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి, మాజీ ఎంపిటిసి కొర్రి భద్రం, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ జబ్బర్, వార్డు మెంబర్లు వాంకుడోత్ వీరు, గద్దం లలిత, వెంకటమ్మ, నల్లి వీరమ్మ, మంగిని దేవుసింగ్, మిరియాల వెంకన్న, రాచూరి రవీంద్ర, సిపిఐ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..

చలో ఖమ్మం

2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు

వేలాదిగా తరలి రండి!

# విప్లవ పోరాటాల గుమ్మం ఖమ్మం



**ప్రజాపక్షం/ఖమ్మం :** జనవరి 18న జరగనున్న ఒక మహోజ్వల ఘట్టానికి ఖమ్మం వేదిక కానుంది. వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో సిపిఐ సాధించిన విజయాలు, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ నేటి తరాన్ని కార్యోన్ముఖులను చేసే ప్రక్రియలో భాగంగా జనవరి 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభలను ఖమ్మంలో నిర్వహించనున్నారు. వందేళ్ల ప్రస్థానంలో రైతులు, గ్రామీణ పేదలు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు , విద్యార్థుల ప్రయోజనాల సంరక్షణకు హక్కుల కోసం నిర్విరామంగా పోరాడిన సిపిఐకి ప్రజల పక్షం తప్ప మరో ధ్యాస లేదు. ఈ పోరాట క్రమంలో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలకు పురుడుపోసింది. అందుకే ఖమ్మంను విప్లవాల గుమ్మం అంటారు. ఎందరో యోధుల త్యాగాలతో ఈ నేల పునీతమైంది. స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ కమ్యూనిస్టు ఆలోచనలు కలిగిన అనేక మంది అభ్యుదయవాదులు కలిసి పనిచేశారు. 1953 అక్టోబర్ 19న వరంగల్ జిల్లా నుంచి విడివడిన తర్వాత ఖమ్మం జిల్లా విభిన్న సంస్కృతులకు సమ్మేళనంగా ఉండేది. ఇక్కడ అటవీ ప్రాంతంతో పాటు గిరిజన జనాభా కూడా ఎక్కువే. అదే సమయంలో కొందరు ఖమ్మం జిల్లాను ఆంధ్రా, తెలంగాణల వారధి అంటుంటారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఖమ్మం ప్రాంతం ముందు వరుసలో నిలిచింది. వీరమాచినేని ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్, యరమనేని వెంకటనర్సయ్య, పారుపల్లి పుల్లయ్య, చుండూరి నర్సింహారావు, కొణిదెన సీతారామయ్య తదితరులు పాల్వంచ జోనల్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. సాయుధ దళాలతో యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడారు. అటవీ ప్రాంతాల నుండి సాయుధ దళాలను వేరు చేసేందుకు అడవుల నుండి గిరిజనులను తరిమివేయాలని భావించినప్పుడు కమ్యూనిస్టు పార్టీ అందుకు వ్యతిరేకంగా పోరాడింది. భద్రాచలం అటవీ ప్రాంతంలో విస్తారంగా లభ్యమయ్యే తునికాకు సేకరించే గిరిజనుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేసి శ్రమకు తగిన కూలీ లభించేటట్లు చేసింది. అంతేకాకుండా ఆ రోజుల్లో అడవిలోకి పశువులు, జీవాలు మేతకు వెళితే పుల్లరి కట్టాల్సి వచ్చేది. ఇందుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడి పుల్లరి పన్నును రద్దు చేయించింది. పేద గిరిజనులకు 2ఎ కింద ఉన్న భూములకు పట్టాలు ఉండేవి కావు. సిపిఐ పోరాట ఫలితంగానే ప్రభుత్వం 2ఎను రద్దు చేసి గిరిజనులకు హక్కులు కల్పించింది. అయితే 1964 చీలిక తర్వాత ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నామమాత్రంగా మిగిలింది. కా॥ గిరిప్రసాద్, మనుబోతుల కొమరయ్య, టిబి విఠల్‌రావు, రావెళ్ల జానకిరామయ్య, చుండూరి నర్సింహారావు, సర్వదేవభట్ల రామనాథం తదితరులు 1964 ఏప్రిల్ 16, 17 తేదీలలో కొక్కిరేణిలో జరిగిన సమావేశంలో పుచ్చలపల్లి సుందరయ్య రిపోర్టును వ్యతిరేకించి కమ్యూనిస్టు పార్టీలో కొనసాగాలని నిర్ణయించారు. 1972 మేడే ఉత్సవాల సందర్భంగా కా॥ రజబ్‌అలీ సహ ఖమ్మం తాలూకాలో వెయ్యి మంది సిపిఐ(ఎం) సభ్యులు సిపిఐలో చేరారు. 1967 నుండి 1983 వరకు సిపిఐ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పువ్వాడ నాగేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్ సహకారంతో ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాదులు వేశారు. 1981లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పువ్వాడ నాగేశ్వరరావు శాసన మండలికి ఎన్నికై కమ్యూనిస్టు పార్టీకి ఒక ఊపును తీసుకు వచ్చారు. అదే సమయంలో కమ్యూనిస్టుల ఐక్యతతో 11 సమితుల్లో విజయం సాధించి వామపక్ష ఉద్యమానికి బలమైన పునాదులు వేశారు. 1975, 1976లో జరిగిన భూ పోరాట ఫలితంగా వేలాది మంది పేదలకు సొంత భూమి దక్కింది. 1976 అత్యవసర పరిస్థితుల్లోనూ వందలాది మందిని జైళ్లలో నిర్బంధించిన భూ పోరాటం ఆగలేదు. ఖమ్మం జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన భూ పోరాటం కారణంగా 10వేల ఎకరాలు పేదల సొంతమయ్యాయి. 1303 మందిని అరెస్టు చేసి జైళ్లకు తరలించారంటే ఆనాటి ఉద్యమతీరు అవగతమవుతుంది. 1978లో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహం సందర్భంగా 5582 మందిని అరెస్టు చేశారు. ఆనాడు కలెక్టరేట్ వద్ద ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న వారిపై భాష్పవాయువు ప్రయోగించి కాల్పులు జరిపారు. 123 మందిపై అతి కఠినమైన సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించారు. 1979 ఫిబ్రవరి 27 నుంచి మార్చి ఐదు వరకు జరిగిన భూ పోరాటం ఆనాడు రాష్ట్రానికే దిక్సూచిగా నిలిచింది. బయ్యారం గనుల అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఐ ఇచ్చిన పిలుపు ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. వేలాది మందిని సమీకరించి ఖమ్మం జిల్లాకు వచ్చే 18 రహదారులను దిగ్బంధనం చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలలో సిపిఐ సరికొత్త పంథాను తీసుకువచ్చింది. ఎడతెగని ఆందోళనలతో లక్షల కోట్ల రూపాయల ఐరన్‌వోర్ ఖనిజాన్ని కాపాడి సిపిఐ తనకంటూ ఒక చరిత్రను లిఖించుకుంది. అటువంటి పోరాట పురిటిగడ్డపై జనవరి 18న ఈ చారిత్రక సభ జరగనుంది.

**శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము**
ఇండ్లకోటయ్యగూడెం, నిడమనూరు మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం. 01/ఎస్.కె.ఎమ్.టి /2026, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 06-01-2026

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 13-01-2026, మంగళవారము, రోజున ఉదయం 10-00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | 1,00,000/- | 20-01-2026 నుండి 19-01-2027 వరకు |
| 2 | కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | 1,00,000/- | -డూ- |
| 3 | పూలు అమ్ముకొను హక్కు | 20,000/- | -డూ- |
| 4 | లడ్డూ, పులిహోర ప్రసాదములు అమ్ముకొను హక్కు | 1,00,000/- | -డూ- |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు,
చెవిటి ఆంజనేయులు, ఫౌండర్ ట్రస్టీ
సిరికొండ నవీన్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 13158-PP/CL/ADVT/1/2025-26, Date: 06-01-2026

**మూడుచింతల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం**
మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

Lr.No. E1 /MCPALLY/NGP cc roads/ 615/2025-26
E1/MCPALLY/NGP/drains/615/03/2025-26
E1/MCPALLY/NGP/parks/615/04/2025-26
E1/MCPALLY/NGP/lakes/615/05/2025-26
E1/MCPALLY/NGP/culverts/615/06/2025-26

ఈ క్రింది పనులకు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

| క్ర.సం. | పని పేరు | అంచనా వ్యయం (రూ.లక్షల్లో) |
|---|---|---|
| 1 | మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీలో ప్రధాన అంతర్గత రోడ్ల నిర్మాణం | 4.40 |
| 2 | మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీలో మేజర్ మరియు అంతర్గత కాలువల నిర్మాణం | 3.00 |
| 3 | మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీలో పార్కుల అభివృద్ధి | 1.00 |
| 4 | మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీలో చెరువుల్లో కాలుష్యాన్ని నివారణ | 0.50 |
| 5 | మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీలో కల్లర్టుల నిర్మాణం | 0.50 |

రూ.09.40కోట్ల విలువైన (05) టెండర్లను తేదీ: 08.01.2026 నుండి 17.01.2026 మధ్యాహ్నం 03:30 వరకు మూడుచింతల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ టెండర్లను స్వీకరిస్తారు. టెండర్లను మధ్యాహ్నం 03:31గంటలకు టెండరర్ల సమక్షంలో లేదా వారి ప్రతినిధుల సమక్షంలో మూడుచింతల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ లేదా మూడు చింతల్‌పల్లి డిప్యూటీ కమిషనర్ తెరుస్తారు.

పిలువబడే టెండర్ల షెడ్యూల్ కింద ఇవ్వబడింది
1. టెండర్ పత్రాల డౌన్‌లోడ్ తేదీ : 08-01-2026
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు సమర్పణ : 19-01-2026 మధ్యాహ్నం 03 : 30గంటలకు
3. టెండర్ల ఓపెనింగ్ : 19-01-2026 మధ్యాహ్నం 03: 31 గంటలకు

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫార్మ్‌ను అంటే https : //tender. telangan.gov.in ను సందర్శించండి లేదా మూడు చింతల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం ఫోన్ నెంబర్లు 7287849496/ 9121136758లో సంప్రదించండి.

సం/- మున్సిపల్ కమిషనర్, మూడుచింతల్‌పల్లి మునిసిపాలిటీ.

DIPR R.O. No. : 13145-PP/CL/ADVT/1/2025-26, Date: 06-01-2026



## పెంటయ్య మృతికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి సంతాపం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గోద పెంటయ్య గుండెపోటుతో మృతి చెందగా వారి పార్థివదేహాన్ని సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి సందర్శించి ఆయన పతాకాన్ని కప్పి పూలమాలవేసి నివాళుల ర్పించారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పెంటయ్య తన తండ్రి వారస త్వాన్ని నమ్ముకొని సిపిఐ పార్టీలో అనేక సంవత్సరాలు క్రియాశీల కార్యక ర్తగా పనిచేసి మరణించడం అనేది బాధాకరమని అన్నారు. అదేవిధంగా ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత, గోద పెంటయ్య మృతదే హంపై పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు కురిమిద్ద శ్రీనివాస్ కల్లెం కృష్ణ, ఏశాల అశోక్ పేరబో యిన మహేందర్, చెక్క వెంకటేష్, ఎండి ఇమ్రాన్, కల్లేపల్లి మహేందర్, బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, గాదగాని మాణిక్యం, పేరబోయి న బంగారు, గోరేటి రాములు, కొల్లూరు రాజయ్య, మర్రిగూడెం సర్పంచ్ బోడాసు స్వప్న జగన్ పూలమాలలు వేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన సిపిఐ రాజీలేని పోరాటాలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఖమ్మం జిల్లాలో ఈనెల 18నజరిగే సిపిఐ శతజ యంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బబ్బు వీరస్వామి,పట్టణ కార్య దర్శి కర్ర సైదిరెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యా లయం మగ్దూం భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ పోస్టర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ కాన్పూర్ లో డిసెంబర్ 25, 1925సంవత్సరంలో ఆవిర్భవించింది పేద ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తున్నదని ఆనాడు పార్టీపై నిషేధం విధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వి. లెనిన్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యా దయ్య, ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం నందం, మదార్, బొగిరి రాంకోటి, యూసుఫ్, యాదగిరి, అక్కయ్యలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం తగదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహి రంగ సభ గోడపత్రికను మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడారు. లక్షలది మందితో జరిగే బహిరంగ సభకు 40 ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంజిరాల రామలింగం, మండల సమితి సభ్యులు ఎండి.సయీద్, వలపట్ల వెంకన్న, దగ్గర దుర్గయ్య, ఎస్కె.షమీం, బంటు రాజేశ్వరి, బుచ్చయ్యలు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలతోనే బలోపేతం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం అవుతుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక ఎంఎన్ గార్డెన్లో సిపిఎం పార్టీ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని, ముఖ్యంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించాలని కోరారు.గత సర్పంచ్ ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమై కమ్యూనిస్టు నాయకులను ఓడించాలని చూసిన ప్రజలు అండతో అనేకచోట్ల గెలిచారని గుర్తు చేశారు. డబ్బు, మద్యంతో మభ్యపెట్టిన నిజమైన ప్రజా నాయకులకు గెలిపించారని చెప్పారు.పదవులు ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. రానున్న మున్సిపల్ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో,దేశంలో పేదవారికి అన్యాయం చేసే విధంగా విధానాలు తీసుకొస్తున్నారని వీటిని తిప్పుకొట్టేందుకు ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,ష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం,పాలడుగు నాగార్జున,కందాల ప్రమీల పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌తో మరింత అభివృద్ధి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** రానున్న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ గా చేయడంతో మంగళవారం పట్టణంలోని గడియారం సెంటర్లో పార్టీ శ్రేణులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫోటో ఫ్లక్సీ కి పాలాభిషేకం చేసి బాణసంచి కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ పట్టణాన్ని కార్పొరేషన్ గా చేయడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేషన్ కావడంతో పట్టణ అభివృద్ధికి ఎక్కువ నిధులు వస్తాయని దీంతో అన్ని వ్యాపార వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# మహానగరంగా నల్లగొండ

### కార్పొరేషన్‌తో పెరగనున్న డివిజన్లు.. మారనున్న హద్దులు..

### మహానగరంగా అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ శాసనసభబిల్లు ఆమోదం

### పంతం నెగ్గించుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ (మహానగరం)గా అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ శాసనసభ మంగళవారం బిల్లును ఆమోదించింది.జిల్లా కేంద్రమైన నల్లగొండ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.దాదాపు 75 ఏండ్ల క్రితం 12 వార్డులతో గ్రేడ్3 మున్సిపాలిటీగా ప్రస్థానం మొదలుపెట్టిన నల్లగొండ ఎట్టకేలకు కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. 1961లో కేవలం 12 వార్డులతో మొదలై గ్రేడ్3 ము న్సిపాలిటీగా ఏర్పాటు చేశారు.ఆ తర్వాత జనాభా పెరగడం, పట్టణం క్రమంగా విస్తరించడంతో 1987లో 24 వార్డులతో గ్రేడ్2 మున్సిపాలిటీగా,2006లో 36 వార్డులతో గ్రేడ్1మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయింది. 2011లో నల్లగొండ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలైన అర్థాలబానీ మర్రిగూడ, చర్లపల్లి,శేషమ్మగూడెం,అక్కలాయిగూడెం, మామిళ్లగూడెం, తిప్పర్తి మండలంలోని కేశ రాజుపల్లి గ్రామ పంచాయతీలు, వీటి పరిధిలోని మరో పది అవాస గ్రామాలను విలీనం చేసి 48 వార్డులుగా విస్తరించారు.2018 ఫిబ్రవరి 9న గ్రేడ్1 మున్ని పోలిటీగా ఉన్న నల్లగొండ స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయింది. ప్రస్తుతం నల్లగొండ మున్సిపాలిటీలో 2.50లక్షల మేర జనాభ ఉంది. 2018లో బిఆర్ఎస్ సర్కారు హయాంలో నల్లగొండ పట్టణం స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకుంది. తాజాగా నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చాలెంజిగా తీసుకున్నారు.నిజానికి యావత్ తెలంగాణలో కార్పొరేషన్ లేని జిల్లా ఏదైనా ఉందంటే అది ఒక్క ఉమ్మడి నల్లగొండ జిల్లాననే చెప్పా లి. గత సర్కారు హయాంలో 2018లోనే నల్లగొండను కార్పొరేషన్‌గా చేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది.కానీ సరిపడా జనాభా లేకపోవడంతో కాలేదు.నల్లగొండను కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే తాజాగా అసెంబ్లీలో నల్లగొండ కార్పొరేషన్ అప్‌గ్రేడ్ బిల్లును ఆమోదించారు.దీంతో నల్లగొండ మున్సిపాలిటీ వాసులతో పాటు రాజకీయ నేతల్లోనూ సరికొత్త జోష్ కన్పిస్తోంది. కౌన్సిలర్ల స్థాయి నుంచి కార్పొరేటర్లుగా మారడంతో పాటు మున్సిపల్ చైర్మన్ నుంచి మేయర్ పదవికి అప్‌గ్రేడ్ కానుండడంతో రాజకీయ నిరుద్యోగులకు కాంగ్రెస్ సర్కారు నిర్ణయం వరంగా మారనుందనే చెప్పాలి.

**పెరగనున్న డివిజన్లు.. మారనున్న హద్దులు..** నల్లగొండ స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో ప్రస్తుతం 48 వార్డులు ఉన్నాయి. అయితే ఈ48 వార్డులను 50 డివిజన్లుగా విభజించే అవకాశం ఉంది. మొదటి 24 వార్డుల నుంచి అదనంగా ఒక డివిజన్,24 వార్డుల నుంచి48 వార్డుల వరకు మరో డివిజన్ పెంచనున్నారు. దీంతో నల్లగొండ కార్పొరేషన్‌లో మొత్తం 50 డివిజన్లు ఏర్పాటు కానున్నారు. అందుకోసం 5 నుంచి7 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరిధిని మహానగరంగా మార్చనున్నారు. దీంతో ప్రస్తుతం నల్లగొండ మున్సిపాలిటీలో ఉన్న వార్డుల రూపురేఖలు మారనున్నాయి.కొత్త హద్దులతో డివిజన్లు ఏర్పాటు అవ్వనున్నాయి.ఒక్కో డివిజన్‌లో 3 వేల నుంచి 3500 మంది వరకు ఓటర్లు ఉండనున్నారు.ఏదిఏమైనప్పటికీ నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయించడంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంతం నెగ్గించుకున్నారనే చెప్పాలి.

## యూరియా సరఫరాలో రైతులకు ఇబ్బందులు రావొద్దు



నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యూరియా సరఫరా, పంటల సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మిర్యాలగూడ మండలం సమీపంలోని తుంగపాడు మార్క్‌ఫెడ్ వేర్ హౌసింగ్ గోదామ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా నిల్వలను, సరఫరా, రవాణా, లారీల ఏర్పాటు, సమస్యలను మార్క్‌ఫెడ్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతరం శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న ఎరువుల దుకాణంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న ఎరువుల సరఫరా ప్రక్రియను పరిశీలించిచారు. ఎరువుల విక్రయాలు ఆన్‌లైన్‌లో ఏ విధంగా చేస్తున్నారో డీలర్, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ ఏ మండలంలోని రైతులకు ఆ మండలంలోనే ఎరువులు సరఫరా చేయాలని, ఆన్‌లైన్‌లో స్టాక్ చూపించిన 10, 20 నిమిషాల్లోనే యూరియా స్టాక్ అయిపోతుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌తో రబీ వ్యవసాయ ప్రణాళికపై సమీక్షించారు. కాగా ఈ రబీకి సంబంధించి జిల్లాలో 6.57లక్షల ఎకరాలు సాగు విస్తీర్ణం కానుందని, ప్రత్యేకించి రబీలో 74వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 35వేల మెట్రిక్ టన్నులు విక్రయించడం జరిగిందని, గోదాంలో 10వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా డీలర్ల వద్ద మరో 3వేల టన్నుల యూరియా ఉందన్నారు. ఎరువులకు సంబంధించి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న ఎరువుల యాప్‌పై కలెక్టర్ ఆరా తీశారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, మార్క్‌ఫెడ్ అధికారి వీరస్వామి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సైదానాయక్ పాల్గొన్నారు.

## భగీరథ నీటి లీకేజీని అరికట్టాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో వేంకటగిరి లక్ష్మీ నరసింహ స్వామి కమాన్ దగ్గర చాలా రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు లీకేజీ అవుతున్నదని, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది ఇట్టి నీటిని వృథాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు సిలివేరు దుర్గయ్య, దేవరుప్పుల ఐలయ్య, ఎరుకల వెంకటేష్ గౌడ్ కోరారు. ఈ వాటర్ లీకేజీ వల్ల దత్తాయపల్లి పరిధిలో గల వేల్పుపల్లి, గుజ్జవాణి కుంట తండా, ఇబ్రహీంపూర్ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని, వెంటనే మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించి ఆయా గ్రామాలకు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాటర్ లీకేజీల వద్ద పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాల భారిన పడుతు న్నారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు రోడ్డు సమస్యలు పరిష్కరించాలని, ప్రయాణికులు, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.





## భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు

సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ మండల కమిటీ సమావేశం రచ్చ యాదగిరి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలుత కోరిన పార్టీ సిపిఐ అని, 2025 డిసెంబర్ 26తో సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలో జరిగే భారీ బహిరంగ సభ ఒక మార్పుకు సూచనగా మారబోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ, సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రం, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంత, వార్డు సభ్యురాలు భారతమ్మ, గంగాపురం వెంకటయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## చైనా మాంజా అమ్మితే జైలుకే

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల భద్రత, ఇతర ప్రాణుల రక్షణ దృష్ట్యా చైనా మాంజాపై నిషేధం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలకు చైనా మంజా కొనిపించవద్దని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ వేళ సూర్యాపేట జిల్లాలో చైనా మాంజాపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. చైనా మాంజా వల్ల పక్షులు, వాహనదారులు తీవ్రంగా గాయపడుతూ ప్రాణాలు కూడా కోల్పోతున్న ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. చైనా మాంజా విక్రయం, వినియోగంపై జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రత పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రత్యేక నిఘా ఉంచి రౌండ్స్ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి, ఉత్సవం విషాదం కావద్దని కోరారు. ఎవరైనా చైనా మాంజా అమ్ముతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్‌రూమ్ 87126 86057, 8712686026కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## ప్రైవేట్ కంపెనీల ఆదేశాలు రద్దు చేయాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పుతూ జారీ చేసిన జీవో నెంబర్ 12ను సవరించి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, సిఎస్‌సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అడ్డగూడూరు మండలం కంచనపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో 50 మంది ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ వారికి ఎఐటియుసి కండువాను కప్పి యూనియన్ లోకి సాధారణంగా ఆహ్వానిం చిన అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శిం చారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణరంగ కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 13 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం చేసే ప్రయత్నాలు విరవించుకోవాలని కోరారు. భవనిర్మాణ కార్మికులు సహజమరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5 వేలు కనీస పెన్షన్ ఇవ్వాలని, వివాహ, కానుపు స్కీం కింద రూ.లక్ష ఇవ్వాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక...** భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుంకరబోయిన కొముర య్య, ఉపాధ్యక్షులు భాషబోయిన కనకయ్య, షేక్ జహంగీర్, ప్రధాన కార్యదర్శి, కందుకూరి పరశురాములు, సహాయ కార్యదర్శులు కొండాపురం నర్సయ్య, కె. అంజయ్య, కోశాధికారి చేడే సుందరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




## వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనే

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** వచ్చే పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ పాలన నడుస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జె ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ ఎవరి సొత్తు కాదని ఎవరి జాగిరు కాదన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సూర్యాపేట నియోజక వర్గంలో 117 గ్రామ పంచాయితీలకు 73కి పైగా సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే పరిస్థితి లేదని సర్పంచ్, కౌన్సిలర్ల ఎన్నికలు జరిగితే అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటి ఎన్నికల్లో 48 వార్డులు మొత్తం గెలుచుకొని మున్సిపాలిటి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సును, ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. 70వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని రెండు వర్గాలు ఉన్నాయి మాకు టిక్కెట్ రాదనే సందేహం అసలేవద్దని పార్టీలో పని చేసిన ప్రతి ఒక్కరికి టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోవడం జరిగిందని అయినా సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు. ఒక్కరిద్దరు బ్రోకర్ల వల్ల కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఎవరి అబ్బ సొత్తు కాదని అందరూ త్యాగాల తోటి కాంగ్రెస్ పార్టీ నిర్మాణం జరిగిందన్నారు. గెలిచే నాయకులకే టిక్కెట్ ఇచ్చి రాబోయే రోజుల్లో మున్సిపాలిటిని గెలుచుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రవిబాబు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ఓబిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, యాట వెంకన్న, ఉపేందర్, దేవేందర్, నాయకులు, మాజీ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రబీ సాగులో మారిన రైతు ఆలోచన...

### మొలక చల్లేందుకే మొగ్గు...

### ఖర్చుల కట్టడికే మారిన సాగు

**ప్రజాపక్షం/గుండాల:** వ్యవసాయ సాగులో పెరిగిన ఖర్చులను కట్టడి చేసేందుకు రైతులు సాగు విధానాన్ని పూర్తిగా మార్చుకున్నారు. ఒక ఎకరం వరి సాగు చేసే రైతులకు కేవలం నాటు ఖర్చే రూ. 6500 అవుతుండటం భారంగా మారింది. ఒక కౌలు రైతు ఒక ఎకరం పంట చేతికి వచ్చేవరకు దానిపై అయ్యే ఖర్చు రూ. 55వేలు దాటి పోవడంతో వారికి నష్టాలే మిగుతున్నాయి. గత రెండు సీజన్లుగా వరి సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూసిన పరిస్థితిలో వ్యవసాయంలో ఖర్చులు తగ్గించడం ఎలా అనే ఆలోచనకు వచ్చిన రైతులు డ్రంసీడర్ మొలకలు చల్లే విధానాలు శాస్త్రీయంగా పరిశీలించి వాటి సాగు విధానంపై అవగాహన పెంచుకొని ఎక్కువ మంది రైతులు రబీ సీజన్‌లో మొలకలు చల్లె విధానంపై ఆసక్తి చూపారు. ఈ విధానం వలన ఒక ఎకరాకు సుమారు రూ.3వేల వరకు ఆదా అవుతుందని దీంతో పాటు ఇతర ఖర్చులు కూడా తగ్గుతుండడం రైతులకు వెసులుబాటు అవుతుంది. వరి నాటు వేయడానికి మొలక చట్టడానికి వ్యత్యాసం చాలా ఉండడంతో రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానంపై అవగాహన కల్పించుకుంటున్నారు. మొకల చల్లే విధానంతో ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడిలో కూడాపెద్దగా తేడా లేకపోవడంతో రైతులు మొలక చల్లే విధానం వైపే ఆసక్తి చూపుతున్నారు.

## క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపాలిటీలలో ముసాయిదా ఓటర్ జాబితాపై స్వీకరించిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిష్కరించి ఓటర్ జాబితా రూపొందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో, మున్సిపల్ కమీషనర్లు, సిబ్బందితో ఓటర్ జాబితా తయారిపై ఆయ న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలలోని 141 వార్డులలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ జాబితాను రూపొందించి జనవరి 1న వార్డుల వారీగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ముసాయిదా జాబితాపై ఇప్పటికే సోమవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించామని, వచ్చినవి వచ్చినట్లుగా పరిష్కరించి ఈనెల 10వ తేదీన మున్సిపాలిటీలలో వార్డుల వారీగా తుది ఓటర్ జాబితా ప్రకటించినట్లు తెలిపారు. ఓటర్ జాబితాలో నమోదై నివసిస్తున్న చిరునామా ప్రకారం ఒకే కుటుంబంలోని సభ్యుల ఓట్లు అన్ని ఒకే వార్డులో వచ్చే విధంగా, ఓటర్ జాబితాలో వార్డుల విభజన, మ్యాపింగ్ లాంటివి వార్డ్‌స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సజావుగా రూపొందిస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అస్కా రం ఉంటుందని అన్నారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ 1 అక్టోబర్ 2025 నాటి ఓటర్ జాబితాను ఆధారంగా చేసుకొని ముసాయిదా ఓటర్ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించడం జరిగిందని వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సక్రమంగా ఓటర్ జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఏఎస్‌డి (ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్) జాబితాను తర్వాత అందజేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, బిజెపి ప్రతినిధి చల్లమల్ల నరసింహ, హబీద్, బిఆర్ఎస్ ప్రతినిధి లవకుశ, సత్యనారాయణ, సిపిఐ(ఎం) ప్రతినిధి గోపి, సూర్యాపేట మున్సిపాలిటి జాబితాపై అలాగే సైదా నాయక్ హుజూర్‌నగర్ మున్సిపాలిటీ ముసాయిదా ఓటర్ జాబితాపై పలు అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాలని కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశానికి బిజెపి నుండి హబీద్, సిపిఐ నుండి బూర వెంకటేశ్వర్లు, బిఎస్‌పి నుండి రాంబాబు, వైఎస్ఆర్‌సిపి నుండి రమేష్, హుజూర్‌నగర్ నుండి గెల్లి రవి, మున్సిపల్ కమీషనర్లు హనుమంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్‌రెడ్డి, మున్వర్‌అలీ, సి సెక్షన్ సూపరిండెంట్ సంతోష్ కుమార్, డిటి వేణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫారం - సి
నోటిఫికేషన్

(సెక్షన్ 11(1) ప్రకారం మరియు 10A మినహాయింపు అనసరించి)
(రూల్ 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ సూర్యాపేట జిల్లా

జిల్లా కలెక్టర్, సూర్యాపేట ఫైల్ నెంబర్: G/2281/2025 తేదీ: 31/12/2025
ఆర్.డి.ఓ సూర్యాపేట ఫైల్ నెంబర్: సి/1957/2025 తేదీ: 29/12/2025
గెజిట్ నెంబర్: 69/2025 తేదీ: 13/09/2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు దిగువ నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లాలోని రావిపహాడ్ గ్రామము, మోతే మండలములోని లో విస్తీర్ణము **ఎ. 17.37 75 గుం. లు** భూమిని రావిపహాడ్ గ్రామంలో ప్రజల ఉపయోగార్థం అనగా సూర్యాపేట జిల్లా, మోతే మండలం అన్నారిగూడెం గ్రామ సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై ఎస్ ఆర్ ఎస్ పి స్టేజ్-ii లోని డిబియం 71 యొక్క 22ఎల్, 36ఎల్ మైనర్ క్రింద నష్టపోతున్న ఆయకట్టుకు అనుభందంగా లిఫ్ట్ ఇరరిగేషన్ పథకం నిర్మాణం కొరకు ఈ దిగువ చూపిన భూములు/ నిర్మాణములు యుక్తముగా అవసరము అయి ఉన్నందున భూసేకరణ చేయుటకు భావించనైనది.

కావున సూర్యాపేట జిల్లాలోని రావిపహాడ్ గ్రామము, మోతే మండలములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము **ఎ. 17.37 75 గుం.** గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారి నుండి భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయనైనది.

గ్రామము: రావిపహాడ్ మండలం: మోతే జిల్లా: సూర్యాపేట

| క్ర. సం. | సర్వే నెం. | భూ సేకరణ చేయు విస్తీర్ణం | భూమి రకము ఖుష్కీ/ తరి | యాజమాన్య విధం (పట్టా/ ప్రభుత్వ / ఇనాం) | భూమి పట్టాదారు/ అనుభవదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు | హద్దులు ఉ | ద | తూ | ప | ప్రదేశంపై ఉన్న చెట్లు/ కట్టడములు/ ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 3 | 0.04 | మెట్ట | పట్టా | బీరెల్లి సుదర్శనమ్మ, భర్త వెంకట్ రెడ్డి (ప&అ) | 3 | 2 | 6 | 4 | కోర్టు కేస్ / ఫ్యామిలి డిస్ప్యూట్ |
| | | 0.04 | | | కోట మధుసూధన్ రెడ్డి, తండ్రి రెడ్డయ్య (అ) | | | | | |
| 2 | 4 | 0.15 | మెట్ట | పట్టా | కాకి వెంకట్ రెడ్డి, తండ్రి రాంరెడ్డి(అ) కొడకండ్ల రామయ్య తండ్రి రంగయ్య (ప) కాకి సరోజనమ్మ, భర్త బిత్తరెడ్డి(ప) కాకి మోహన్ రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) కాకి రాంరెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) కాకి వెంకట్ రెడ్డి, తండ్రి గోపాల్‌రెడ్డి (ప) కొడకండ్ల అనసూర్యమ్మ, భర్త రామయ్య(ప) కాకి లక్ష్మా రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) | 4 | 4 | 3 | రోడ్డు | |
| 3 | 5 | 0.0425 | మెట్ట | పట్టా | కోట మధుసూధన్ రెడ్డి, తండ్రి రెడ్డయ్య (ప&అ) | 5 | 2 | 6 | 3 | |
| 4 | 6 | 0.14 | మెట్ట | పట్టా | కోట మధుసూధన్ రెడ్డి, తండ్రి రెడ్డయ్య (ప&అ) | 6 | 6 | 7 | 2 | |
| | | 0.0425 | | | కోట మధుసూధన్ రెడ్డి, తండ్రి ఉపేందర్ రెడ్డి (అ) కాకి రాంరెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) కాకి వెంకట రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) కాకి లక్ష్మ రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (ప) కోటా మణిదర్ రెడ్డి, తండ్రి. మధుసూదన్ రెడ్డి (ప) కోటా రాములమ్మ, భర్త రాంరెడ్డి (ప) | | | | | బావి-1 |
| 5 | 7 | 0.015 | మెట్ట | పట్టా | కోట ఉపేందర్ రెడ్డి, తండ్రి. ఎల్లయ్య (అ) | 7 | 7 | 8 | 6 | |
| | | 0.025 | | | కోట రాంరెడ్డి, తండ్రి ఎల్లయ్య(అ) కోట వేణుగోపాల్ రెడ్డి, తండ్రి ఉపేందర్ రెడ్డి (ప) కోట రాములమ్మ, భర్త రాంరెడ్డి (ప) | | | | | |
| 6 | 8 | 0.0625 | మెట్ట | పట్టా | కోట రాంరెడ్డి, తండ్రి ఎల్లయ్య (అ) | 8 | 8 | 9 | 7 | |
| 7 | 9 | 0.055 | మెట్ట | పట్టా | కోట ఉపేందర్ రెడ్డి, తండ్రి ఎల్లయ్య (అ) కోట హైమావతి, భర్త ఉపేందర్ రెడ్డి (ప) | 9 | 213 | 213 | 8 | |
| 8 | 16 | 0.0025 | మెట్ట | పట్టా | కోట రాంరెడ్డి, తండ్రి. ఎల్లయ్య (అ)బైసా చంద్ర శేఖర్, తండ్రి. చిన్న కృష్ణయ్య (ప) | 16 | 8 | 8 | 7 | |
| 9 | 25 | 0.02 | మెట్ట | శిఖం | శిఖం ల్యాండ్ | 25 | రోడ్డు | 4 | 51 | |
| 10 | 51 | 0.01 | మెట్ట | ప్రభుత్వ | రోడ్డు | 51 | 62 | 52 | 64 | |
| | | 0.02 | | భూమి | కాకి రాం రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (అ) కాసబోయిన శంకర్ తండ్రి వీరయ్య (ప) వాస లాలు, తండ్రి. బుచ్చిరాములు (ప) గంగరబోయిన బుచ్చయ్య, తండ్రి వీరయ్య (ప) వెలుగు ఉప్పలయ్య, తండ్రి ఎల్లయ్య (ప) G. శంకర్, తండ్రి. వెంకటయ్య(ప) G. శ్రీను, తండ్రి. వెంకటయ్య(ప) | | | | | |
| 11 | 52 | 1.075 | మెట్ట | పట్టా | కోట సంజీవ రెడ్డి, తండ్రి రంగారెడ్డి (ప&అ) కోట వెంకట్ రెడ్డి, తండ్రి రంగారెడ్డి (ప&అ) | 52 | 52 | 53 | 62 | |
| 12 | 53 | 0.05 | మెట్ట | పట్టా | రోడ్డు | 53 | 53 | 51 | 52 | |
| | | 0.145 | | | కాకి బిక్షం రెడ్డి, తండ్రి గోపాల్ రెడ్డి (అ) కాకి సరోజనమ్మ, భర్త బిక్షం రెడ్డి (ప) | | | | | |
| 13 | 62 | 0.01 | మెట్ట | పట్టా | కోట సంజీవ రెడ్డి, తండ్రి రంగారెడ్డి (అ) కోట వెంకట్ రెడ్డి, తండ్రి రంగారెడ్డి (అ) ఆలకుంట్ల మల్లయ్య, తండ్రి శివయ్య (ప) ఆలకుంట్ల లింగయ్య, తండ్రి మల్లయ్య (ప) ఆలకుంట్ల మధు, తండ్రి మల్లయ్య (ప) గుమ్మడపు రవితేజ, తండ్రి సత్యనారాయణ (ప) కోదాటి జగన్, తండ్రి రామయ్య (ప) | 62 | 62 | 52 | 64 | |
| 14 | 64 | 0.135 | మెట్ట | పట్టా | వాసా ఎల్లయ్య,తండ్రి యలమంచి (ప&అ) | 64 | 64 | 52 | 51 | |
| | | 0.17 | | | కుంచం సుగుణమ్మ, భర్త మల్లయ్య (ప&అ) | | | | | |
| | | 0.135 | | | వాస పద్మ, భర్త. యలమంచి (ప&అ) | | | | | |
| | | 0.135 | | | అలకుంట్ల లక్ష్మమ్మ, భర్త మీనయ్య (ప&అ) | | | | | |
| 15 | 65 | 0.27 | మెట్ట | పట్టా | కోట శ్యాంసుందర్ రెడ్డి, తండ్రి వీరారెడ్డి (ప&అ) | 65 | 65 | 64 | 68 | |
| | | 0.02 | | | కోట రంగనాయకమ్మ, భర్త. పాపి రెడ్డి (ప&అ) | | | | | |
| | | 0.01 | | | రోడ్డు | | | | | |
| 16 | 68 | 0.37 | మెట్ట | పట్టా | కోట రాంరెడ్డి, తండ్రి. లగ్మా రెడ్డి (అ)దేవరం శ్రీనివాస్ రెడ్డి, తండ్రి సత్తి రెడ్డి (ప) | 68 | 68 | 65 | 69 | |
| 17 | 69 | 0.08 | మెట్ట | పట్టా | కోట నర్సి రెడ్డి, తండ్రి లక్ష్మా రెడ్డి (అ) కోట నర్సిరెడ్డి, తండ్రి. వెంకటయ్య(ప) కోట ఉదయశ్రీ, భర్త. నర్సి రెడ్డి (ప) | 69 | 69 | 68 | కెనాల్ | |
| | | 0.245 | | | కోట రాం రెడ్డి, తండ్రి లక్ష్మ రెడ్డి (ప&అ) | | | | | |
| 18 | 213 | 0.04 | మెట్ట | పట్టా | అక్కినేపల్లి బ్రహ్మాచారి, తండ్రి రాజయ్య (ప&అ) | 213 | 213 | 220 | 8 | |
| | | 0.04 | | | గంగరబోయిన ఉపేంద్ర, భర్త లింగయ్య (ప&అ) | | | | | |
| | | 0.02 | | | కోట జయమ్మ, భర్త. నారాయణరెడ్డి (ప&అ) | | | | | |
| 19 | 217 | 0.075 | మెట్ట | పట్టా | దుబ్బా ఉపేందర్ రెడ్డి, తండ్రి చిత్రం రెడ్డి (ప&అ) | 217 | 217 | 596 | 218 | |
| 20 | 218 | 0.115 | మెట్ట | పట్టా | అన్నం మోహన్ రెడ్డి, తండ్రి. వెంకట్ రెడ్డి (ప&అ) | 218 | 218 | 217 | 220 | |
| 21 | 221 | 0.07 | మెట్ట | పట్టా | కోట జయమ్మ, భర్త. నారాయణరెడ్డి(ప&అ) | 221 | 221 | 218 | 213 | |
| 22 | 222 | 0.005 | మెట్ట | పట్టా | అన్నం మోహన్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి (అ) | 222 | 217 | 596 | 218 | |
| | | 0.01 | | | అన్నం మోహన్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి (అ) దుబ్బాక ఉపేందర్, తండ్రి బిక్షం రెడ్డి (ప) కోడి సైదులు, తండ్రి. కొమరయ్య (ప) | | | | | |
| 23 | 342 | 0.005 | మెట్ట | పట్టా | షేక్ కరీం, తండ్రి. కమల్ సాబ్(ప&అ) | 342 | 342 | విలేజ్ బౌండరీ | 341 | |
| | | 0.065 | | | షేక్ సైదాబీ, భర్త. సుభాని (అ) | | | | | |
| | | 0.045 | | | షేక్ ముక్తం, తండ్రి. కమల్ సాబ్(అ) | | | | | |
| | | 0.055 | | | షేక్ సైదా, తండ్రి. కమల్ సాబ్(అ) బత్తిని పద్మ, భర్త. వెంకన్న (ప) షేక్ జానిమియా, తండ్రి బిక్కం(ప) బత్తిని సైదులు, తండ్రి వెంకన్న(ప) బత్తిని జాని, తండ్రి. వెంకన్న(ప) షేక్ జానిబాబు, తండ్రి కమలసాబ్ (ప) షేక్ మదార్, తండ్రి. లాల్మహ్మద్ (ప) షేక్ కరీమున్, తండ్రి బాజీ సైదా (ప) | | | | | |
| 24 | 343 | 0.06 | మెట్ట | పట్టా | షేక్ జానిబాబు, తండి కమలసాబ్ (ప&అ) | 343 | 343 | 342 | 344 | |
| | | 0.01 | | | షేక్ సుభానీ తండ్రి. కమాల్ సాబ్ (ప&అ) | | | | | |
| | | 0.06 | | | షేక్ కరీం, తండ్రి. కమల్ సాబ్ (అ)షేక్ ఇమామ్, తండ్రి. బిక్కన్ (ప)షేక్ అజరతాలి, తండ్రి బిక్కన్ సాబ్ (ప)షేక్ నన్నే సబ్, తండ్రి. సుభాన్ సబ్ (ప)షేక్ నన్నే సబ్, తండ్రి. కరీం సాబ్ (ప)షేక్ నాగుల్ మీరా, తండ్రి. కరీం సాబ్ (ప)ముదిరెడ్డి త్రివేణి, భర్త. బిక్షం రెడ్డి (ప) మునికంటి శ్రీవాణి, భర్త. గోపి (ప) | | | | | |
| 25 | 344 | 0.04 | మెట్ట | పట్టా | SRSP కాలువ | 344 | 344 | 343 | 382 | |
| | | 0.16 | | | కోట ప్రభాకర్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి (ప&అ) | | | | | |
| | | 0.24 | | | కోట శేఖర్ రెడ్డి, తండ్రి వెంకట్ రెడ్డి (ప&అ) | | | | | |
| 26 | 345 | 0.005 | మెట్ట | పట్టా | యెల్లబోయిన లింగయ్య, తండ్రి మల్లయ్య (అ) | 345 | 345 | 344 | 382 | |
| | | 0.075 | | | బండి శ్రీను, తండ్రి. సత్తయ్య (అ) బత్తిని సైదులు, తండ్రి వెంకన్న (ప) గునిగంటి చంద్ర శేఖర్, తండ్రి వెంకన్న (ప) పొడవంటి ఉప్పలయ్య, తండ్రి గురువయ్య (ప) దామలెటి కోటేష్, తండ్రి వెంకయ్య(ప) పొడపంగి మంగతాయమ్మ, భర్త శ్రీను (ప) Sk మున్నీ, భర్త చౌహాన్ లక్ష్మ జీ (ప) | | | | | |
| 27 | 380 | 0.10 | మెట్ట | పట్టా | కరింగుల శ్రీను, తండ్రి కోటయ్య(అ) కరింగుల ప్రవళిక, భర్త. కరింగుల శ్రీనివాస్ (ప) | 380 | 380 | 382 | 381 | |
| 28 | 381 | 0.0575 | మెట్ట | పట్టా | కాకి వెంకట్ రెడ్డి, తండ్రి. గోపాల్ రెడ్డి (ప&అ) | 381 | 381 | 380 | వాగు | |
| | | 0.0025 | | | యర్రబోయిన సైదులు, తండ్రి బసవయ్య (అ) కుంచం వెంకన్న, తండ్రి సాయిలు (ప) కుంచం మధుసూధన్ తండ్రి సాయిలు (ప) | | | | | |
| 29 | 382 | 0.09 | మెట్ట | పట్టా | కోట శివ రెడ్డి, తండ్రి ప్రభాకర్ రెడ్డి (ప&అ) | 382 | 382 | 345 | 380 | |
| | | 0.18 | | | కరింగుల శ్రీను, తండ్రి. కోటయ్య (అ) కరింగుల ప్రవళిక, భర్త. కారింగుల శ్రీనివాస్ (ప) | | | | | |
| 30 | 450 | 0.16 | మెట్ట | పట్టా | కాకి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి రాంరెడ్డి (ప&అ) | 450 | 450 | 451 | 467 | |
| | | 0.01 | | | కాకి విజయ భర్త. లింగా రెడ్డి (ప&అ) | | | | | |
| 31 | 451 | 0.05 | మెట్ట | పట్టా | కాకి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి. రాంరెడ్డి (అ) | 451 | 451 | 452 | 450 | |
| | | 0.11 | | | కాకి సంధ్య, భర్త. శ్రీనివాస్ రెడ్డి (ప&అ) | | | | | |
| | | 0.10 | | | కోట ఉపేంద్ర, శ్రీనివాస్ రెడ్డి (అ) | | | | | |
| 32 | 452 | 0.04 | మెట్ట | పట్టా | కాకి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి రాం రెడ్డి (ప&అ) | 452 | 452 | 453 | 451 | |
| 33 | 453 | 0.17 | మెట్ట | పట్టా | సంకటండి ఎలమంచి, తండ్రి రాములు (ప&అ) | 453 | 453 | వాగు | 452 | |
| | | 0.03 | | | కొడివెళ్ల నాగమ్మ, భర్త మైసయ్య(ప&అ) | | | | | |
| | | 0.01 | | | కాకి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి రాంరెడ్డి (అ) మోత్కూరి వీరన్న, తండ్రి. విశ్వనాదం (ప) | | | | | |
| 34 | 454 | 0.005 | మెట్ట | పట్టా | కాకి శ్రీనివాస్ రెడ్డి. తండ్రి. రాం రెడ్డి (అ) సంకబుడ్డి ఎలమంచి, తండ్రి. రామయ్య (ప) | 454 | 453 | వాగు | 452 | |
| 35 | 455 | 0.005 | మెట్ట | పట్టా | కాకి శ్రీనివాస్ రెడ్డి. తండ్రిరాం రెడ్డి (అ) | 455 | 452 | 453 | 451 | |
| 36 | 464 | 0.02 | మెట్ట | పట్టా | రోడ్డు | 464 | 464 | 467 | 465 | |
| | | 0.065 | | | తెల్ల వీరయ్య, తండ్రి వెంకయ్య (ప&అ) | | | | | |
| | | 0.02 | | | మేడిపల్లి మల్లయ్య, తండ్రి వీరయ్య (ప&అ) | | | | | (కొబ్బరి చెట్టు-1, బావి-1, తాటి చెట్టు-1, వేప చెట్టు-1 |
| | | 0.085 | | | కాకి లింగారెడ్డి, తండ్రి చంద్రారెడ్డి (అ) లింగాల చంద్రకళ, భర్త. దయాకర్ (ప) | | | | | |
| 37 | 465 | 0.0425 | మెట్ట | పట్టా | మేడిపల్లి మల్లయ్య తండ్రి వెంకయ్య (అ) | 465 | 465 | 464 | 550 | |
| | | 0.07 | | | కొడపంగి వెంకన్న, తండ్రి వీరయ్య (అ) | | | | | |
| | | 0.07 | | | కొడపంగి సోమయ్య, తండ్రి వీరయ్య (అ) | | | | | |
| | | 0.0525 | | | బాలగాని మహేందర్, తండ్రి. వెంకటేష్ (అ) | | | | | |
| | | 0.055 | | | బాలగాని లింగయ్య, తండ్రి. వెంకటేష్ (అ) | | | | | |
| 38 | 467 | 0.04 | మెట్ట | పట్టా | కాకి రాం రెడ్డి, తండ్రి. వెంకట్ రెడ్డి (ప&అ) | 467 | 467 | 450 | 464 | పామ్ ఆయిల్ చెట్లు-10 |
| | | 0.22 | | | కాకి లింగారెడ్డి, తండ్రి చంద్రారెడ్డి (ప&అ) | | | | | |
| 39 | 550 | 0.07 | మెట్ట | పట్టా | బాలగాని లింగయ్య, తండ్రి వెంకటేష్ (ప&అ) | 550 | 550 | 464 | 576 | పైపులు -20 |
| | | 0.01 | | | పొడపంగి గురువయ్య, తండ్రి పెద మైసయ్య (అ) పొడపంగి నాగమ్మ, భర్త గురువయ్య (ప) | | | | | |
| | | 0.0525 | | | పొడపంగి వెంకన్న తండ్రి పెద్ద మైసయ్య (అ) పొడపంగి నాగమ్మ, భర్త వెంకన్న (ప) | | | | | |
| | | 0.04 | | | బాలగాని లింగయ్య, తండ్రి వెంకటేష్(ప&అ) | | | | | పైపులు -6 |
| | | 0.04 | | | బాలగాని మహేందర్, తండ్రి వెంకటేష్ (ప&అ) | | | | | |
| | | 0.08 | | | దామలేటి వెంకన్న, తండ్రి వెంకయ్య (ప&అ) | | | | | |
| | | 0.03 | | | చెరువు కాలువ | | | | | |
| 40 | 576 | 0.045 | మెట్ట | పట్టా | పొడపంగి గురువయ్య, తండ్రి పెద్ద మైసయ్య (అ) | 576 | 576 | 550 | 577 | పైపులు -7 |
| | | 0.01 | | | శాయమిలేటి వెంకన్న, తండ్రి. వెంకయ్య (అ) | | | | | |
| | | 0.05 | | | పొడపంగి గురువయ్య, తండ్రి పెద్ద మైసయ్య (అ) బొల్లా పెదరాం రెడ్డి, తండ్రి నర్సయ్య (ప) బొల్ల చిన రాం రెడ్డి, తండ్రి. వీరయ్య (ప) మోత్కూరి సత్యం, తండ్రి. వీరయ్య (ప) పొడపంగి గురువయ్య, తండ్రి పెద్ద మైసయ్య (అ) | | | | | |
| 41 | 577 | 0.0575 | మెట్ట | పట్టా | కోటనారాయణ రెడ్డి, తండ్రి వేల్పద్రయ్య (ప) ఏడ వెల్లి కళ్యాణి, భర్త. మహేష్(ప) బొల్లా చినరాంరెడ్డి, తండ్రి ఎల్లయ్య (ప) | 574 | 577 | 576 | 586 | |
| 42 | 585 | 0.0375 | మెట్ట | పట్టా | పెంటి రాములు, తండ్రి నారాయణ (అ) | 585 | 585 | 577 | 591 | |
| 43 | 586 | 0.0525 | మెట్ట | పట్టా | కాసర్ల పాండా రెడ్డి, తండ్రి పెద్ద రామయ్య (ప&అ) | 586 | 586 | 577 | 585 | |
| | | 0.035 | | | కాసర్ల లక్ష్మా రెడ్డి, తండ్రి. పెద రామయ్య (అ) కాసర్ల హేమలత, భర్త. పాండ రెడ్డి (ప) | | | | | |
| | | 0.0425 | | | కాసర్ల పాండా రెడ్డి, తండ్రి. పెద్ద రాం రెడ్డి (ప&అ) | | | | | |
| | | 0.025 | | | పెంటి రాములు, తండ్రి నారాయణ (ప&అ) | | | | | |
| 44 | 591 | 0.01 | మెట్ట | పట్టా | పెంటి రాములు, తండ్రి నారాయణ (అ) | 591 | 585 | 586 | 592 | |
| | | 0.035 | | | కాసర్ల లక్ష్మా రెడ్డి తండ్రి పెద రామయ్య (అ) కాసర్ల పాండా రెడ్డి, తండ్రి పెదరామయ్య (ప) నాగిరెడ్డి శైలజ, భర్త. రంగారెడ్డి (ప) | | | | | |
| 45 | 592 | 0.05 | మెట్ట | పట్టా | ఏనుగు సుధారాణి, భర్త సత్యనారాయణ రెడ్డి (ప&అ) | 592 | 592 | 591 | 594 | |
| | | 0.03 | | | కాసర్ల లక్ష్మా రెడ్డి, తండ్రి రామయ్య (అ) | | | | | |
| | | 0.04 | | | ఏనుగు పద్మ, భర్త వెంకట్ రెడ్డి (అ) పొడపంగి శ్రీను, తండ్రి. వెంకటయ్య (ప) పెంటి రాములు, తండ్రి. నారాయణ (ప) | | | | | |
| 46 | 593 | 0.025 | మెట్ట | పట్టా | ఏనుగు పద్మ, భర్త. వెంకట్ రెడ్డి (అ) పెంటి రాములు, తండ్రి. నారాయణ (ప) ఏనుగు సుధారాణి, భర్త సత్యనారాయణ రెడ్డి (ప) | 593 | 595 | 592 | 594 | |
| 47 | 594 | 0.0525 | మెట్ట | పట్టా | పెరుగు మల్లయ్య తండ్రి. పుల్లయ్య (అ) పెరుగు పుల్లయ్య తండ్రి గురుమల్లు (ప) | 594 | 594 | 592 | 596 | |
| | | 0.0025 | | | కాలువ | | | | | |
| | | 0.095 | | | పెరుగు లింగయ్య తండ్రి రామయ్య (ప&అ) | | | | | |
| 48 | 596 | 0.05 | మెట్ట | పట్టా | దుబ్బా ఉపేందర్ రెడ్డి, తండ్రి బిక్షం రెడ్డి (ప&అ) | 222 | 596 | 594 | 217 | |
| 49 | vagu | 0.09 | మెట్ట | ప్రభుత్వ | ప్రభుత్వం | - | - | - | - | వాగు |
| | | 17.32 75 | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని దాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) సవరించబడిన భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 ( కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, సూర్యాపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదేన పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, సూర్యాపేట వారు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, సూర్యాపేట వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ -12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటన ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు /తాకట్లకు మొదలగు లావాదేవీల చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ - 15 ప్రకారంజిల్లా కలెక్టర్, సూర్యాపేట / భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, సూర్యాపేట గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి యున్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, సూర్యాపేట
సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట.

DIPR RO NO. 988/LA/PP/Advt/Pub/2025-26


# విధుల నిర్వహణలో సిఎక్యూఎం విఫలం

## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి..

## ఆ తరువాతే పరిష్కారం కోసం ప్రయత్నించాలన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ నివారణ విషయంలో 'వాయు నాణ్యత నిర్వహణ కమిషన్' (సిఎక్యూఎం) పనితీరుపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ సరిహద్దుల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి టోల్ ప్లాజాల తాత్కాలిక మూసివేత లేదా తరలింపుపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా అత్యున్నత ధర్మాసనం సిఎక్యూఎంపై అసహనం వ్యక్తం చేసింది. టోల్ ప్లాజాల తరలింపు లేదా మూసివేత అంశంపై నిర్ణయం తీసుకోవడానికి కమిషన్ రెండు నెలల సమయం కోరగా, కోర్టు దానిని తీవ్రంగా తప్పుబట్టింది. 'సిఎక్యూఎం తన విధులను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమవుతోంది. ముందు కాలుష్యానికి గల కారణాలను గుర్తించాలని, ఆ తర్వాతే పరిష్కారం కోసం ప్రయత్నించాలి. జనవరి 2న సమావేశం నిర్వహించి, మళ్లీ రెండు నెలల సమయం కావాలని అడగడం ఆమోదయోగ్యం కాదు. రెండు వారాల్లో నిపుణుల సమావేశం నిర్వహించాలి. కాలుష్యం తీవ్రత పెరగడానికి గల ప్రధాన కారణాలపై నివేదిక సమర్పించాలి. ఇన్ని రోజులు గడిచినా కాలుష్యానికి గల అసలు కారణాలను గుర్తించారా? పబ్లిక్ డొమైన్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉందని నిపుణులు వ్యాసాలు రాస్తున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను మాకు మెయిల్ చేస్తున్నారు. కమిషన్ ఏం చేస్తోంది? భారీ వాహనాలు కాలుష్యానికి పెద్ద ఎత్తున కారణమవుతున్నాయని అందరికీ తెలుసు. అయితే వాటిని ఎలా నియంత్రించాలి అనేదే మొదటి ప్రశ్న. కాలుష్య సమస్యకు సంబంధించి దశలవారీగా దీర్ఘకాలిక పరిష్కారాలను పరిగణనలోకి తీసుకోవాలి. టోల్ ప్లాజాల అంశాన్ని కూడా సమగ్రంగా పరిశీలించాలి. టోల్ ప్లాజాల సమస్యతో పాటు, కాలుష్య నివారణకు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీర్ఘకాలిక పరిష్కారాలను దశలవారీగా అమలు చేయాలి' అని సుప్రీంకోర్టు సూచించింది.

### రైతులను నిందించడం సరికాదు

బస్సులు, ట్రక్కులు, పంట వ్యర్థాల దహనం తదితర కారణాల వల్ల ఢిల్లీలో కాలుష్య సమస్య తీవ్రమవుతోందని అధికారులు నివేదికలో పేర్కొనడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కాలుష్యానికి బస్సులు, ట్రక్కులే కారణమని చెప్పడం చాలు సులభమమని పేర్కొంది. కానీ, వాటిని నిలిపివేస్తే సామాన్య పౌరులు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. కాలుష్యం ప్రస్తావన వచ్చినప్పుడల్లా రైతులను నిందించడం సరికాదంటూ వ్యాఖ్యానించింది. ఈ సమస్యపై ఊహలకు బదులు శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని సిఎక్యూఎంను ఆదేశించింది. కొవిడ్ సమయంలో రైతులు పెద్ద మొత్తంలో పంట వ్యర్థాలను తగలబెట్టారని, అయినప్పటికీ ఢిల్లీలో కాలుష్య సమస్య రాలేదని సుప్రీం కోర్టు ప్రస్తావించింది. ప్రస్తుత కాలుష్యానికి పంట వ్యర్థాల దహనం, వాహనాలు మాత్రమే కాకుండా ఇంకా సంక్లిష్టమైన కారణం ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమస్యకు గల ప్రధాన కారణాన్ని గుర్తించగలిగారా? అని అధికారులను ప్రశ్నించింది. కాలుష్య సమస్యపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు సూచించింది. ముందుగా కాలుష్యానికి గల ప్రధాన కారణాలను గుర్తించాలని, తర్వాత దాన్ని ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనాలని ఆదేశించింది. కాలుష్య నివారణ చర్యలపై ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని సూచించింది.

# యుపిలో 2.28 కోట్ల ఓటర్ల తొలగింపు

## 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

## గత జాబితాలో ఉన్న ఓటర్లలో 12.55 కోట్ల మంది కొనసాగింపు






**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో 2.89 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తర్వాత రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) నవదీప్ రిన్వా తెలిపారు. గతంలో జాబితాలో ఉన్న 15.44 కోట్ల మంది ఓటర్లలో 12.55 కోట్ల మందిని జాబితాలో కొనసాగించినట్లు ఆయన చెప్పారు. అయితే 18.70 శాతం, అంటే సుమారు 2.89 కోట్ల మంది ఓటర్లను తొలగించామని, మరణాలు, శాశ్వత వలసలు లేదా బహుళ నమోదుల కారణంగా ముసాయిదా జాబితాలో చేర్చలేదని మంగళవారం లక్నోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల గణన కార్యక్రమాన్ని చేపట్టిందని, ఓటర్లు లేదా వారి కుటుంబ సభ్యులు గణన ఫారాలను పూరించి సంతకం చేయాల్సి ఉంటుందని రిన్వా చెప్పారు. ఈ ప్రక్రియ వాస్తవానికి డిసెంబర్ 11న ముగియాల్సి ఉండగా, దాదాపు 2.97 కోట్ల మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుండి తొలగిపోతున్నట్లు గమనించి రాష్ట్రం అదనంగా 15 రోజుల సమయం కోరిన ఫలితంగా గణన దశను డిసెంబర్ 26 వరకు పొడిగించారు. సిఇఒ వెల్లడించిన వివరాల ప్రకారం... అక్టోబర్ 27, 2025 నాటి ఓటర్ల జాబితాలో ఉన్న 15,44,30,092 మంది ఓటర్లలో 12,55,56,025 మంది ఓటర్ల నుండి గణన ఫారాలు అందాయి. ఇది మొత్తం ఓటర్లలో 81.30 శాతానికి సమానం. ముసాయిదా జాబితా ప్రచురణ తేదీగా మొదట డిసెంబర్ 31ని నిర్ణయించినప్పటికీ, సమాంతరంగా జరిగిన క్షేత్రస్థాయి పనులు, పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించడానికి ఇసిఐ ఇచ్చిన సూచనల కారణంగా జాప్యం జరిగిందని రిన్వా చెప్పారు. గతంలో ఉన్న 1,500 మంది ఓటర్ల నిబంధనకు బదులుగా, కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్యను 1,200కి పరిమితం చేసింది. ఈ అవసరాన్ని తీర్చడానికి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,030 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రక్రియకు డిసెంబర్ 23న ఆమోదం లభించిందని, డేటాను సర్వర్‌లకు బదిలీ చేయడానికి సుమారు వారం రోజులు పట్టిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మరో ఆరు రోజుల సమయం కోరామని, ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించామన్నారు. ముసాయిదా జాబితా నుండి 2.89 కోట్ల పేర్లను తొలగింపుపై రిన్వా మాట్లాడుతూ 46.23 లక్షల మంది ఓటర్లు (2.99 శాతం) మరణించినట్లు గుర్తించామని, అయితే 2.57 కోట్ల మంది ఓటర్లు (14.06 శాతం) శాశ్వతంగా వలస వెళ్లారని లేదా ధృవీకరణ ప్రక్రియ సమయంలో అందుబాటులో లేరని తెలిపారు. మరో 25.47 లక్షల మంది ఓటర్లు (1.65 శాతం) ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం ముసాయిదా ఓటర్ల జాబితాలో 12.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు, ఇది రాష్ట్రంలోని మొత్తం 75 జిల్లాలు, 403 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తుందన్నారు. ఈ ప్రక్రియలో 1,72,486 పోలింగ్ కేంద్రాలు పాలుపంచుకున్నాయని, బూత్ స్థాయి అధికారులు వలంటీర్లతో కలిసి ఓటర్లను సంప్రదించచారని, గుర్తింపు పొందిన పార్టీలు నియమించిన 5,76,611 మంది బూత్ స్థాయి ఏజెంట్లు ఈ ప్రక్రియలో సహాయపడ్డారని పేర్కొంటూ, రాజకీయ పార్టీల మద్దతును కూడా అంగీకరించినట్లు రిన్వా తెలిపారు. జనవరి 6 నుండి ఫిబ్రవరి 6 వరకు ఒక నెల రోజుల పాటు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కాలం ప్రారంభమవుతుందని, ఈ సమయంలో ఓటర్లు ముసాయిదా జాబితాలో చేర్పులు, సవరణలు కోరవచ్చని లేదా అభ్యంతరాలు లేవనెత్తవచ్చని సిఇఒ తెలిపారు.

# తొక్కిసలాట మరణాలపై విజయ్‌కు సిబిఐ సమన్లు



**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాట కేసులో నటుడు, రాజకీయవేత్త, తమిళగ వెట్రి కళగం (టివికె) చీఫ్ విజయ్‌కు సిబిఐ సమన్లు పంపింది. ఈనెల 12న తమ ముందు హాజరుకావాలని కోరింది. కరూర్ జిల్లా వేలుస్వామిపురంలో 2025 సెప్టెంబర్ 27న టివికె ర్యాలీ నిర్వహించింది. పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన సిబిఐ ఇప్పటికే టివికె కీలక నేతల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తునకు తొలుత తమిళనాడు ప్రభుత్వం నిరాకరించింది. కేసును ప్రత్యేక విచారణ బృందం (సిట్)కు అప్పగించింది. శాంతి భద్రతలు.. రాష్ట్ర పరిధిలోకి వచ్చే అంశమని, సిట్ సమర్థవంతంగా దర్యాప్తు జరుపుతుందని కోర్టు ముందు తమిళనాడు ప్రభుత్వం వాదించింది. దీనిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును టివికె ఆశ్రయించింది. కరూర్ తొక్కిసలాట ఘటన దేశాన్ని కుదిపేసిందని, దీనిపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తును సిట్ నుంచి సిబిఐకి అప్పగించింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన సిబిఐ ఈ ఈవెంట్‌కు పర్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి క్రౌడ్ మేనేజ్‌మెంట్ చర్యలు, పోలీసుల మోహరింపు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వంటి అంశాలపై విచారణ జరిపింది. టివికె నేతలు, అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది.

# కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడి కన్నుమూత



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి, పుణె మాజీ ఎంపి సురేశ్ కల్మాడి (81) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పుణెలోని దీననాథ్ మంగేష్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్తతో రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సురేశ్ కల్మాడి రాజకీయాలతో పాటు క్రీడా పరిపాలన రంగంలోనూ కీలక పాత్ర పోషించారు. పుణె నుంచి పలుమార్లు లోక్‌సభకు ఎన్నికైన ఆయన, కేంద్ర రైల్వే శాఖలో సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాదు, భారతీయ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఎ) అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. సురేశ్ కల్మాడి కుటుంబ వివరాల ప్రకారం, ఆయనకు భార్య, ఒక వివాహిత కుమారుడు, కోడలు, ఇద్దరు వివాహిత కుమార్తెలు, అల్లుళ్లు, మనవళ్లు ఉన్నారు. ఆయన భౌతికకాయం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు పుణెలోని ఎరండవణే ప్రాంతంలోని కల్మాడి హౌస్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు నవి పేఠ్‌లోని వైకుంఠ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

**సైనిక సేవ నుంచి రాజకీయాల్లోకి**

సురేశ్ కల్మాడి 1944 మే 1న జన్మించారు. పుణెలోని సెయింట్ విన్సెంట్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన, ఫెర్గూసన్ కాలేజీలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. 1960లో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరిన కల్మాడి, 1964 నుంచి 1972 వరకు భారత వైమానిక దళంలో పైలట్‌గా సేవలందించారు. 1965, 1971 భారత్– పాకిస్థాన్ యుద్ధాల్లో ఆయన సక్రియంగా పాల్గొన్నారు. వైమానిక దళ సేవ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన సురేశ్ కల్మాడి, పుణె రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.

# హర్యానాలో మాదకద్రవ్యాలు వ్యాప్తి

## యువతరానికి తీవ్ర ముప్పు

## రుణదీప్ సుర్జేవాలా

**చండీగఢ్:** హర్యానా అంతటా మాదకద్రవ్యాల దుర్వినియోగం విస్తృతంగా వ్యాపించిందని, ఇది యువతరానికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తోందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. మాదకద్రవ్యాలు గ్రామాలు, పట్టణాలు, నివాస కాలనీలకు చేరాయని, ఇది ఒక పెద్ద సామాజిక సమస్యగా మారిందని ఆయన మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా మారిందని, గ్రామాల్లోని వృద్ధులు మాదకద్రవ్య వ్యసనం కారణంగా మరణించిన యువకుల పేర్లను వ్రాయవలసి వస్తుందని ఆయన ఆరోపించారు. ఈ మరణాలు కేవలం గణాంకాలు మాత్రమే కాదని, అవి విచ్ఛిన్నమైన కుటుంబాలను, నాశనం చేయబడిన భవిష్యత్తును సూచిస్తాయని ఆయన అన్నారు. అధికారిక రికార్డులలో అనేక గ్రామాలు 'మాదకద్రవ్య రహితం'గా ప్రకటించబడినప్పటికీ, మాదకద్రవ్య వ్యసనం క్షేత్రస్థాయిలో అదుపు లేకుండా కొనసాగుతోందని, ప్రభుత్వ మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారాలు కాగితపు పని, ప్రచారానికే పరిమితం అయ్యాయని ఆయన ఆరోపించారు.

# మనుషుల కన్న వీధి కుక్కల పిటిషన్లే ఎక్కువ:'సుప్రీం'

**న్యూఢిల్లీ:** వీధి కుక్కల కేసులో అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల కేసులో దాఖలైన అనేక రకాలైన కేసులను పరిగణనలోనికి తీసుకున్న మానవుల కేసులలో కూడా సాధారణంగా ఇన్ని దరఖాస్తులు రావని సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంగళవారం ఇద్దరు న్యాయమూర్తులు వీధికుక్కల విషయాన్ని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ప్రస్తావించినప్పుడు బెంచ్ పరిశీలనలు చేసింది.ఈ కేసులో తాము మధ్యంతర దరఖాస్తును దాఖలు చేశామని న్యాయవాదులలో ఒకరు చెప్పారు. సాధారణంగా అధిక సంఖ్యలో దరఖాస్తులు మానవకేసులలో కూడా ఇంతమొత్తంలో రావని జస్టిస్ సందీప్ వ్యాఖ్యానించారు. వీధికుక్కల కేసులు అత్యున్నత న్యాయస్థానం ముందుకు గురువారం విచారణకు వస్తాయని ధర్మాసనం తెలిపింది.మరో న్యాయవాది సుప్రీంకోర్టులో బదిలీ పిటిషన్ గురించి ప్రస్తావించినప్పుడు బుధవారం అనేక పిటిషన్లు విచారణకు వస్తాయని ధర్మాసనం అందరు న్యాయవాదులను విచారిస్తుందని అన్నారు. ఈ కేసును బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి.అంజారియాలతో కూడిన ముగ్గురు న్యాయమూపర్తుల ప్రత్యేక ధర్మాసనం విచారించనుంది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, సంస్థాగత ప్రాంతాలలో కుక్కకాటు సంఘటనలు ఆందోళనకమైన పెరుగుదలలు గమనించిన సుప్రీంకోర్టు, గతేడాది నవంబరు 7న స్టెరిలైజేషన్ తర్వాత వీధికుక్కలను నియమించబడిన ఆశ్రయాలకు తరలించాలని అధికారులను ఆదేశించింది. అలాగే పట్టుకువచ్చిన వీధికుక్కలను వాటిని ఎత్తుకొచ్చిన చోటే తిరిగి వదలవొద్దని కూడా ధర్మాసనం ఆదేశించింది. అన్ని పశువులను, జంతువులను విచ్చలవిడిగా రహదారులు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపైకి ఒదలవొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. క్రీడా సముదాయాలు, సహా సంస్థాగత ప్రాంతంలో కుక్కకాటు సంఘటనలు పునరావృతం పరిపాలనా ఉదాసీనతను మాత్రమే కాకుండా ఈ ప్రాంగణాలను నివారించగల ప్రమాదాల నుండి రక్షించడంలో 'వ్యవస్థాగత వైఫల్యాన్ని' కూడా ప్రతిబింబిస్తుందని ధర్మాసనం చెప్పింది. వీధి కుక్కల వ్యవహారంలో సుమోటో కేసులో సుప్రీంకోర్టు అనేక ఆదేశాలు జారీచేసింది. దేశ రాజధానిలో కుక్కకాటు నుండి రేబిస్ వరకు ముఖ్యంగా పిల్లలలో తీవ్రమైన వ్యాధుల గురించి మీడియా నివేదికపై గత ఏడాది జులై 28 ప్రారంభించబడిన సుమోటో కేసును ధర్మాసనం విచారిస్తోంది.

# భారత్‌పై మళ్లీ సుంకాల కత్తి

భారత్ నుంచి దిగుమతులపై ఇప్పటికే 50 శాతం సుంకాలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాను ఆశించిన వాణిజ్య ఒప్పందాన్ని సాధించలేకపోయారు. ఆ తదుపరి కూడా తెరవెనుక, బాహాటంగా పలు దఫాలు చర్చలు జరిగాయి. ఒప్పందం దాదాపు తుది రూపానికి వచ్చినట్లు ఇరుపక్షాలు ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ అది సంతకాల బల్లవద్దకు రాలేదు. అంటే అమెరికా వ్యవసాయోత్పత్తులకు భారత్ మార్కెట్‌ను మరింత బార్లా తెరిచే అంశంపై అమెరికా కోరుతున్నంతగా భారత ప్రభుత్వం లొంగుబాటు ప్రదర్శించలేదని విదితమవుతున్నది. అంతర్జాతీయ న్యాయసూత్రాలకు బదులు ఇతర దేశాలను బెదిరించి లొంగదీసుకునే విధానాన్ని తన విదేశాంగవిధాన సూత్రంగా మార్చిన అధ్యక్షుడు ట్రంప్ గత సంవత్సరకాలమంతా దిగుమతి సుంకాలను ఆయుధంగా ఉపయోగించి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కుదిపివేశారు. నూతన సంవత్సరం ఆరంభంలో ఇతర దేశాల్లోని వనరులను కొల్లగొట్టేందుకై ప్రత్యక్ష సైనిక దురాక్రమణకు పాల్పడే విధానానికి తెరలేపి వెనిజులా అధ్యక్షుడు మదురో దంపతులను బందీలుగా అమెరికా తీసుకువచ్చి 'నార్కో టెర్రరిజం' ఆరోపణతో కేసుమోపి న్యూయార్క్ కోర్టుముందు హాజరు పరిచారు. మదురో ఆ ఆరోపణను తిరస్కరించారు. వెనిజులా సుప్రీంకోర్టు ఆదేశంపై అధ్యక్ష బాధ్యతలు చేబట్టిన ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాము చెప్పినట్లు నడుచుకోకపోతే మరోసారి దాడి చేయాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరిక జారీ చేశారు. అంతేనా? సామ్రాజ్యవాద దురహంకారంతో 'ప్రపంచ పోలీసు', 'ప్రపంచ న్యాయాధిపతి' పాత్రలను తనకుతాను ప్రదర్శిస్తున్న ట్రంప్ క్యూబా, కొలంబియా, డెన్మార్క్‌లకు హెచ్చరిక జారీ చేశాడు. డెన్మార్క్ భూభాగమైన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న ఉద్దేశాన్ని పునరుద్ఘాటించాడు. మత్తు పదార్థం కొకైన్ ఎగుమతి చేస్తున్నట్లు ఆరోపిస్తూ, కొలంబియాపై సైనిక చర్య తప్పదన్నారు. ఇతర దేశాల ఖనిజ సంపదను కొల్లగొట్టే ఉద్దేశ్యంతో తప్పుడు ఆరోపణలతో కయ్యానికి కాలుదువ్వుతున్న డోనాల్డ్ ట్రంప్ దురహంకారం పేట్రేగిపోతున్నది. ఒకవైపు శాంతి ప్రవక్తలా ఫోజు పెడుతూ గాజా, లెబనాన్, ఇరాన్‌లపై ఇజ్రాయెల్ సాగిస్తున్న విధ్వంస బాంబుదాడులను సమర్థిస్తున్న ఈ పెద్ద మనిషి నిజ స్వరూపం నగ్నంగా బయటపడింది. ఇరాన్ అణుశక్తి స్థావరాలపై ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా విమానాలు కూడా బాంబులు వేశాయి. అంతర్జాతీయ అభిప్రాయం మాత్రమే అతని అహంకారం దించగలుగుతుంది. ప్రపంచంపై పెత్తనం కోసం దురాక్రమణ యుద్ధాలకు దిగిన అమెరికన్ అధ్యక్షులందరూ ఘోరంగా ఓటమి పొందిన చరిత్రను ట్రంప్ మరిచిపోయినట్లున్నారు.

రెండోవైపున, రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ముగింపుజేస్తున్నట్లు ప్రకటిస్తూ, ట్రంప్ రష్యాకు వ్యతిరేకంగా యూరప్ మిత్రుల ఒత్తిళ్లకు తలొగ్గటంవల్ల జెలెన్స్కీ తోక జాడిస్తున్నాడు. రష్యాను దెబ్బతీసే లక్ష్యంలో వారందరూ ఒకటే. రష్యా యుద్ధ కృషిని దెబ్బతీసే పేరుతో ఇ.యు. అనేక ఆర్థిక ఆంక్షలు విధించగా, రష్యా ఆయిలు దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాలపై ట్రంప్ సుంకాల యుద్ధానికి దిగారు. ఆశించిన ఫలితం రాలేదు.

భారత్‌ను ఆసియాలో చైనాకు వ్యతిరేకంగా వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్న ట్రంప్ తమ షరతులపై వాణిజ్య ఒప్పందంకోసం భారత్‌నుంచి దిగుమతులపై 25 శాతం, తమ ఆదేశం పాటించకుండా రష్యానుంచి క్రూడ్ కొనుగోలు చేస్తున్నందుకు మరో 25శాతం సుంకాలు విధించారు. 50 శాతం సుంకాలు విధించబడిన దేశాలు బ్రెజిల్, భారత్ మాత్రమే. ఈ రెండు పెద్ద దేశాలు – రష్యా, చైనాలతో పాటు బ్రిక్స్ సభ్యదేశాలు. కాబట్టి ట్రంప్ కోపకారణాన్ని ఊహించుకోవచ్చు.


తమ ఆయిలు అవసరాల్లో 75 శాతం వరకు దిగుమతులపై ఆధారపడిన భారతదేశం ఏ ఒక్క దేశంపైనా ఆధారపడకుండా 'వ్యూహాత్మక స్వాతంత్ర్యం' పాటిస్తూ అమెరికా సహా పలుదేశాలనుంచి దిగుమతులు చేసుకుంటున్నది. రష్యా నుండి కొనుగోలుపై అమెరికా హెచ్చరిక తదుపరి దిగుమతి క్రమంగా తగ్గించింది. అయితే రష్యా–ఉక్రేన్ మధ్య ట్రంప్ శాంతి ఒప్పందం కుదుర్చుతారని, 25శాతం సుంకం ఎత్తివేస్తారని భారత ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, శాంతి ఒప్పందం సాధించలేని తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికన్నట్లు, రష్యా నుంచి గత నెలలో దిగుమతి సాకుగా చూపి త్వరలోనే భారత్ సరకులపై సుంకం మరికొంత పెంచుతానని చెప్పటం ట్రంప్ దుర్నీతికి నిదర్శనం. 'ప్రధాని మోదీ మంచి మిత్రుడే – అయితే మాట వినటం లేదన్న' దుగ్ధతో ట్రంప్ బ్లాక్ మెయిల్‌కు ఒడిగడుతున్నారు. ఇది గర్హనీయం.



## సిఎం సిద్ధకు డికె శుభాకాంక్షలు

కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధ రామయ్య ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని విశ్వాసం వ్యక్తం చేసినందుకు ఆయనకు నా శుభాకాంక్షలు. మా మధ్య ఎలాంటి గందరగోళం లేదు . మీడియానే గందరగోళం సృష్టిస్తోంది. కర్ణాటకలో అత్యధిక కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా దేవరాజ్ అర్స్ రికార్డును సమంచేసిన సిద్ధ రామయ్యకు అభినందనలు. ఆయనకు విజయం కలగాలని కోరుకుంటున్నా.

- కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్



## భౌతిక, ఖగోళ శాస్త్రాలకు పునాదులు వేసిన గెలీలియో

1610 జనవరి 07న, గెలీలియో బృహస్పతి లేదా జుపిటర్ గ్రహం యొక్క నాలుగు అతిపెద్ద చంద్రులను తన తొలి సారి గుర్తించాడు. ఈ ఆవిష్కరణ సౌర వ్యవస్థపై మన అవగాహనను విప్లవాత్మకంగా మార్చి వేసింది. 1785లో ఇదే రోజున ఫ్రాన్సో గ్యాస్ బెలూన్ని ఉపయోగించి మొట్టమొదటి మానవ సహిత విమానయానం చేయడం కూడా జరిగింది, ఇది విమానయాన చరిత్రలో ఒక మైలురాయిని సృష్టించింది.

ఆధునిక విజ్ఞాన శాస్త్ర పితామహుడు: గెలీలియో గెలీలీ యొక్క ప్రధాన ఆవిష్కరణలు శాస్త్రీయ పద్ధతికి మార్గదర్శకత్వం వహించడమే కాకుండా ఆధునిక భౌతిక శాస్త్ర నియమాలను (పడిపోయే వస్తువుల ధర్మాలు, భ్రమణాలు, జడత్వం, లోలకం సూత్రాలు వంటివి), భూమి యొక్క కక్ష్య, సూపర్ నోవా, చంద్రుని ఉపరితల పరిశీలనలు, శని గ్రహ వలయాలు, బృహస్పతికి సంబంధించిన చంద్రులు, శుక్రుని పదబంధాలు, సూర్యుడి మచ్చలు వంటి టెలిస్కోపిక్ ఆవిష్కరణలతో విప్లవాత్మకమైన ఖగోళ శాస్త్రాన్ని స్థాపించడం, అదే సమయంలో సూర్య కేంద్రిత సౌరమండల నమూనాను సమర్థించడం, అప్పటికి ఉన్న భూమి కేంద్రీకృత దృక్పథానికి బదులుగా పాలపుంతలో సూర్య కేంద్రీకృత సౌర వ్యవస్థను నిరూపించడం జరిగింది. సాంప్రదాయ తత్వశాస్త్రంపై ప్రయోగాలు, ఆధారాలను నొక్కి చెప్పడం, జ్ఞానాన్ని ఎలా అనుసరించాలో ప్రయోగాత్మకంగా రుజువు చేసి తెలిపినందున గెలీలియోను 'ఆధునిక విజ్ఞాన శాస్త్ర పితామహుడు (ఫాదర్ ఆఫ్ మాడ్రన్ సైన్స్)' అని సగర్వంగా పిలుస్తారు.

గెలీలియో లేకుండా సైన్స్ ప్రస్తావన ఊహించడం కష్టం. తన శాస్త్రీయ నియమాలను ప్రయోగాత్మకంగా నిరూపించిన మొదటి వ్యక్తి ఆయన. భౌతిక శాస్త్రంతో పాటు ఖగోళ శాస్త్ర రంగాలను స్థాపించడంలో ఆయన గొప్పగా దోహదపడ్డారు. ఇటలీలోని పిసాలో ఫిబ్రవరి 15, 1564న జన్మించి 1842 వరకు దాదాపు 78 ఏండ్ల పాటు జీవించారు. ఆయన పునరుజ్జీవనోద్యమ కాలంలో పలు పరిశోధనలు చేశారు. సూర్యకేంద్ర నమూనాను ప్రతిపాదించినందుకు కాథలిక్ చర్చి నుండి ప్రతికూలతను ఎదుర్కొన్నప్పటికీ, గెలీలియో కృషి భవిష్యత్ శాస్త్రవేత్తలను ప్రభావితం చేస్తూనే ఉంది, కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం కూడా చేస్తున్నది.

*(07 జనవరి జూపిటర్ గ్రహం చుట్టూ ఉపగ్రహాలను కనుగొన్న రోజు సందర్భంగా)*

# ఐక్య కార్మికోద్యమం నేటి అవసరం



చలసాని వెంకట రామారావు
9490952093
ఎఐటియుసి ఎపి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు

1970 సంవత్సరం భారతదేశ తొలి కేంద్ర కార్మిక సంఘం ఎ.ఇ.టి.యు.సి. చీలికకు గురై సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సి.ఇ.టి.యు.) స్థాపన జరిగింది. 1960 దశకంలో భారత కార్మిక వర్గం అనేక చీలికలకు గురైంది. సోషలిస్టు యూనిటీ సెంటర్ (ఎస్.యు.సి) అస్థిత్వంలోకి వచ్చాక ఒక చీలిక ఏర్పడి యు.టి.యు.సి. (లెనిన్ సారణి) అనే సంస్థ ఏర్పడింది. సోషలిస్టు పార్టీలో వచ్చిన చీలిక వలన హెచ్ . ఎం . ఎస్. నుండి చీలిన గ్రూప్ హెచ్.ఎం.కె.పి. ఏర్పాటు చేసింది. 1964లో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన విభేదాల కారణంగా భారత కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలి సి.పి.ఐ.(ఎం) ఏర్పడింది. 1967లోసి.పి.ఐ.(ఎం) సైతం మరోసారి చీలికకు గురై సి.పి.ఐ.(ఎం.ఎల్) పార్టీల ఆవిర్భావం మొదలైంది. సిపిఐ.లో 1964 చీలిక వల్ల ఉభయ పార్టీలు తొలిరోజుల్లో శత్రు వైఖరితో వ్యవహరించాయి. వారిమధ్య స్నేహపూరిత వాతావరణం కు బదులు పరస్పర దాడులతో రాజకీయ సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ స్థితిలో సైతం 1967 నుండి 1970 వరకు సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం) పార్టీలు తమ కార్మిక సంఘం ఎ.ఐ.టి.యు.సి. లో ఐక్యంగా కలిసి పనిచేశారు. ఈ నేపథ్యంలో ఇతర కార్మిక సంఘాలు చీలికకు గురికావటం, ఎ.ఇ.టి.యు.సి.లో తమ రాజకీయ ఆధిపత్యం నెలకొల్పుకోవటంలో విఫలమైన సి.పి.ఐ.(ఎం) తమ స్వీయ రాజకీయ అనుబంధానికి అనుగుణమైన మరో కేంద్ర కార్మిక సంఘాన్ని నిర్మించాలని భావించింది. సి.పి.ఐ. (ఎం) రాజకీయ పరమైన నిర్ణయం మేరకు 1970 ఏప్రియల్ 9,10 తేదీలలో గోవాలో ఒక సదస్సును నిర్వహించి ఒక పోటీ నూతన కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక ఆహ్వాన సంఘాన్ని జ్యోతిబసు, మనోరంజన్ రాయ్ లు అధ్యక్ష, కార్యదర్శులుగా ఏర్పాటు చేశారు. ఆ మేరకు 1970 మే 28–30 తేదీలలో కలకత్తాలో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ద్వారా సి.ఐ.టి.యు. స్థాపన జరిగింది.

1964 భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనంతరం ఎ.ఐ.టి.యు.సి.లో పట్టు సాధించాలని సి.పి.ఐ(ఎం) విశ్వ ప్రయత్నం చేసింది. 1964 చీలికకు ముందు – తర్వాత అంటే 1957 నుండి 1973 వరకు ఎ.ఐ.టి.యు.సి.కి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కామ్రేడ్ ఎస్.ఎస్. మిరాజ్ కర్, కామ్రేడ్ ఎస్.ఎ. డాంగే వ్యవహరించారు. చీలిక సమయంలో ఎస్.ఎస్. మిరాజ్ కర్ సి.పి.ఐ.(ఎం)లోకి వెళ్ళారు. డాంగే మాత్ర సంస్థ సి.పి.ఐ.లోనే ఉన్నారు. వీరిరువురు బొంబాయి కార్మిక ఉద్యమ నిర్మాణంలో కాకలు తీరిన యోధులు. మిరాజ్ కర్ బొంబాయి నగర మేయర్‌గా పనిచేస్తే, డాంగే పార్లమెంటు సభ్యునిగా పనిచేశారు. వీరిరువురి నాయకత్వంలో దేశ కార్మిక వర్గం ఎన్నో సమరశీల పోరాటాలను నిర్వహించింది. ఎన్నో త్యాగాలు చేసింది. వీరి కాలంలో భారత కార్మికవర్గం దేశ పెట్టుబడిదారీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మిక హక్కులకోసం అలుపెరగని పోరాటాలు చేసింది. 1968 సెప్టెంబరు 19 నుండి 25 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేశారు. ఈ సమ్మెలో ఎ.ఐ.టి.యు.సి. సంపూర్ణంగా పాల్గొని మద్దతు ఇచ్చింది. ఈ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పులలో 15 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. 48 వేలమంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించారు. పదివేల నుండి కోర్టు విచారణ ఎదుర్కొన్నారు. 1969 ఆగష్టు 19న ప్రభుత్వ 'కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా' 60 లక్షలమంది ఉద్యమంలో పాల్గొన్నారు. దీని ప్రభావంతో ప్రభుత్వం లొంగి వచ్చి 1970 ఏప్రిల్‌లో మూడవ వేతన సంఘాన్ని నియమించింది. సి.పి.ఐ.లో చీలిక తరువాత 1966లో 14 లక్షల మంది కార్మికులు సమ్మెలు చేశారు. 1 కోటీ 38 లక్షల 50 వేల పని దినాల నష్టం జరిగింది. 1967లో 15 లక్షల కార్మికులు సమ్మెలు చేస్తే 1 కోటీ 72 లక్షల పని దినాల నష్టం జరిగింది. 1968లో 17 లక్షల మంది సమ్మెలు చేస్తే 1కోటీ 72 లక్షల 50 వేల పని దినాల నష్టం జరిగింది. ఈ సమ్మెలలో ఇంజనీరింగ్, నూలు, బట్టల పరిశ్రమ, బొగ్గు గనులు, జనపనార, రసాయన, విద్యుత్‌శక్తి, రోడ్డు రవాణా, నౌకా రవాణా, ఓడరేవులు, నౌకా నిర్మాణ పరిశ్రమలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. కార్మికులలో ఐక్యత, పోరాట పటిమ నానాటికి పెరిగింది. వివిధ వర్గాల కార్మికుల మధ్య అపూర్వ సంఘీభావం వెల్లివిరిసింది. దీనికి పూర్వమే కాంగ్రెసు పార్టీ రెండుగా చీలిపోయింది. మితవాదులకు, కాంగ్రెసులోని అభ్యుదయ వాదులకు మధ్య పోరుసాగింది. దీని ప్రభావం కూడా భారత కార్మిక వర్గంపై పడింది. ఈ నేపథ్యంలో ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చి తమ స్వీయ రాజకీయ సంస్థను స్థాపించాలని సి.పి.ఐ.(ఎం) భావించింది. ఇది భారత కార్మిక వర్గానికి తీరని నష్టాన్ని కలిగించింది.




ఈ స్థితిలో ఎ.ఐ.టి.యు.సి. 28 వ జాతీయ మహాసభ 1970 జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు గుంటూరులో జరిగింది. ఈ మహాసభలో తమ వారెవరూ పాల్గొన వద్దని సి.పి.ఎ.(ఎం) పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. కానీ సి.పి.ఐ.(ఎం), కేంద్ర నాయకత్వ స్థానంలో ఉండి, ఎ.ఐ.టి.యు.సి అధ్యక్షులుగా ఉన్న ఎస్.ఎస్.మిరాజ్‌కర్ తను పార్టీ ఆదేశాలను ధిక్కరించి మహాసభకు హాజరయ్యారు. తిరిగి ఎ.ఐ.టి.యు.సి జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైనారు. కామ్రేడ్ మిరాజ్‌కర్ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చీలికను తీవ్రంగా వ్యతిరేకించారు. మాతృసంస్థను వదిలేది లేదని కరాఖండిగా ప్రకటించి మహాసభలో పాల్గొన్నారు. దీనితో మిరాజ్‌కర్‌ను సి.పి.ఐ(ఎం)నుండి బహిష్కరించారు. ఎ.ఐ.టి.యు.సి తొలి నుండి ట్రేడ్ యూనియన్లు రాజకీయపక్షాల నుండి స్వతంత్రంగా వ్యవహరించాలని, ఏ రాజకీయ పార్టీ ఆదేశాలకు లోబడి ఉండరాదని భావించింది. రాజకీయాలు ఉన్నా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలని భావించారు.

ఎ.ఐ.టి.యు.సి చీలినప్పటికీ 1974 ఏప్రిల్ 9న జరిగిన 20లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె, 1974 మే 8 నుంచి 20రోజులపాటు సాగిన 20లక్షల మంది రైల్వే ఉద్యోగుల సమ్మెలోను ఎ.ఐ.టి.యు.సి కీలక భూమిక నిర్వహించింది. అనేకమంది అరెస్టు చేయబడ్డారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు. దీనికి నిరసనగా ఎ.ఐ.టి.యు.సి 1974 నవంబరు 20న పార్లమెంటు ముందు రోజంతా ధర్నా నిర్వహించింది. 1970 చీలిక తరువాత సైతం దేశవ్యాపితంగా అసంఖ్యాక సమ్మె పోరాటాలలో ఎ.ఐ.టి.యు.సి ప్రముఖ పాత్ర వహించింది. కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సి.అచ్యుత మీనన్ 1970 గ్రాట్యుటీ చట్టాన్ని తీసుకువచ్చారు. కేరళ తరహా గ్రాట్యుటీ చట్టం డిమాండ్ వల్ల 1972లో కేంద్ర ప్రభుత్వం గ్రాట్యుటీ చట్టం తీసుకువచ్చింది. 1969లో బ్యాంకుల జాతీయకరణకు ఎ.ఐ.టి.యు.సి, ఎఐబిఇఎల నాయకత్వం ఎంతో పోరాట స్ఫూర్తిని ప్రదర్శించి విజయం సాధించింది. గుత్త పెట్టుబడిదారుల ఎదురుదాడిని ఎదుర్కొని ఎ.ఐ.టి.యు.సి పెద్ద ఎత్తున సమ్మెలు, లాకౌట్లు జరిగాయి. రెండు కోట్ల పనిదినాల నష్టం జరిగింది. 1971లో ఇందిరాగాంధీ ఘనవిజయం తర్వాత సైతం కార్మిక పోరాటాలను కొనసాగించింది.

వాస్తవాలు ఇలా ఉంటే సి.ఐ.టి.యు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా 'ప్రజాశక్తి' పత్రిక 'సి.ఐ.టి.యు. ఆవిర్భావం' అంటూ రచయిత పేరు లేకుండా ఒక వ్యాసం ప్రచురించింది. అందు లో ఎ.ఐ.టి.యు.సిపై విషం కక్కింది. ఒక ప్రక్కన తమ మహాసభలకు ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ సౌహార్ద సందేశం ఇవ్వటానికి వస్తున్న నేపథ్యంలో ఆ రకమైన వ్యాసం ప్రచురించటం సంస్కారయుతం కాదు. ప్రస్తుతం దేశంలో కార్మికవర్గం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నది. పోరాడి సాధించిన హక్కులను కోల్పోతున్నది. ఐక్య కార్మికోద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళే క్రమంలో వారి మహాసభ ఐక్య కార్మికోద్యమానికి పిలుపు ఇవ్వవలసిన సందర్భంలో ఈ రకమైన వ్యాసం ప్రచురించటం ఆక్షేపణీయం. ఇది కార్మికవర్గ ఐక్యతకు ఏ రకంగానూ దోహదం చెయ్యకపోగా విచ్ఛిన్నం చేస్తుంది. దురదపుడితే మీరు గోక్కోండి. ఇతరులను గోకకండి.

ఇక విషయానికి వస్తే "తాటి చెట్టు ఎందుకు ఎక్కావురా అంటే దూడ మేత కోసం" అన్నట్లు కార్మికవర్గ ఐక్యత కోసం చీలిక అవసరమైందట...రివిజనిజం ప్రబలిపోయి, ఎ.ఐ.టి.యు.సి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందట... వీరు అర్థంటుగా మిలిటెంట్ పోరాటాలు చేసి కార్మికరాజ్యం స్థాపించటానికి ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చామని ప్రగల్భాలు పలికారు. చీలిక ద్వారా వీరు సాధించిన శ్రామిక రాజ్యం ఎక్కడ ఉందో చెబితే బాగుండేది. ఎ.ఐ.టి.యు.సి. యొక్క పెట్టుబడిదారీ అనుకూల విధానాలను ఇంకేమాత్రం భరించలేక చీలికకు వెళ్ళామంటున్నారు. ఎప్పుడైనా ఎ.ఐ.టి. యు.సి వేదికలపై ఈ అంశాలను చర్చించారా? ఐక్య కార్మికోద్యమాన్ని నిట్టనిలువునా చీల్చి, చీల్చిన పాపాన్ని మూటగట్టుకుని ఏమి సాధించారో చెప్పాలిగదా? చీలిక వల్ల కార్మికవర్గం ఇప్పటికే చాలా నష్టపోయింది. దాని నుంచి ఎలా బయటపడాలి, ఐక్య ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలి అనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైతే దానికి ప్రాసంగికత ఉంటుంది. ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్న ప్రస్తుత తరుణంలో సోదర సంఘాల పట్ల అసమంజసమైన, కాలం చెల్లిన విమర్శలు చేయటం మంచిది కాదు. ప్రస్తుతం రాజకీయ నేపథ్యంలో ఐక్య కార్మికోద్యమమే మనకు శరణ్యం. అందుకు అరమరికలు లేకుండా కృషి చేద్దాం.

# ప్రపంచ పోటీని ఎదుర్కొనేందుకు డ్యూయల్ డిగ్రీ కోర్సులు

నిన్నటి కంప్యూటర్‌నానో యుగం దాటుతూ నేడు డిజిటల్ ఎఐ యుగంలోకి వేగంగా అడుగులు వేస్తూ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చాం. అంతర్జాల సంకేతాలు అందని ప్రపంచ నరుడు కనిపించడం లేదు. వసుదైక కుటుంబ భావనలు విస్తరిస్తున్నాయి. యువత నైపుణ్య రెక్కలతో ప్రపంచమంతటా ఎగురుతున్నారు. ఒకే సబ్జెక్ట్‌ను ఎంచుకొని చదవడానికి బదులుగా ఏకకాలంలో సమాంతరంగా రెండు లేదా అంతకన్న ఎక్కువ కోర్సులు చేయడం సర్వసాధారణం అయ్యింది. విద్యా సంస్థల్లో సాంప్రదాయ కోర్సులు చేయడంతో పాటు ఆన్లైన్ కోర్సులు, ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రాల్లో కోర్సులు చేస్తూన్న నవ యువత తక్కువ సమయంలో ఎక్కువ కోర్సులు చేయడానికి యుజిసి కూడా వెసులుబాటు కల్పించడం హర్షదాయకం. ఒకనాడు ప్రతి విద్యార్థి సీనియర్ సెకండరీ దశ తర్వాత తను ఎంచుకున్న సబ్జెక్ట్లో డిగ్రీ, పిజి, పిహెచ్‌డి వరకు పూర్తి చేసి ఉద్యోగ ఉపాధులు పొందారు. నేటి పోటీ ప్రపంచంలో అదనపు అర్హతలు, అవసర నైపుణ్యాలు, విభిన్న అంశాల్లో పరిజ్ఞానాలు పొందడం లాంటి అవకాశాలకు రెక్కలు తొడుక్కుంటూ ఆకర్షణీయ ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకుంటున్నారు. కామర్స్ విద్యార్థి డాటా అనాలిసిస్, ఆర్ట్స్ విద్యార్థి డిజిటల్ నైపుణ్యాలు, ఇంజనీరింగ్ విద్యార్థి ఫైనాన్స్‌మెనేజ్‌మెంట్ కోర్సులను ఏకకాలంలో చేయడం సర్వసాధారణం అయ్యింది.

**డ్యూయల్ డిగ్రీ కోర్సులకు పెరుగుతున్న ఆదరణ:**

ఏకకాలంలో రెండు లేదా అంతకన్న ఎక్కువ కోర్సులను చేయడాన్ని డ్యుయల్ డిగ్రీ పద్ధతిగా యుజిసి అనుమతించడం జరిగింది. యుజిసి నియమనిబంధనల ప్రకారం ఏకకాలంలో రెండు ఫుల్‌టైమ్ కోర్సులు(వేరు వేరు టైం టేబుల్‌తో) లేదా ఒక ఫుల్‌టైం కోర్సులతో పాటు మరో ఆన్లైన్/దూరవిద్య కోర్సు లేదా రెండు ఆన్లైన్/దూరవిద్య కోర్సులను చేయడానికి వెసులుబాటు కలిగింది. యుజిసి అనుమతించడంతో నేడు డ్యూయల్ డిగ్రీ కోర్సులు చేయడం సర్వసాధారణం అయ్యింది. డ్యూయల్ డిగ్రీ కోర్సులు చేయడం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ జ్ఞానాన్ని లేదా అవసర నైపుణ్యాలను పొందడంతో యువత విజ్ఞాన సముపార్జనకు వైవిధ్యభరిత దారులు తెరుచుకున్నాయి.

**డ్యూయల్ డిగ్రీ కోర్సులకు రెక్కలు:** డ్యూయల్ డిగ్రీ పద్ధతిలో మనం చేయవలసిన డిగ్రీ కోర్సులను ఎంపిక చేసుకోవడం అత్యంత ప్రధానమని తెలుసుకోవాలి. సైన్స్ విద్యార్థి తను చేస్తున్న డిగ్రీతో పాటు డాటా సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, స్టాటిస్టిక్స్, పర్యావరణ విజ్ఞానం, అదనపు స్కిల్స్ పొందడం లాంటివి చేయవలసి వస్తున్నది. కామర్స్ విద్యార్థి ఎకనమిక్స్, ఫైనాన్స్, బిజినెస్ అనాలిసిస్, ఎంబిఏ, కార్పొరేట్, బ్యాంకింగ్ లాంటి కోర్సులు చేయడం కనీస అర్హత అవుతున్నాయి. హుమానిటీస్ విద్యార్థి ఏకకాలంలో జర్నలిజం, పబ్లిక్ పాలసీ, సైకాలజీ, డాటా అనాలిసిస్, డిజిటల్ మీడియా లాంటి డ్యూయల్ డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు మేనేజమెంట్, ఎకనమిక్స్, ఎంబిఏ, ఎంటర్ప్రైనర్‌షిప్, ఐపి కోర్సులు, హెచ్ఆర్/లీడర్‌షిప్ కోర్సులు చేయడం సాధారణం అయ్యింది. మనం చేస్తున్న ప్రధాన కోర్సుతో పాటు తత్సమాన స్కిల్ ఆధార కోర్సులు, టెక్నికల్ కోర్సుతో మేనేజ్‌మెంట్ కోర్సులు, థియరీ కోర్సులతో అప్లికేషన్ ఆధార కోర్సులు చేయడం నేడు పెరిగిపోయింది.

**ప్రాధాన్యం కలిగిన డ్యూయల్ డిగ్రీ కోర్సులు:** నేడు వివిధ యూనివర్సిటీలు, సంస్థలు ఆఫ్లైన్, ఆన్లైన్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ పద్ధతులు నవ యువతకు వరంగా మారాయి. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పలు డ్యుయల్ డిగ్రీ కోర్సులను చేస్తున్న యువత తమ ఉద్యోగ అవకాశాలను పలు రెట్లు పెంచుకుంటున్నారు. నేడు అత్యున్నత ఐఐటిల నుంచి సాధారణ యూనివర్సిటీలు లేదా ఓపెన్ యూనివర్సిటీల వరకు అన్ని సంస్థలు డ్యూయల్ డిగ్రీ కోర్సులను యువతకు అందుబాటులో ఉంచాయి. నేడు డ్యూయల్ డిగ్రీ వేదికగా లీడర్షిప్, కన్సల్టేషన్, ఫైనాన్స్, టెక్నాలజీ, పబ్లిక్ పాలసీ లాంటి రంగాలతో ఆకర్షణీయ ఉద్యోగ అవకాశాలు పెరిగాయని గమనించాలి. మనంచేస్తున్న కోర్ సబ్జెక్ట్ కోర్సులతో పాటు సమాంతరంగా మనకు అవసరమైన మరో కోర్సును ఎంపిక చేసుకొని పూర్తి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. బిటెక్‌తో బిబిఎ/బిఎ, బికాం తో సిఎ, బిఎతో సైన్స్ లేదా కామర్స్ కోర్సులు, ఎల్ఎల్‌బితో బిబిఏ/బికామ్, కోర్ డిగ్రీతో పాటు ఎంబిఎ చేయడానికి యువత ముందుకు రావాలి. మన కెరీర్ ముందుకు సాగడానికి, మన ప్రతిభను సానబెట్టుకోవడానికి, ఉద్యోగాలు చేస్తూనే అదనపు అర్హతలు పొందడానికి, నూతన టెక్నాలజీ లేదా నైపుణ్యాలను పొందడానికి, ప్రపంచ పోటీని తట్టుకొని సగర్వంగా నిలవడానికి డ్యూయల్ డిగ్రీ కోర్సులు ఉపయోగపడతున్నాయని గమనించి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేయాలని కోరుకుందాం. ఒక వ్యక్తి విజ్ఞాన నైపుణ్య శక్తి కలిగిన వ్యవస్థగా రూపాంతరం చెందడానికి డ్యూయల్ డిగ్రీ పద్ధతులను సద్వినియోగం చేసుకుంటూ యువభారతం నైపుణ్యభారతంగా మారాలి.

మధుసూదన్‌రెడ్డి బుర్ర,
9949700037

# చదువే కాదు...ఆటలూ ముఖ్యమే

భాషలు, ఆటలు, పండుగలు ఇలా ప్రతి విషయంలో తెలంగాణ రాష్ట్రానికి వైవిధ్యమైన గుభాళింపు కనిపిస్తుంది. మన సంస్కృతి సంప్రదాయాలపరంగా తెలంగాణ గొప్పగా ఉండడానికి ప్రాచీన ఆటలు ఎంతగానో దోహదం చేశాయి. కాలం అనేక మార్పులను తీసుకువస్తుంది. ఆ మార్పులకు అనుగుణంగా మన జీవన విధానాల్లో కూడా మార్పులు వస్తుంటాయి. ఆధునిక ధోరణులకు అలవాటుపడుతున్న నేటి సమాజం అనాదిగా వస్తున్న ప్రాచీన ఆటలను మరచి పోతున్నారు. ఆట అంటే క్రికెట్ మాత్రమే అన్నట్లుగా తయారవుతున్నారు. మన ఆటలు పిల్లల్లో శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయి. ఒకరికొకరు సహకరించుకొని ఐక్యతను పెంచేవిగా ఉంటాయి. స్నేహాలను పెంచి, మరచిపోలేని బాల్యపు జ్ఞాపకలను మిగిలిస్తాయి. ఆటలు శారీరక దృఢత్వంతోపాటు, సామాజిక నైపుణ్యాలను పెంపొందిస్తాయి. ఒత్తిడిని తగ్గిస్తాయి, ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి మరియు జట్టుగా పనిచేయడాన్ని నేర్పుతాయి. ఇది మొత్తం వికాసానికి చాలా ముఖ్యమైనది. అలాగే మెదడులో డోపమైన్ వంటి మంచి అనుభూతి కలిగించే రసాయనాలను విడుదల చేస్తాయి, ఇది ఆనందాన్ని కలిగిస్తాయి.



టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత పిల్లలు స్మార్ట్ ఫోన్ లోని గేమ్స్ కే పరిమితమవ్వడం మనందరం చూస్తూనే ఉన్నాం. ఇలా స్మార్ట్ ఫోన్‌కు బానిసలైన పిల్లలు అనేక శారీరక రుగ్మతలతో సతమతమవుతున్నారనేది వాస్తవం. ఐదు సంవత్సరాల క్రితం ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన మహమ్మారి కొవిడ్ ఈ వాడకాన్ని మరింత పెంచింది అనడం అంగీకరించాల్సిన సత్యం. మా చిన్నతనంలో పాఠశాల నుండి వచ్చిన తరువాత వెంటనే సమవయస్సుల పిల్లలతో కలిసి సరదాగా ఆడుకుని ఇంటికి వచ్చేవారం. శారీరక శ్రమ వల్ల రాత్రి ఒళ్లు తెలియకుండా నిద్రపోయేవాళ్ళము. కానీ నేటి ఆధునిక జీవన శైలిలో పిల్లలు స్మార్ట్ ఫోన్ లకు బందీలుగా మారడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఎంతసేపు చదువులు, ర్యాంకుల కోసం పరుగులు తీయడమే తప్ప వాళ్ల యొక్క శారీరక, మానసిక ఎదుగుదలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. శారీరక దృఢత్వాన్ని పెంచేందుకు ఆటలు ఎంతగానో దోహదపడతాయి. అలాంటి ఆటలను పిల్లలకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమో తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించుకోవాలి. చదువు ద్వారా నే భవిష్యత్తులో స్థిరపడతారు అనే భ్రమలోంచి తల్లిదండ్రులు బయట కు రావాలి. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఉన్నత చదువులు చదవకపోయినా క్రికెట్ ఆటలో మేటిగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఉదంతాలు కోకొల్లలు. పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడలలో వారిని ప్రోత్సహించాలి. వారికి సరైన మార్గదర్శకత్వం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన, ఉపాధ్యాయులపైన ఉన్నది. ప్రభుత్వాలు కూడా క్రీడల పట్ల శ్రద్ధ వహించాలి.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి. నూతన పాఠశాలలకు అనుమతులు ఇచ్చే సందర్భంలో పాఠశాలకు ఆటస్థలం ఉందా, లేదా అన్న అంశాన్ని పరిశీలించాలి. తెలంగాణాలో మరుగున పడుతున్న చిన్ననాటి ఆటలైన చిర్రగోనె, కోతి కొమ్మచ్చి, గోలీలాట, చెడుగుడు తదితర ఆటలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిది.

సుధాకర్.ఎ.వి 9000674747



## ప్రజల సంక్షేమమే లక్ష్యం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 25 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన 25,02,900 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు, అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద 18 మంది లబ్ధిదారులకు మంజూరైన 6,88,000 చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మా ర్వో రమేష్ ఎంపీడీవో శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మహిళకు శస్త్రచికిత్స విజయవంతం

### ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణానికి చెందిన 40 సంవత్సరాల నిరుపేద మహిళల తీవ్రమైన కడుపు నొప్పితో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రాగా ఆమెకు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే.శ్రీధర్ తెలిపారు. మంగళవారం రోజున సదరు మహిళకు స్కానింగ్ చేయగా గర్భ సంచి పక్కన ఉన్న అండాశయంలో పెద్ద గడ్డ ఉందని, వెంటనే వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి సదరు పేషెంట్‌కి అత్యవసరమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి ఆమె ప్రాణాలు కాపాడారని తెలిపారు. ఈ సర్జరీలో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ అనసూయ, డాక్టర్ భవాని మరియు ఓటి సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాతో పాటు, జిల్లా కేంద్రంలోని ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల క్లిష్టమైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన సిపి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరం క్యాలెండర్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక నిజాలను రాస్తూ నిత్యం పేద ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్ చిప్పరి వెంకట రాజు, రిపోర్టర్లు బి.సురేష్, సాయికృష్ణ, రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల గోడ ప్రతుల ఆవిష్కరణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జనవరి 18న ఖమ్మం పట్టణంలో నిర్వహించే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కార్మిక భవన్‌లో ఖమ్మం పట్టణంలో జరిగే శతాబ్ది ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భారత గడ్డపై సిపిఐకి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాల పండుగ ను జరుపుకొంటుందని, అందులో భాగంగానే జనవరి 18న ఖమ్మం పట్టణంలో భారీ ఊరేగింపు బహిరంగ సభ జరగనుందిని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు మంద అనిల్, మరియు వడ్డెపల్లి లక్ష్మ న్, కొంక విజయ్ కుమార్, వెంగల ప్రసాద్, రాములు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత



### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్/కొత్తపల్లి :** నగరంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపట్టడం జరుగుతుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు, స్థానిక నాయకుల కోరిక మేరకు వాటన్నింటిని గుర్తించి డ్రైనేజీలతో పాటు సిసి రోడ్ల నిర్మాణానికి సుడా నిధులు, మున్సిపల్ సాధారణ నిధులను మంజూరు చేసి పనులు వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. ఆరేపల్లిలోని సరస్వతినగర్ డివిజన్ నెంబర్ వన్‌లో 30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి మరియు అదే డివిజన్‌లో మరో 11 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అదే విధంగా కోతిరాంపూర్ డివిజన్ నెంబర్ 40లో గణేష్ నగర్ లింకు రోడ్డు నిర్మాణానికి 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో స్థానిక నాయకులు చెర్ల పద్మ, ఎట్టెపు వేణు, బత్తిని చంద్రయ్య, బేతి సుధాకర్ రెడ్డి, గౌరయ్యగౌడ్, సత్తినేని శ్రీకాంత్, బత్తిని శ్రీకాంత్, హనుమండ్ల వెంకట్ రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణం పూర్తి చేస్తాం

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామంలో వివోల గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు మంగళవారం శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడు వివోల గ్రామైక్య సంఘం భవనాలను రూ.10 లక్షల ఎన్నారై ఈజీఎస్ స్కీమ్ ద్వారా బిల్డింగ్ పూర్తి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు, ఉప సర్పంచ్ అసలు రంజిత్ కుమార్, సిసి శోభన్, మాజీ ఎంపిటిసి కొప్పు లక్ష్మ ణ్, అధికారులు, గ్రామైక్య సంఘాల వివోలు, సిఏలు పాల్గొన్నారు.

# కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి/రామగిరి :** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో జడ్పిహెచ్ఎస్, ఎంపిపిఎస్ పాఠశాలలను, రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్, లక్ష్మి నగర్ ఆర్ & ఆర్ కాలనీ, ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పిల్లలకు అందుతున్న విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై అధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రత్నాపూర్ ఆర్ & ఆర్ కాలనీని పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అంతకుముందు కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ కార్యాలయం పనులను కలెక్టర్ పరిశీలించి రెండు నెలలలోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు నూతన తహసిల్దార్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ సుమన్, ఎంపీడీవో శైలజ రాణి, మంథని డీ.ఈ పి.ఆర్ అప్పల నాయుడు, ఏఈలు వరలక్ష్మి, జగదీష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి**

పెద్దపల్లి జిల్లాలో విద్యాశాఖలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా జిల్లాలో మంజూరైన అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలలో మంజూరు చేసిన వివిధ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన పీఎం శ్రీ పాఠశాల అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, 10 కోట్ల రూపాయలతో గోదావరిఖనిలోని శాతవాహన యూనివర్సిటీ అడ్మిన్ బ్లాక్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం. షేక్, టీ.జి.ఈ. డబ్ల్యు.ఐ.డి.సి. ఈ.ఈ. అశోక్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తోక పేరుతో చలామణి అవుతున్న శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేష్‌కి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని సంజయ్ గాంధీ నగర్‌లోని శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాల గ్లోబల్ ఎడ్జ అనే తోక పేరుతో చలామణి అవుతు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, పారిశ్రామిక ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నటువంటి శ్రీ చైతన్య గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ కార్యదర్శి మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగుప్పుల సాయి అను, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలు మా దృష్టికి తీసుకురండి

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో చనిపోయిన వారి ఓట్లు తొలగించాలని కోరారు. కుటుంబ సభ్యులందరికీ ఓట్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సజావుగా నిర్వహించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెంచాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే అన్ని మునిసిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వార్డుల వారీగా ముసాయిదా ప్రకటించామన్నారు. వినతులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మునిసిపల్ కమిషనర్లు నాగరాజు, అయాస్, సమ్మయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై.సునీల్ రావు, నాంపల్లి శ్రీనివాస్ (బిజెపి), చల్లా హరిశంకర్, సత్తినేని శ్రీనివాస్ (బిఆర్ఎస్), మడుపు మోహన్ (కాంగ్రెస్), పైడిపల్లిరాజు (సిపిఐ), మిల్కూరి వాసుదేవ రెడ్డి (సిపిఐఎం), తేజ దీప్ రెడ్డి (ఏఐఎఫ్ ఎఫ్ బి) తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కెనాల్స్‌కు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలం

### మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయాలని సిపిఐ నాయకుల డిమాండ్

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** గత మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పీచుపల్లి, రేకొండ, బొమ్మనపల్లి తదితర గ్రామాల్లో చాలా చోట్ల కెనాల్స్ తెగిపోయి రైతులకు భారీ నష్టం జరిగిన ఇప్పటివరకు పట్టించుకునే నాధుడే లేదని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు, మాజీ జడ్పిటిసి అందె స్వామిలు ధ్వజమెత్తారు. మంగళవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వర్షాలతో తెగిపోయిన కెనాల్స్‌ను అక్కడి రైతులతో కలిసి సందర్శించారు. రైతులు నార్లు పోసుకుని ముదిరిపోతున్నప్పటికీ ఇప్పటివరకు సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తెగిపోయిన కాలువలకు మరమ్మత్తులు చేపట్టి సాగునీరు డిమాండ్ చేశారు. సాగునీటితో కళకళలాడాల్సిన కాలువలు నీరు లేక ఎడారిలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర నష్టం వాటిల్లి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పటివరకు



కెనాల్ నిర్మాణం కోసం తట్టెడు మట్టి తీయలేదని మండిపడ్డారు. హైదరాబాదుకు మంత్రి పొన్నం ఇంచార్జిగా ఉండడంతో ఇక్కడ అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి గుర్తించి వెంటనే కాలువలకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని వారు కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్ గౌడ్, సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలిబాపురెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, సిపిఐ మండల నాయకులు మావురపు రాజు, గందె కొమురయ్య, మహంకాళి రాములు, రైతులు పీచు అమరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

# విద్యాసాంకేతిక సమ్మేళనానికి వేదికగా మానేరు

### వార్షికోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** మార్కులు, ర్యాంకులు, బారీ ప్యాకేజీలు, విదేశీ అవకాశాలకే పరిమితమయ్యే విద్య కాదని, సమాజ నిర్మాణంలో కీలక పాత్రపోషించే విలువలతో కూడిన బాధ్యతాయుతమైన సేవాభావం కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే నిజమైన విద్య యొక్క అంతిమ లక్ష్యమని, ఆ దిశగా మానేరు విద్యాసంస్థలు ముందుకు సాగుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మండి సంజయ్ కుమార్ అన్నారు. మానేరు విద్యాసంస్థల 40వ వార్షికోత్సవ వేడుకలు కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఈ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాల విద్యారంగంలో మానేరు సంస్థల సేవలు అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి అద్దం పట్టేలా రూపొందించిన ఏఐ కానిక్ ఎక్స్‌పోను మంత్రి బండి సంజయ్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మానేరు విద్యాసంస్థల 40వ వార్షికోత్సవ ఆడియో సిడిని, సావనీర్‌ను బండి సంజయ్ ఆవిష్కరించారు. విద్యాసంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు కడారి అనంత్‌రెడ్డి, కడారి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు, సమాజానికి ఏఐ భవిష్యత్తును ఏ విధంగా తీర్చబోతుందో ఎక్స్‌పో ప్రదర్శన ద్వారా చేసి చూపించామన్నారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ రమేష్, కృపాదానం, రమేష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కెవెస్ అనంతాచార్య, గడ్డం శ్రీరాములు, శివకుమార్, ప్రిన్సిపల్‌లు, ఉపాధ్యాయులు, విధ్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## పదవులు ఆభరణం కాదు.. ప్రజాసేవ చేసే బాధ్యత : ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** కెసిఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తే.. రెండేళ్ల రేవంత్‌రెడ్డి పాలనలో గ్రామాలకు ఒక్క పైసా కేటాయించకపోవటంతో మురికికుపాలుగా మారాయని మాజీ మంత్రి, శాసనసభ పక్ష ఉపనేత మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో పేరుకపోయిన చెత్తను తీసివేసే బాధ్యత ప్రస్తుత సర్పంచ్‌లపై ఉందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో నూతనంగా ఎన్నికైన సిద్దిపేట నియోజకవర్గ సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు ఆత్మీయ సత్కార కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం కూలిందని సిఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం కూలితే రంగనాయక్‌సాగర్. మల్లన్నసాగర్, అంతగిరి సాగర్‌కు నీళ్లు ఎలా వస్తున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. ఇంటిదీపమే ఇల్లు కాల్చినట్లుగా రాష్ట్రంలో పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. అనంతరం బిఆర్ఎస్ సర్పంచ్‌లను, ఉప సర్పంచ్‌లను మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ తదిరతుల సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, దువ్వల మల్లయ్య, కూర మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్. జాప శ్రీకాంత్‌రెడ్డి, కడవేర్గు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో కార్యకర్తలకే ప్రాముఖ్యత



### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**ప్రజాపక్షం/ముత్తారం :** ఎన్నికలు వస్తే ప్రలోభాలకు గురి కాకుండా ప్రజాస్వామ్యం గెలిచేలా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం ముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గతంలో మనం పని చేయకనో సేవ చేయకనో ఓడిపోలేదని, బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందా అని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆలోచనకు వచ్చారని అన్నారు. కేవలం మాయమాటలు, అబద్దాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో పైసల ప్రలోభాలను మొదలు పెట్టింది మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అని, ఎన్నికలప్పుడు ఓటు వేయి ఇచ్చి ఎన్నికల తర్వాత వేలకు వేలు ఇచ్చి నాయకులను కొనుగోలు చేశారన్నారు. ముత్తారం మండలంలో మంచి చైతన్యం ఉందని, నాలుగు గ్రామాల్లో సర్పంచ్‌లను గెలిపించుకున్నారని, మరికొన్నిచోట్ల ఒకటి రెండు ఓట్ల తేడాతో ఓడిపోయారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచులు సూదాటి రవీందర్ రావు, పోతిపెద్ది కవితకిషన్ రెడ్డి,నక్క రాజేశ్వరి రాజయ్య,అత్తె చంద్రమౌళి,బిఆర్ఎస్ పార్టీ మహిళ మండల అధ్యక్షురాలు పప్పు స్వరూప చంద్రమౌళి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పోతిపెద్ది రమణరెడ్డి తో పాటు వివిధ శాఖల నాయకులు ఉన్నారు.


## రుద్రంగి, భీమారంలో అగ్నిమాపక కేంద్రాలు మంజూరు చేయాలి

### శాసనసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ నియోజకవర్గంలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రుద్రంగి, భీమారం ప్రాంతాల్లో నూతన అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలంగాణ శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రశ్నపై సభలో మాట్లాడిన ఆయన, వేములవాడ నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉందని తెలిపారు. ప్రస్తుతం వేములవాడలో మాత్రమే అగ్నిమాపక కేంద్రం ఉండగా, రుద్రంగి మండలం వేములవాడకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు కోరుట్లకు మరో 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున, మధ్య ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ సహాయం అందడంలో ఆలస్యం జరుగుతున్నదని సభ దృష్టికి తీసుకువచ్చారు. రుద్రంగి మండల కేంద్రంలో నూతన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే, ఆ ప్రాంతంతో పాటు మానాల, నిజామాబాద్ జిల్లాల సరిహద్దు గ్రామాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రుద్రంగి, భీమారం ప్రాంతాల్లో నూతనంగా అగ్నిమాపక కేంద్రాలు మంజూరు చేసి ఏర్పాటు చేయాలని మంత్రివర్గ సభ్యులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సభ ద్వారా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## మున్సిపాలిటీలో ఎగిరేది గులాబీ జెండానే

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**ప్రజాపక్షం/చొప్పదండి :** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం చొప్పదండి పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగానలో మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి ద్వారా అనేక నిధులు వెచ్చించి మున్సిపాలిటీలను అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్, కెటిఆర్‌లకే దక్కుతుందన్నారు. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చొప్పదండిని బిఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీగా మారిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ 420 దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, ఒక్క ఉచిత బస్సు తప్ప ఏ హామీ సైతం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తిని సంపత్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొత్తూరు మహేష్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ అజ్జు, మాడూల్ శ్రీనివాస్, నాయకులు మాచర్ల వినయ్, నలుమాచు రామకృష్ణ, దండె కృష్ణ, మహేషుని మల్లేశం, శెట్టిపల్లి పద్మ, గాండ్ల లక్ష్మ న్, జహీర్, పెద్దెల్లి అనిల్, మావురం మహేష్, నరేష్, రావన్, నితీష్, రాజు, మోహన్ పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశమయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 7,408 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు. 5,571 ముగ్గు పోశామని, 4,544 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 3,193 ఇండ్లు గోడల లెవెల్ లో, 2,370 స్లాబ్ లెవెల్ లో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారితో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తాను ఏదో ఒక మండలంలో ఆకస్మిక తనిఖీ చేస్తానని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. బోయినపల్లి మండలంలో 23 ఇందిరమ్మ ఇండ్లు, తంగళ్ళపల్లి మండలంలో 14 పూర్తి చేసిన ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులను అభినందించారు. మిగితా మండలాల వారు ప్రణాళిక ప్రకారం ఇండ్లను పూర్తి చేయించాలని సూచించారు. పూర్తి అయిన ఇండ్లను గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, మండల ప్రత్యేక అధికారులు గీత, అఫ్జల్ బేగం, లక్ష్మీ రాజం, రవీందర్ రెడ్డి, హనుమంతు, షరీఫుద్దీన్, రామకృష్ణ, క్రాంతి, నజీర్ అహ్మద్, ఎంపీడీఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/పాలకుర్తి :** సామాజిక సేవలో భాగంగా పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లోని యూనివర్సల్ ఐఐటిజెఈఈ, నీట్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థులు నిరుపేదలకు దుప్పట్లను మంగళవారం పంపిణి చేశారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి చలితో వణుకుతున్న 20 మంది నిరుపేదలను కలిసి వారికి దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు అఫ్జల్‌లు విద్యార్థులను అభినందించారు. పేదలకు సాయం చేయడం భగవంతుడికి చేసిన సేవతో సమానమని, విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని వారు తెలిపారు.

# ఎస్‌సి,ఎస్‌టిలపై దాడులు సహించం

## రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య

**ప్రజాపక్షం /సంగారెడ్డి** : ఎస్సి ,ఎస్టి లపై దాడులను సహించబోమని,సజ్జాపూర్ ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో ను సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి ,ఎస్‌టి కమీషన్ చైర్మన్ వెంకయ్య హెచ్చరించారు. ఎస్‌సి ,ఎస్‌టిల పై జరుగుతున్న దాడుల విషయంలో నిర్లక్ష్యం వహింఏ అధికారులపై తప్పని సరిగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల బ్యాగరి రాములు ఇంటి కూల్చివేత ఘటనపై గత నెలలో భాదిత కుటుంబాన్ని కలిసి సంఘటనపై సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే .మంగళవారం సజ్జాపూర్ గ్రామానికి విచ్చేసిన కమీషన్ చైర్మన్ బక్కి వెంకయ్య కమీషన్ సభ్యులు రాంబాలునాయక్, బాదితుడు బ్యాగరి రాములు కు రూ 25 వేల చెక్కును అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ బక్కి వెంకయ్య మాట్లాడుతూ బాదితుడికి పరిహారం అందజేయడానికే తాను వచ్చానని తెలిపారు. పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భాదితులకు అండగా నిలవకుండా దాడిచేసిన వారి వైపు నిలవడం సరికాదని వ్యాఖ్యా నించారు.అదికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌సి ,ఎస్‌టి కమీషన్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.జహిరాబాద్ శాసన సభ్యులు మాణిక్‌రావు ,,ఆర్డీ దేవుజా సాంఘీక సంక్షేమ శాఖ డిడి అఖిలేష్, రెడ్డి, ఎంపిడిఓ తహసీల్దార్ సుప్రియ, పోలీసు అధికారులు ,ఎస్‌సి ,ఎస్‌టి సంఘాల ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఓటర్ జాబితా నిర్ణీత గడుపులోగా సమర్పించాలి

**ప్రజాపక్షం/నిర్మల్** : మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఉన్న అభ్యంతరాలను నిర్ణీత గడుపులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ అభిలా ష అభినవ్ సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ వేరు వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా,లోపాలు లేకుండా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.మున్సిపాలిటీల వారీగా ఇప్పటి వరకు ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను సమీక్షించి,వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు.ఓటరు జాబితాలో పేర్లు,చిరునామాలు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఈ నెల 9వ తేదీ వరకు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు లేదా జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.అందిన ఫిర్యాదులను వార్డు అధికారులు,బీఎల్ఓలు,ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.



## ఎస్ఐఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి:కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్** : ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నందున ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ అమలు తీరు, ముసాయిదా ఓటరు జాబితాపై కలెక్టర్ మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఎఈఆర్ఓలు, బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారిగా ఎస్ఐఆర్ అమలును పరిశీలిస్తూ పనితీరులో వెనుకంజలో ఉన్న ఏఈఆర్ఓలు, బిఎల్ఓ, సూపర్‌వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ సెగ్మెంట్ పరిధిలోని 301 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఓటరు జాబితాను ఎఈఆర్ఓలు, ఈఆర్ఓలు కనీసం 5శాతం మేరకైనా ర్యాండమ్‌గా చెక్ చేయాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదన్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరపాలని కలెక్టర్ హితవు పలికారు.



## రహదారి భద్రతా నిబంధన ప్రతి ఒక్కరూ పాటించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాపక్షం/మందమర్రి** : రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, తద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మందమర్రి టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనదారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా మరణించడం ఆందోళనకరమని, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. అతివేగం, పరిమితికి మించి లోడ్ తో ప్రయాణించడం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ మాట్లాడవద్దని, సరైన కండిషన్ లో ఉన్న వాహనాలను మాత్రమే వాడాలని సూచించారు. జాతీయ రహదారులపై పశువులను వదలరాదని, వాహనాలను నిలుపుదల చేయవద్దని కోరారు. రహదారి ప్రమాదాల నివారణకు జిల్లాలో విస్తృత తనిఖీలు చేపడుతున్నామని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ రహదారుల సిబ్బంది పని చేసే సమయంలో రక్షణ కిట్లు ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, జాతీయ రహదారుల సంస్థ జిఎం అజయ్ మణికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్** : రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎయంవిఐ) రజనీకాంత్ పేర్కొన్నారు.మంగళవారం కొండాపూర్ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా "రహదారి భద్రతఅవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ రజనీకాంత్ తో పాటు అక్షయ్,రణశ్రీ మేడం ముఖ్య అతిథులుగా హాజరై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపరాదని,మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్లు వాడకూడదని,ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని కోరారు.

## సిపిఐ బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరుకావాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**ప్రజాపక్షం/జన్నారం/ దండేపల్లి** : ఈనెల 10న రామకృష్ణాపూర్ లో నిర్వహించే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాలో సిపిఐ ప్రచార జాతా 4వ రోజు మంగళవారం జన్నారంలో ప్రారంభమై దండేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10న జరిగే సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు, మాజీ ఎంఎల్‌ఏ చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య హాజరవుతారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మండల కార్యదర్శి పేర్క రాజేశం, జిల్లా సమితి సభ్యులు కామెర దుర్గారాజ్, రవీందర్, నాయకులు విజయ్, గునిగంటి నర్సింగరావు, కంచం పోషం, ఉయ్యాల శంకర్, మర్రి సందీప్ పాల్గొన్నారు.




## ప్రధాని పదవిపై కెసిఆర్ కన్ను

### అందుకే.. భారత రాష్ట్ర సమితి ఏర్పాటుకు శ్రీకారం
### మెదక్ ఎంపి రఘునందన్ రావు

**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రధానమంత్రి పదవిపై కన్నేసిన కేసిఆర్ తన పార్టీని భారత రాష్ట్ర సమితిగా మార్చి తన పతనాన్ని తానే కోరుకున్నట్లు మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి నందన్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మనోహర్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్‌ఎస్ ఏర్పాటుతోనే రాష్ట్రంలో నైతికత కోల్పోయినట్లు ఎమ్మెల్సీ కవిత పేర్కొంటుండంలో అర్థం లేదని, అయితే తాము గతం లోనే ఈ అంశంపై నిలదీసినట్లు చె ప్పారు. అలాగే రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేతల భాషను ప్ర జలు అసహ్యించుకుంటుండగా, వారు తెలంగాణ సమాజానికి ఏమి చెప్పదలుచుకున్నారని నిలదీశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రా మా లు పరిపుష్టం కానుండగా, రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ రెండున్నర లక్షల కోట్ల బడ్జెట్ తో ప్రతి గ్రామానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ మున్సిపల్ తో పాటు జిహెచ్ఎంసి వార్డుల ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, ఇందులో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముంపు గ్రామాలను నిర్లక్ష్యం చేయకుండా, న్యాయం చేయాలని, నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ మెంబర్ సమావేశం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం రోజున ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్ అధ్యక్షతన జాతీయ కౌన్సిల్ మెంబర్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ దేశంలో 14 రాష్ట్రాల్లో బీడీ పరిశ్రమల్లో బీడీ కార్మికులు అనేక సమస్యలు నెలకొని ఉన్న సమయంలో ఏఐటియుసి అనుబంధంగా 1965లో తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ స్వర్గీయ కామ్రేడ్ చిరివేరి ప్రభాకర్ అనంతరెడ్డి సమక్షంలో ప్రజా ఉద్యమాలు చేసి కార్మికులకు న్యాయం చేకూర్చే విధంగా పనిచేయడం జరిగిందని అన్నారు. బీడీ కార్మికులు పొల్గొని సంక్షేమ పథకాలు ఉపాధి రక్షణ కొరకు అనేక సమస్యలు సాధించుకోవడం హక్కులు కాపాడుకోవడం కొరకు మన యూనియన్ పోరాడిందని తెలిపారు. కార్మిక సంఘాలుగా మనం పని చేయాలని తెలిపారు.




### మీటింగ్ ప్రధాన డిమాండ్లు

బిడి కార్మికులకు దేశవ్యాప్తంగా అనేక వేతనాలు ఒక వెయ్యి బీడీలకు 300 రూపాయలు అమలు చేయాలి. బీడీ పరిశ్రమలలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలి. కార్మికుల పదవి విరమణ అనంతరం గ్రాట్యుడి డబ్బులు ఇవ్వాలి. బీడీ కార్మికులకు నెలలో 26 రోజులు పని కల్పించి మంచి తునికాకు సరఫరా చేయాలి. బీడీ కార్మిక సంక్షేమ దావకాన ద్వారా యధావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగించాలి.

## జర్నలిస్టుల కోసమే వెల్‌నెస్ ఆస్పత్రి హెల్త్ కార్డు

**ప్రజాపక్షం/నిజామాబాద్** : జర్నలిస్టుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వారి కోసమే వెల్‌నెస్ ఆస్పత్రి యాజమాన్యాలు పూర్తి భరోసానిస్తూ హెల్త్ కార్డు జారీ చేస్తామనడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పంచరెడ్డి శ్రీకాంత్, డాక్టర్ వాగ్మారే సుభాష్ అన్నారు. మంగళవానం నగరంలోని వెల్‌నెస్ ఆస్పత్రి యాజమాన్యం జిల్లా ప్రెస్‌క్లబ్ నూతనంగా ఎన్నికైన కమిటీని ఘనంగా సన్మానించి మాట్లాడారు.నూతనంగా ఎన్నికైన కోశాధికారి రాజ్‌కుమార్, సెక్రటరీ రాజు, జాయింట్ సెక్రటరీలు ఆంజనేయులు, సతీష్‌గౌడ్, గోవిందరాజు, సందీప్, నరేందర్ స్వామి, సభ్యులు కృష్ణ, ప్రీతంరెడ్డి, జర్నలిస్టులు పాపా ఖాన్, నయీమ్ కమర్‌బాయి, మహ్మద్ గౌస్‌బాయి, వెల్‌నెస్ ఆస్పత్రి మేనేజర్ వినోద్‌కుమార్‌తో పాటు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ** : రేక్కాడితే గుడొక్కడని చాలీచాలని బతుకులతో జర్నలిజం అంటేనే అసహ్యం వేసుకునే సందర్భంలో ప్రతి కలలో ఉన్న విలువలను కాపాడడానికి ముందుకు వచ్చిన సోదర జర్నలిస్టుల కోసం నా వంతు ప్రజాస్వామ్య ఉద్యమంగా వారికి అందాల్సిన అవకాశాలను అందించకుండా గత ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్న ఆంతర్యాన్ని అంతర్యుద్ధంగా మల్చకుండా సామాజిక దృక్పథంతో మీడియా మిత్రులకు ప్రతి ఒక్క అవకాశం అందించాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని,లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర జాదవ్ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జర్నలిజం విలువల కోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని జర్నలిస్టు మిత్రులకు ప్రభుత్వానికి మా ప్రాగడ ధన్యవాదాలు తెలుపుతున్నమని తెలిపారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు పదిహేను లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు పనులు మంగళవారం ప్రారంభించారు. సిఐ రేణుక రెడ్డి, తాసిల్దార్ మల్లయ్య, ఎంపిడిఓ వేద ప్రకాశ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, పిఆర్ ఏఈ రమేష్ తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్లు కొబ్బరికాయలు కొట్టి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, సర్పంచులు నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, వీరన్న, విట్టల్ రెడ్డి, ఆంజనేయులు, మహేష్, శ్రీకాంత్, జైపాల్, యాదగిరి చందర్, నరసింహులు తదితరులున్నారు.

## తండ్రిని హత్య చేసిన కొడుకు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** తండ్రిని ఓ కొడుకు హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన లంగాడి లక్ష్మయ్య (48) వ్యవసాయంతో పాటు ఓ లైన్ మెన్ వద్ద విద్యుత్ పనుల కోసం ప్రైవేటు సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య శేఖమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు శ్రీకాంత్ వివాహానికి, వ్యవసాయానికి కొంత అప్పులు అయ్యాయి.పెద్ద కొడుకు శ్రీకాంత్‌కు, లక్ష్మయ్యకు తరచూ డబ్బుల కోసం గొడవ జరిగేది.డబ్బులు ఇవ్వకపోతే చంపుతా అంటూ తరచూ శ్రీకాంత్ తండ్రిని బెదిరించేవా డు. సోమవారం రాత్రి లక్ష్మయ్య ఇంటికి రాగానే శ్రీకాంత్ మళ్లీ డబ్బులు అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ముందుగా సుత్తేతో తండ్రిపై దాడి చేయగా తల్లి శేఖమ్మ అతని వద్ద నుంచి సుత్తిని లాక్కోవడంతో శ్రీకాంత్ మళ్లీ అక్కడే ఉన్న కర్రతో లక్ష్మయ్య తలపై దాడి చే యడంతో తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబీకులు మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. తన భర్త మృతికి కారణమైన కొడుకు శ్రీ కాంత్ పై చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య భార్య శేఖమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

### సర్పంచ్ మడవి పార్వతి



**ప్రజాపక్షం/తిర్యాణి** : గ్రామ సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామసభలో తీర్మానం చేసి సమస్యలు పరిష్కరిస్తామని ఎదులపాడ్ సర్పంచ్ మడవి పార్వతి తెలిపారు. మండలంలోని ఎదులపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నహరడిపల్లి, నాగుగూడ గ్రామాలలో పర్యటించి గ్రామసభ నిర్వహించారు. ఆమె ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నహరడిపల్లిలో డ్రైనేజీ పూడికతీత పనులు, హైమాస్ట్ లైట్లు, నూతన విద్యు త్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. నాగుగూడలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, నాగుగూడ నుండి ఎదులపాడ్ వరకు గ్రావెల్ రోడ్డు వేయిస్తామని మాటిచ్చారు.పంచాయతీ కార్యదర్శి అశోక్, మడావి అంబారావు, మాజీ ఎంపిటిసిలు మడావి లక్ష్మీ బాయి, కో ట్నాక యశ్వంత్ రావు, ఉప సర్పంచ్ మమత, వార్డు సభ్యులు వార్నవతి, వస ంత, శేఖర్, జంగు, మధుకర్, రారాజు, భీమలింగు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజా బాట



**ప్రజాపక్షం/సిర్పూర్ టి** : విద్యుత్ సమస్యల పరిష్కారం, భద్రతా ప్రమాణాలపై అవగాహన కోసమే ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ జగన్ తెలిపారు. మంగళవారం సిర్పూర్ టి మండలం వేంపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ పనుల సమయంలో రైతులు విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని, అక్రమ విద్యుత్ కనెక్షన్లు వాడరాదని, ఇంటి పరిసరాలలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.గ్రామ సర్పంచ్ సత్యయ్య, ఉప సర్పంచ్ రాజకుమార్, మాజీ ఎంపిపి సత్యం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి 28 గొర్రెలు మృతి

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట:** మండలంలోని సురారం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సురారం స్టేజీ డౌన్‌లో ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ పెద్ద టైర్ ఊడిపోవడంతో అదుపుతప్పి లక్షెట్టిపేట నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న గొర్రెల మందపై బోల్తా పడింది. సుమారు 28 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నష్టపోయిన కాపరులు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారని తెలిసింది.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### బెల్లంపల్లి టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి** : గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసి 36 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీప ంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తి రుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామానికి చెందిన కొనురి రామకృష్ణగా గుర్తి ంచారు. మహారాష్ట్రలోని బల్లార్షాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడని వెల్లడించారు. నిందితుడి వద్ద నుండి 36 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి 'ప్రజాపక్షం'

### రూరల్ సిఐ కుమారస్వామి



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్** : పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రజాపక్షం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్లను ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుపతి, కెజిబివి పాఠశాలలో ఎస్ఓ కవిత క్యాలెండర్లను ఆవిష్కరించారు.'ప్రజాపక్షం' పత్రిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి, అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలకపల్లి గ్రామ సర్పంచ్ భక్తు రాంచందర్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ రమేష్, డిటి చిన్ను, నాయకులు మధుకర్, ప్రభాకర్, నాగేష్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## అట్టహాసంగా ప్రారంభమైన అండర్-23 జోనల్ క్రికెట్ పోటీలు

**ప్రజాపక్షం/ముధోల్** : నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టి.సి.ఏ) ఆధ్వర్యంలో అండర్ 23 జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి ఎండల లక్ష్మీ నారాయణ,ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్,టీసీఏ జిల్లా అధ్యక్షుడు బాజీరావు పటేల్,సర్పంచ్ షబానా ఇజాజుద్దీన్ తదితరులు హాజరై క్రీడలను ప్రారంభించారు.టోర్నీలో భాగంగా జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆదిలాబాద్ అండ్ మంచిర్యాల జట్లు తలపడ్డాయి.తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బాజీరావు పటేల్ మాట్లాడుతూ..ఈ జోనల్ స్థాయి పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయని,ఇందులో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తాదమని ఆయన వెల్లడించారు. నయీముద్దీన్,అసోసియేషన్ కార్యదర్శి తుమ్మల దత్తు,బిజెపి మండల అధ్యక్షుడు పోతన్న,మాజీ ఎంపీటీసీ మగ్దుమ్ మేరోజ్ ఖాన్,టీసీఏ ప్రతినిధులు అభయ్ పటేల్,రోల్ల రమేష్,మదణ మోరే,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శతక్కొట్టిన స్మిత్..

భారీ ఆధిక్యం దిశగా ఆస్ట్రేలియా!



యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ 166 బంతుల్లో 24 ఫోర్లు, సిక్స్‌తో 163), కెప్టెన్ స్టీవ్ స్మిత్(205 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 129 నాటౌట్) భారీ శతకాలతో చెలరేగారు. దాంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 124 ఓవర్లలో 7 వికెట్లకు 518 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ (3/108) మూడు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(2/87) రెండు వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ తీశారు. 166/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు ఓవర్‌నైట్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ నైట్ వాచ్‌మన్ మైకేల్ నేసర్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న ట్రావిస్ హెడ్. నేసర్‌తో కలిసి మూడో వికెట్‌కు 72 పరుగులు జోడించాడు. నేసర్‌ను కార్స్ ఔట్ చేయగా.. కెరీర్‌లో లాస్ట్ టెస్ట్ ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా(17) ఫుల్‌టాస్ బాల్‌కు వెనుదిరిగాడు. డబుల్ సెంచరీ దిశగా సాగిన ట్రావిస్ హెడ్‌ను బెతెల్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. స్టీవ్ స్మిత్ 166 బంతు ల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఉస్మాన్ ఖవాజా(17), అలెక్స్ క్యారీ(16), కామెరూన్ గ్రీన్(37) విఫలమవ్వగా.. బ్యూ వెబ్‌స్టర్(58 బంతుల్లో 4 ఫోర్లతో 42)తో కలిసి మరో వికెట్ పడకుండా స్మిత్ మూడో రోజు ఆటను ముగించాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(242 బంతుల్లో 15 ఫోర్లతో 160) భారీ శతకంతో చెలరేగగా.. హ్యారీ బ్రూక్(97 బంతు ల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైకేల్ నేజర్(4/60) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ చెరో వికెట్ తీసారు. నాలుగో రోజు ఆట మ్యా చ్ గమనాన్ని నిర్దేశించనుంది. ఇంగ్లండ్ కూడా ధీటుగా బదులిస్తే ఈ మ్యాచ్ డ్రా అవుతుంది. లేదంటే ఆసీస్‌కు విజయవకాశాలు మెరుగవుతాయి.

## దేశవాళీ టోర్నీలోనూ గిల్ వైఫల్యం..

అర్ధశతకంతో మెరిసిన అయ్యర్..!



ఇటీవల ఫామ్ లేమితో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్ మళ్లీ నిరాశపరిచాడు. న్యూజిలాండ్ సిరీస్‌కు ముందు టచ్‌లోకి రావాలని దేశవాళీ క్రికెట్ ఆడుతున్న గిల్.. అక్కడా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. వన్డే ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో భారత కెప్టెన్ 11 పరుగులకే ఔటయ్యాడు. గోవా బౌలర్ల వ్యూహాలకు గిల్ చేతులెత్తేయగా.. పునరాగమనంలో అదరగొడుతూ ముంబైకి సారథి శ్రేయాస్ అయ్యర్‌అర్ధ శతకంతో రాణించాడు.



నిరుడు టెస్టులు, వన్డే, టీ20ల్లో శతకాలతో హోరెత్తించిన శుభ్‌మన్ గిల్ ఇప్పుడు ఫామ్ కోసం తంటాలు పడుతున్నాడు. మెడ గాయం నుంచి కోలుకొని దక్షిణాఫ్రికాతో టీ20లు ఆడిన అతడు పెద్ద స్కోర్ చేయలేకపోయాడు. దాంతో.. స్వదేశంలో ఫిబ్రవరిలో జరుగబోయే పొట్టి ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి అతడని సెలెక్టర్లు తీసుకోలేదు. దాంతో.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోపు ఎలాగైనా లయ అందుకోవాలనుకున్న గిల్ విజయ్ హజారే ట్రోఫీలోనూ ఉసూరుమనిపించాడు. గోవా నిర్దేశించిన 211 పరుగుల ఛేదనలో చెలరేగిపోతాడనుకుంటే.. ఫస్ట్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 11 పరుగులకే పెవిలియన్ చేరాడు. దాంతో.. 'ఏం గిల్. ఫ్లాట్ పిచ్‌లంటే భయమా?' అంటూ నెటిజన్లు భారత సారథిని తెగ విమర్శిస్తున్నారు. అయితే.. ప్లీహం గాయం నుంచి కోలుకున్న శ్రేయాస్ అయ్యర్ పునరాగమనం మ్యాచ్‌లో అర్ధ శతకం బాదేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో మంగళవారం హిమాచల్ ప్రదేశ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అయ్యర్.. 82 పరుగులతో సత్తా చాటాడు. జనవరి 11 నుంచి సొంతగడ్డపై కివీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో గిల్‌కు డిప్యూటీగా ఆడనున్నాడీ ముంబై స్టార్.

## గుజరాత్ ఫీల్డింగ్ కోచ్‌గా సారా టేలర్



మహిళల ప్రీమియర్ లీగ్‌లో టైటిల్ కోసం నిరీక్షిస్తున్న గుజరాత్ జెయింట్స్ కోచింగ్ యూనిట్‌ను బలోపేతం చేసుకుంటోంది. ఈసారి కప్పు కొట్టమే లక్ష్యంగా పెట్టుకున్న గుజరాత్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవమున్న ఇంగ్లాండ్ వెటరన్ సారా టేలర్‌కు ఫీల్డింగ్ ప్రమాణాలు మెరుగుపరిచే బాధ్యత అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. ఒకప్పుడు వికెట్‌కీపింగ్‌లో అదరగొట్టి మహిళా క్రికెట్‌లో ఎంఎస్ ధోనీగా కితాబులందుకుంది సారా టేలర్. ఆమె తన13 ఏళ్ల కెరీర్‌కు 2019లో వీడ్కోలు పలికింది. అనంతరం కోచ్‌గా అవతారమెత్తిన తను కౌంటీల్లో ఇంగాండ్ సీనియర్ జట్టుకు సేవలందించింది. జూనియర్ టీమ్ ఇంగ్లాండ్ లయన్స్‌కు కోచింగ్ ఇచ్చిన సారా ఫీల్డింగ్ ప్రమాణాలు నెలకొల్పింది. దాంతో.. డబ్ల్యూపిఎల్ నాలుగో సీజన్ కోసం ఆమెను గుజరాత్ జెయింట్స్ యాజమాన్యం సంప్రదించింది.

## మహిళ

# ఆందోళన రేపుతున్న బాల్య వివాహాలు

తక్కువ విద్యా స్థాయి, అత్యల్ప ఆదాయం వంటి అంశాలు బాల్యవివాహాలను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నా యో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చదువు లేని బాలికల్లో దాదాపు సగం మంది 18 ఏళ్లకు ముందే వివాహం చేసుకుంటుండగా, ఉన్నత విద్య పొందిన బాలికల్లో ఈ శాతం కేవలం నాలుగు మాత్రమే. అలాగే అత్యంత పేద కుటుంబాలకు చెందిన బాలికల్లో 40 శాతం మంది బాల్యవివాహాలకు గురవుతుంటే, అత్యంత సంపన్న వర్గాల్లో ఇది 8 శాతానికి పరిమితం అవుతోంది. దీనివల్ల బాల్యవివాహాలు కేవలం చట్టపరమైన సమస్య మాత్ర మే కాకుండా సామాజిక–ఆర్థిక అసమానతల ప్రతిబింబమని స్పష్టమవుతోంది. ఈ సమస్యను ఎదుర్కొనేందు కు భారతదేశం పలు చట్టాలు, కార్యక్రమాలు అమలు చేసింది. 2006లో అమల్లోకి వచ్చిన బాల్యవివాహాల నివారణ చట్టం తర్వాత బాల్యవివాహాల రేటు సగానికి తగ్గినట్టు అధ్యయనాలు చెబుతు న్నాయి. 2012లో వచ్చిన పోక్సో చట్టం పిల్లల రక్షణను మరింత బలోపేతం చేసింది. అయితే చట్టాలు మాత్రమే సరి పోవని, సమాజంలోని ఆచారాలు, ఆలోచనా విధానాలు మా రాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్ అభియాన్' ఈ దిశగా భూమి స్థాయిలో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 55 వేల మంది బాల్యవివాహాల నివారణ అధికారులను నియమించారు. గత ఏడాది లోనే పరిపాలనా చర్యలు, అవగాహన, ఒత్తిడి ద్వారా 1,520 బాల్యవివాహాలను అడ్డుకోగలిగారు. మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాలు ఇందులో ముందున్నాయి. అయితే 198 కేసుల్లో బాల్యవివాహాలను ఆపడం సాధ్యం కాకపోవడంతో పోలీ సులు, శిశు సంక్షేమ సంస్థలు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మత నాయకులు, యువజన సంఘాలు, స్థానిక కమ్యూనిటీ నెట్‌వర్క్‌లతో కలిసి పనిచేస్తూ ప్రజల్లో దృక్పథ మార్పు తీసుకు రావడం కూడా ఈ ఉద్యమంలో కీలక భాగంగా మారింది.

భారతదేశంలో బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు తాజాగా మరో దశకు చేరుకున్నాయి. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్ అభియాన్'కు ఏడాది పూర్తయిన సందర్భంగా, బాల్యవివాహాలపై అవగాహన పెంపొందించేందుకు 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2030 నాటికి బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యానికి భారతదేశం కట్టుబడి ఉందని ఈ చర్య మరోసారి స్పష్టం చేస్తోంది. గత పదేళ్లలో బాల్యవివాహాల శాతం గణనీయంగా తగ్గినప్పటికీ, రాష్ట్రాల మధ్య, సామాజిక–ఆర్థిక వర్గాల మధ్య అసమాన పురోగతి కొనసాగుతుండటం ఇప్పటికీ ప్రధాన సవాలుగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బాల్యవివాహాల నిర్మూలన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డిజి) ముఖ్యమైన అంశం. ముఖ్యంగా లింగ సమానత్వానికి సంబంధించిన ఎస్‌డిజి–5లోని లక్ష్యం 5.3 బాల్యవివాహాలు, బలవంతపు వివాహాలు వంటి హానికర ఆచారాలను పూర్తిగా తొలగించాలనేది. 20–24 ఏళ్ల వయస్సు గల మహిళల్లో 18 ఏళ్లకు ముందే వివాహం జరిగిన వారి శాతం ఆధారంగా ఈ పురోగతిని కొలుస్తా రు. నిపుణుల అంచనా ప్రకారం, బాల్యవివాహాల ను ఆపడంలో విఫలమైతే పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, ఆర్థిక వృద్ధి, వాతావరణ చర్యలు, శాంతి వంటి కనీసం తొమ్మిది ఎస్‌డిజిలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. 2023లో యూనిసెఫ్ అంచనా ల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు 64 కోట్ల మహిళలు బాల్యవివాహాల బారిన పడ్డారు. ఇందులో మూడో వంతు వాటా భారతదే శానిదే. ప్రస్తుత వేగంతో చూస్తే, 2030 లక్ష్యాన్ని చేరుకోవాలంటే పురోగతి దాదాపు ఇరవై రెట్లు వేగంగా జరగాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో బాల్యవివాహాల పరిస్థితిని పరిశీలిస్తే, గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ ఆ వేగం ఇటీవలి కాలంలో మందగించినట్లు స్పష్టమవుతుంది. 2005–06లో 47.4 శాతంగా ఉన్న బాల్యవివాహాల రేటు 2015–16 నాటికి 26.8 శాతానికి తగ్గింది. అంటే దశాబ్దంలోనే 21 శాతం పాయింట్ల తగ్గుదల నమోదైంది. అయితే ఆ తర్వాత పురోగతి మందగించి 2019–21 నాటికి కేవలం 23.3 శాతానికి మాత్రమే చేరింది. ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, బిహార్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ 40 శాతానికి పైగా బాల్యవివాహాలు కొనసాగుతున్నాయి. మరోవైపు లక్షద్వీప్, జమ్మూ–కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, గోవా, నాగాలాండ వంటి రాష్ట్రాల్లో ఈ సమస్య తక్కువగా ఉంది.



బాలికల సాధికారతకు కేంద్రం, రాష్ట్రాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. 'బేటీ బచావో, బేటీ పడావో' పథ కం బాలికల విద్య, లింగ నిష్పత్తి మెరుగుదలపై దృష్టి సారిస్తోంది. అయితే అమలులో ఏకరీతి లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. పాఠశాలల్లో మెరుగైన శౌచాలయాలు, సురక్షిత ప్రయాణానికి సైకిళ్లు, ఆర్థిక ప్రోత్సాహకాలు వంటి చర్యలు బాలికలు చదువును కొనసాగించేందుకు తోడ్పడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో అమలవుతున్న 'కన్యాశ్రీ' పథకం 13–18 ఏళ్ల బాలికలకు వార్షిక సహాయం, వివాహాన్ని ఆలస్యం చేసి ఉన్నత విద్య కొనసాగిస్తే ఒకేసారి పెద్ద మొత్తం అందిస్తోంది. అయితే అదే రాష్ట్రంలో అమలవుతున్న 'రూపశ్రీ' పథకం వివాహ సమయంలో డబ్బు ఇవ్వడం వల్ల బాల్యవివాహాలను పరోక్షంగా ప్రోత్సహించే ప్రమాదం ఉందని మహిళా హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా, మహిళల వివాహ వయస్సును 18 నుంచి 21 సంవత్సరాలకు పెంచాలన్న కేం ద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై విస్తృత చర్చ సాగుతోంది. పురుషులతో సమానంగా వివాహ వయస్సు పెంచడం వల్ల మహిళలు ఎక్కువకాలం చదువుకోవడానికి, నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, ఆర్థికంగా స్వావలంబులు కావడానికి, అలాగే తల్లి–శిశు ఆరోగ్యం మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని ప్రభు త్వం వాదిస్తోంది. మొత్తానికి, భారతదేశం లో బాల్యవివాహాల నిర్మూలన దిశగా స్ప ష్టమైన పురోగతి ఉన్నప్పటికీ, లక్ష్యాన్ని చేరుకోవాలంటే చట్టాలు, సంక్షేమ పథకాలు, విద్యా విస్తరణ, సామాజిక దృక్పథ మార్పు అన్నీ కలిసిన సమగ్ర వ్యూహం అవసరం. 2030 నాటికి బాల్యవివాహ రహిత భారతదేశం సాధించాలంటే ఇప్పటి ప్రయత్నాలు మరింత వేగంగా, సమానంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

# చరిత్రలో నిలిచేలా శతాబ్ది ఉత్సవాల సభ

### ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం

ప్రజాపక్షం/ ఖమ్మం : చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జనవరి 18న నిర్వహిస్తున్నట్లు పార్టీ జాతీయ సమితి సభ్యుడు, శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ప్రజలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జాతీయ స్థాయి సభ జరగడం ఇదే మొదటిసారి అన్నారు. వందేళ్ల సిపిఐ సమర చరితను నేటి తరానికి తెలియజేయడంతో పాటు సమకాలీన రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ప్రమాదం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు తదితర విషయాలను నేటి తరానికి తెలియజేసి, భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు ఈ సభ దోహదపడుతుందన్నారు. ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈ సభకు అన్ని రాష్ట్రాల నుంచి సిపిఐ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 19 నుంచి 21 వరకు జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఖమ్మం సప్తపది ఫంక్షన్‌హాల్‌లో జరుగుతాయన్నారు. 18న బహిరంగ సభ సందర్భంగా స్థానిక పెవిలియన్ మైదానం నుంచి 15వేల జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు చేస్తారని వీరితో పాటు కళాకారులు వృత్తి సంఘాలకు ప్రాతినిథ్యం వహిస్తూ ప్రజా సంఘాల కార్యకర్తలు ఆయా వృత్తుల వేషధారణలతో పాల్గొంటారని హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే సభ విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కరపత్రాలు, పోస్టర్లు, జీపుజాతాల ద్వారా ప్రచారం జరిగిందన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో గడిచిన నాలుగు రోజులుగా జీపుజాతాలు నిర్వహించామని, ఎనిమిదిన అన్ని మండలాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు జరుగుతాయని, తొమ్మిదిన జిల్లా కేంద్రం ఖమ్మంలో భారీ మోటార్ సైకిల్‌ర్యాలీ ఉంటుందన్నారు. 10 నుంచి 14వరకు కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని ఆయన తెలిపారు.

### 20న జాతీయ స్థాయి సెమినార్

ఖమ్మంలో జనవరి 20న జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం జరుగుతుందని, ఈ సెమినార్‌కు అన్ని వామపక్షాల జాతీయ నాయకులు హాజరుకానున్నారని హేమంతరావు తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సిపిఎం జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి, సిపిఐ(ఎంఎల్) లేబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్‌భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి జనరల్ సెక్రటరీ మనోజ్ భట్టాచార్య,



ఎఐఎఫ్‌బి జనరల్ సెక్రటరీ జి.దేవరాజన్‌తో పాటు వామపక్షాల నేతలు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. దేశంలో వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు.

### 12న కవి సమ్మేళనం

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని జనవరి 12న స్థానిక డిపిఆర్‌సి భవనంలో కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు బాగం తెలిపారు. ఈ కవి సమ్మేళనానికి ప్రముఖ కవులు సుద్దాల అశోక్ తేజ, కెవిఎల్‌తో పాటు జిల్లాకు చెందిన కవులందరినీ ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించి రచనలను సేకరించడం జరిగిందని తెలిపారు. జనవరి 17న జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సమావేశం అంతకు ముందు ప్రత్యేక కళారూపాల ప్రదర్శన జరుగుతుందని బాగం తెలిపారు.

### సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు సిఎం రేవంత్

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. జనవరి 18న ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో సిఎం పాల్గొంటారని ఉత్సవాల ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి రెండు గంటలకు ఖమ్మం చేరుకుంటారని ఖమ్మంలో బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఖమ్మం నుంచి మేడారం వెళ్లనున్నట్లు హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సావాల ముగింపు సందర్భంగా జరిగే సభకు లక్షలాది మంది ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు. సిపిఐ జాతీయ నాయకత్వంతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరుకానున్నారని హేమంతరావు తెలిపారు.

## పెట్టుబడీదారుల పొట్ట నింపేందుకు పాలకుల విధానాలు



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : దేశం, రాష్ట్రంలో స్వాతంత్ర్యం నాటినుంచి నేటివరకు పాలించిన పార్టీలన్నీ పెట్టుబడీదారుల పొట్టనింపేందుకు దేశ సంపదనంతా కొంతమందికి కట్టపెట్టేటటువంటి విధానాలను అవలంభిస్తున్నారని, వీటిని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన బాధ్యత దేశప్రజలపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం లో జరిగిన సమావేశంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ ప్రజలు అవకాశవాద, బూర్జువా పెట్టుబడిదారి విధానాలను అవలంభిస్తు న్న రాజకీయపార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఇది దేశ భవిష్యత్తుకు సమాజానికి ప్రమాదకరమన్నారు. నాటి నుంచి, నేటివరకు ఏస్వార్థం లేకుండా నిత్యం ప్రజల కొరకు పోరాడుతున్న కమ్యూనిస్టులను ఆదరించాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ మాట్లాడుతూ 18న ఖమ్మం జరగబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగసభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, నాయకులు వార్ల వెంకటయ్య, తన్నీరు నర్సింహ్మా, ఈర్ల చంద్రమౌళి, బొల్లెద్దుల శ్రీనివాస్, రవీందర్‌కుమార్, శివశంకర్, బండి లక్ష్మి పతి, తుమ్మల శివుడు, తప్పెట కిరణ్‌కుమార్, కుతుబుద్దిన్, గోపాల్, ప్రేమ్‌కుమార్, నరేష్, గడ్డం శ్రీను, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుతున్న హక్కుల వెనుక కమ్యూనిస్టుల త్యాగాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్



ప్రజాపక్షం/బైంసా : ప్రజలకు నేడు అందుతున్న హక్కుల వెనుక కమ్యూనిస్టుల త్యాగాలు ఉన్నాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. మంగళవారం బైంసా పట్టణంలో నిర్వహించిన కార్మిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఖమ్మం శత వసంతాల బహిరంగ సభ పోస్టర్‌లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం కోసం 47 చట్టాల సాధన, బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి చారిత్రాత్మక విజయాలు సిపిఐ పోరాట ఫలితమేనని ఆయన వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ వంద ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 18న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన శత వసంతాల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపి, సహాయ కార్యదర్శి పి.ముత్యం, సభ్యులు లక్ష్మ ణ్, అనిల్, జావేద్, విఠల్, హాజే, సట్వాజి, శ్రీచరణ్, రాజు బాయి, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విధానాలపై పోరాటం తప్పదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్



ప్రజాపక్షం/మంచిర్యాల : కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేదల హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధానాలపై పోరాటం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలవేణ శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను, పేదల భూములను ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా మారుమూల గ్రామాలకు కరెంట్, రోడ్డు, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ సమయంలో వామపక్ష భావజాల పార్టీల సూచనల మేరకు 20 సూత్రాల సంస్కరణల ద్వారా భూసంస్కరణలు, పేదలకు భూపంపిణీ, నిత్యావసరాల ధరల నియంత్రణ వంటివి అమలు చేశారని తెలిపారు. నాటి సంస్కరణలకు నేటి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పోరాడాల్సి ఉన్నప్పటికీ, కమ్యూనిస్టులే బాధ్యత తీసుకున్నారని తెలిపారు. భూర్జువా పార్టీలు గద్దె దిగే వరకు పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. 10న రామకృష్ణాపూర్‌లో జరిగే బహిరంగసభను, 18న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు పార్టీ ప్రజాసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కలవేణ శంకర్ కోరారు. రామకృష్ణాపూర్ బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, లింగం రవి, కొట్టే కిషన్ రావు, చాడ మహేందర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి ముసుగులో సంపద దోపిడీ

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

ప్రజాపక్షం/బోధన్ : దేశభక్తి ముసుగులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచి పెడుతుందని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆరోపించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ సహజ వనరులను కార్పొరేట్‌వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పిఆర్‌టియు భవన్ వద్ద ఖమ్మం శత వసంతాల బహిరంగ సభ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండటంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా ఉద్యమాలపై అణిచివేత చర్యలు తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించి వందేళ్ల త్యాగాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. జనవరి 18న ఖమ్మం బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు హన్మంత్ రావు, పట్టణ కార్యదర్శి రాధాకృష్ణ, సలీం, మన్నన్, శ్రీనివాస్, శంకర్, దత్తు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక బాధ్యతతో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** విద్యార్థులకు సామాజిక బాధ్యతో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. కొరివి మండల కేంద్రంలో హై స్కూల్ విద్యార్థులకు సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మూఢనమ్మకాలునివారణలో సైన్స్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు జెడ్పిహెచ్ఎస్ లో నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో సిపిఐ ప్రజా సమస్యల పరిష్కారమే కోసమే కాకుండా హేతువాద దృక్పథాన్ని ,సైన్స్ పట్ల అవగాహన, మూఢనమ్మకాలకు అంటరానితనానికి వివక్షతకు వ్యతిరేకంగా, స్త్రీల హక్కుల కోసం, విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానం కోసం, సమాజంలో చైతన్యాన్ని నింపుతూ, మార్పు కోసం అనేక ఉద్యమాలను నడిపిన ఘన చరిత్ర కలిగిన ఏకైక వందేళ్ళ పార్టీ సిపిఐ మాత్రమే అని అన్నారు. మూడు శ్రీ ప్రియ ఏక లవ్య స్కూల్ ప్రధమ, కె. స్వాతి జెడ్పిహెచ్ఎస్ స్కూల్ ద్వితీయ, బి హరిచంద్ర ప్రసాద్ నాగార్జున స్కూల్ తృతీయ, డి గౌతమి సిద్ధార్థ స్కూల్ కన్సోలేషన్ బహుమతులను సాధించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, తురక రమేష్, రవికుమార్ కార్తీక్, శ్రీధర్, విజయ్, దైద వెంకటేశ్వర్లు, బుర్ర సమ్మయ్య, కన్నే వెంకన్న, బుడమ వెంకన్న,సాయి పాల్గొన్నారు.

## ప్రజా గొంతుకగా పనిచేస్తున్న ప్రజాపక్షం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నిరంతరం ప్రజా, కార్మిక, రైతు సమస్యలపై ప్రజల గొంతుకగా ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కుమార్ అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రావి నారాయణరెడ్డి భవన్లో ప్రజాపక్షం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను సిపిఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం యాజమాన్యానికి, పాఠకులకు, సిబ్బందికి, రిపోర్టర్ మిత్రు లకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ మార్ మాట్లాడుతూ, ప్రజాపక్షం దినపత్రిక నిత్యం సింగరేణి కార్మికులు, రైతులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల అనేక ప్రజా సమస్యలపై అన్ని వర్గాల ప్రజల పై తన గళం వినిపిస్తూ నిరంతరం వార్తా కథనాలను అందిస్తూ ప్రజా ధారణ పొందుతుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో ప్రజాపక్షం దినపత్రిక దినదినం మరింత అభివృద్ధి చెంది నూతన ఉరవడికి నాంది పలకాలని రాజ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చెరుకు సుధాకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల పలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు ఖ్యాతరాజ్ సతీష్, జి.శ్రీనివాస్, నేరెళ్ల జోసెఫ్, గోలి లావణ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖిలా వరంగల్ మండల మహాసభ శివ అభి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల కోసం మండల కమిటీ చేయాలని ఆయన అన్నారు. విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం మండల కమిటీ కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం మండల కమిటీ ప్రకటించారు. ఖిలా వరంగల్ మండలాధ్యక్షుడిగా రేవంత్, మండల కార్యదర్శిగా కదమంచి నిఖిల్, సహాయ కార్యదర్శిగా కార్తీక్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్ సింగ్, మండల కమిటీ ప్రకాష్, రమేష్, రాకేష్, నిఖిల్, సంతోష్, ప్రమోద్‌లను ఎన్నుకున్నారు.

## సామ్రాజ్యవాద దాడులను వ్యతిరేకించాలి

**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన అయిదు మండలాల సమితి సమావేశంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు దాటిన సందర్భంలో శతజయంతి ఉత్సవాల పేరుతోని అయిదు లక్షల మందితో ఖమ్మంలో జరిగే బహిరంగ సభను ములుగు జిల్లా నుండి కూడా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్ పాష, కుమ్మరి సాగర్, సిపిఐ వెంకటాపూర్, ములుగు, మల్లంపల్లి, గోవిందరావుపేట, తాడ్వాయి కార్యదర్శులు ముత్యాల రాజు, వడి సారయ్య, జక్కుల అయిలయ్య, ఇంజం కొమురయ్య, బుడిమె సదయ్య, కొక్కుల రాజేందర్, శ్రీనివాస్, చిల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/జనగామ:** ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటు నిత్యం ప్రజా సమస్యల్ని వెలుగెత్తి చాటే ప్రజా గొంతుక ప్రజాపక్షం దిన పత్రిక అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, జనగామ ఆర్డిఓ గోపిరాం, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ వెంకన్న, జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రజాపక్షం ప్రచురించిన 2026 క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విశాలాంధ్ర, ప్రజాపక్షం పత్రికల్ని చదివేవాడినని, జాతీయ, అంతర్జాతీయ అంశాలు అందులో ఎక్కువగా ప్రచురితం అయ్యేవన్నారు. వాటిని చదవడం ద్వారా అనేక అంశాలపై పట్టు ఉండడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రజల పత్రికగా వెలుగొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక. మరింతగా దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజాపక్షం పత్రికకు తమ వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. క్యాలెండర్‌ను క్షుణంగా పరిశీలించి అభినందలు తెలిపారు. ప్రజాపక్షం జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పార్నంది వెంకటస్వామి, పట్టణ విలేకరి ఇమ్మడి భాస్కర్, కత్తుల యాకయ్య,బోనగిరి శ్రవన్‌కుమార్,తేలికంటిశ్రీనివాస్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన సిఐ**

ఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపక్షం దిన పత్రికను ఆత్మకూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా తెలుపుటలో ప్రజా కోణంలో వార్తలు రాస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో వార్తలు అందిస్తున్నటువంటి ప్రజా పక్షం యజమాన్యానికి, విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వెనిజులాపై అమెరికా దాడిని ఖండించాలి

**ప్రధాని మోదీ ట్రంప్ విధానాలను వ్యతిరేకించాలి* జనవరి 18న ఖమ్మం సభకు వేలాదిగా తరలాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/హనుమకొండ :** వెనిజులా సార్వభౌమత్వాన్ని హరించేలా ఆ దేశంపై అమెరికా చేసిన అత్యంత పాశవీకంగా దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాల సముద్రం లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ హనుమకొండ జిల్లా విస్తృత సమావేశం రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనిజులాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని అరెస్టు చేసే అధికారం ట్రంప్ కు లేదని అన్నారు.అమెరికా చర్యలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని, వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా దాడిని తాము వ్యతిరేకిస్తున్నామని, ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని ప్రధాని మోడీ ప్రకటించాలని అన్నారు. సామ్రాజ్యవాద శక్తుల అన్యాయ చర్యలను అడ్డుకోవడానికి ప్రపంచం ఏకతాటిపై నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. వెనిజులాలో ఆయిల్ సంపదను అమెరికా వశం చేసుకోవాలని చూస్తున్నదని, ఆ దేశ సహజ వనరులను కొల్లగొట్టే అధికారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు లేదని అన్నారు.అమెరికా నిరంకుశ చర్యలను భారత దేశం వ్యతిరేకించాలని, దీనిని మోడీ స్పందించాలని అన్నారు.అలాగే భారత దేశంపై, చమరు దిగుమతులపై ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను మోడీ తిప్పి కొట్టాలని, మన దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కాగా సిపిఐ ఆవిర్భావించి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, ఎన్. అశోక్ స్టాలిన్, బాషబోయిన సంతోష్, డాక్టర్ పల్లేరు వీరస్వామి,నాయకులు మాలోతు శంకర్ నాయక్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, కండె నర్సయ్య, రాసమల్ల దీనా, కొట్టె వెంకటేష్, మర్రి శ్రీనివాస్, యాళ్ల సంజయ్, తిరుమల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలను వెలికి తీయడమే 'ప్రజాపక్షం' లక్ష్యం**

ప్రజా సమస్యలను వెలికి తీయడమే ప్రజాపక్షం పత్రిక లక్ష్యమని సిపిఐ రాష్ట్ర సహయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సిపిఐ వరంగల్ జిల్లా కార్యాలయంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడుతున్న సమస్యలను వెంటనే ప్రభుత్వ అధికారులకు దృ ష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ప్రజాపక్షం పత్రిక ముందంజలో ఉంద ని కొనియాడారు. ప్రజల కోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా సమస్యలపై గళం ఎత్తే ఏకైక పత్రిక ప్రజాపక్షమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాషుమియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, ఎఐటియుసి నాయకులు గన్నారపు రమేష్, సిపిఐ నాయకులు లక్ష్మ ణ్, వరంగల్ ఉమ్మడి జిల్లా పజాపక్షం బ్యూరో తోట సుధాకర్, వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కోదాటి గోపాలకృష్ణ, పెసరుశీను, నర్సింహా, దేసు లక్ష్మ ణ్, సంతోష్,సందీప్ పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించడం లేదు

**సర్పంచ్‌ల అభినందన సభలో కెటిఆర్**



**ప్రజాపక్షం/జనగామ :** చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కెసిఆర్‌ను కాదు ఉరితీయాల్సింది దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డికి మద్దతుగా ఉన్న రాహుల్‌గాంధీని ఉరితీయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క ల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రేవంత్‌రెడ్డి ఒక ముఖ్య మంత్రిగా హుందాగా వ్యవహరించడం లేదని, దశాబ్దాల కళ నెరవేర్చిన కెసిఆర్‌ను ఉరితీయాలి, తొండలు జొర్రియ్యాలంటు విచక్ష ణ కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుతో జనగామ జిల్లాలో గెలుపొందిన సర్పంచ్‌ల అభినందన సభ మంగళవారం జనగామలోని భ్రమరాంబ పంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సభకు కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా హైదరాబాద్ బైపాస్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభించగా జనగామ చౌరస్తా నుండి నెహ్రూ పార్కు మీదుగా మళ్లీ చౌరస్తా నుండి భ్రమరాంబ పంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభకు కేసీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఎప్పుడు ఏ ఎన్నికల్లో వచ్చినా సత్తా చాటడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లను అభినందించారు.

**సర్పంచ్‌లు మనమే ఎక్కువ గెలిచాం: పల్లా**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టిన మొదటి ఎన్నికలు పంచాయతీ ఎన్నికలు, జనగామ జిల్లాలో బిఆర్ఎస్ బలమైన పార్టీ అని కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసే వరకు ఎవరు వెనకడుగు వేయకుండా ప్రతి ఎన్నికల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

**మోసాల రేవంత్:దయాకర్‌రావు**

దొంగ హామీలు ఇచ్చి ప్రజల్ని నమ్మించి వంచించిన వ్యక్తి మోసాల రేవంత్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు.అభివృద్ధి కేసీఆర్ పాలనలో జరిగిందన్నారు.

**కడియం సంగతి చూడాలే:రాజయ్య**

బిఆర్ఎస్ బిక్షపెడితే నేడు రేవంత్‌రెడ్డి దగ్గర కడియం నాట్యం చేస్తున్నాడని తాటికొండ రాజయ్య మండిపడ్డారు. ఆయన సంగతి తేల్చే దాకా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు ఊరుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నన్నపనేని నరేందర్, జిల్లా నాయకలు గద్దల నర్సింగరావు, బక్క నాగరాజు, శీధర్‌రెడ్డి, పోకల జమున, బండ పద్మ, బాల్నె సిద్దులు, కుమార్, మాజీ జడ్పిటిసి మారపాక రవి, బండ యాదగిరిరెడ్డి, పెద్ది రాజిరెడ్డి, కందుకూరి ప్రభాకర్, ఇర్రి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది సభకు వేలాదిగా తరలి రావాలి: భిక్షపతి

**ప్రజాపక్షం/తొర్రూరు :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణ కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే సిపిఐ శతాబ్ది బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలోసిపిఐ శతాబ్ది బహిరంగ సభ వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓమ బిక్షపతి, బందు మహేందర్ మాట్లాడుతూ ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. సిపిఐ పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా ఈ ప్రాంతం నుంచి కదలి రావాలని పిలుపునిచ్చారు. నలభైదేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, మంగళపల్లి యాకయ్య, కె.వీరన్న, ఎన్.వెంకన్న, ఎ.బిక్షపతి, సంపత్, బి.యాకయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల ప్రకటన కాగితాలకేనా?

**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రయివేట్ పాఠశాలల ప్రత్యేక తరగతులపై చర్యలెవరు? తెలంగాణ ప్రభుత్వం జనవరి 10 నుండి 16వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. విద్యార్థులకు విశ్రాంతి, మానసిక ప్రశాంతత కల్పించాలనే ఉద్దేశ్యంతో తీసుకున్న ఈ నిర్ణయం అమలులో మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే, కొన్ని ప్రయివేట్ పాఠశాలలు మాత్రం అతి ఉత్సాహంతో ప్రత్యేక తరగతులు రివిజన్ క్లాసులు పేరుతో విద్యార్థులను బడులకు రప్పిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలవులంటే ప్రభుత్వ బడులకేనా? ప్రయివేట్ పాఠశాలకు వర్తించవా? అనే సందేహాలు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఉల్లంఘనలపై చర్యలు ఎవరు తీసుకుంటారు? విద్యాశాఖ అధికారులు స్పందిస్తారా? లేక ఫిర్యాదులకే పరిమితమవుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చకు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన సెలవులు నిజంగా అమలవ్వాలంటే ప్రయివేట్ పాఠశాలలపై పర్యవేక్షణ, కఠిన చర్యలు అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే సెలవుల ప్రకటన మరోసారి కేవలం ఉత్తర్వులకే పరిమితమవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**ప్రజాపక్షం/పరకాల :** మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, మహిళల కోసం మహిళలతో ఏర్పడిందే పరకాల ఇందిరా మహిళా డైరీ అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు డిఆర్‌డిఏ అధికారులు, పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తి తరల సహకార సమాఖ్య లిమిటెడ్ చీఫ్ ప్రమోటర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అంటే ఆత్మవిశ్వాసానికి,నమ్మకానికి ప్రతిరూపమని అన్నారు. మనందరికీ భయం బాధ్యత ఉంటేనే ముందుకు వెళ్తామన్నారు.గేదలు లేని వారికి సబ్సిడీతో లోన్లు, గడ్డి విత్తనాలు ఇప్పిస్తామని, మందులు, తక్కువ ధరలో దాన, గేదెల పెంపకం, డైరీ నిర్వహణ తదితర సౌకర్యాలను ఇప్పిస్తామన్నారు.వెటర్నరీ వైద్యుల సేవలు ప్రతి గ్రామంలో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ముల్కనూరు డైరీ కి సంబంధించిన వారితో శిక్షణ ఇప్పిస్తామని, పశువులకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. 70 సంవత్సరాల లోపు మహిళలు సభ్యత్వం తీసుకోవడానికి అర్హులని తెలిపారు. చిన్న రైతులు, చిన్న కుటుంబాలు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పరకాల ఇందిరా మహిళా డైరీ కృషి చేస్తుందని అన్నారు. మొత్తం డైరీ పరిధిలో 58 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు ఉన్నాయని అన్నాడు. డైరీకి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేసి త్వరలోకి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## స్కూల్ బస్సులలో రవాణాశాఖ అధికారుల తనిఖీ

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో గల బిట్స్ పాఠశాలలో రవాణాశాఖ అధికారులు స్కూల్ బస్సులను మంగళవారం తనిఖీ చేశారు. అదేవిధంగా జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు రోడ్డు భద్రత గురించి వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ అందరూ ట్రాఫిక్ రూల్స్ మీద అవగాహన కలిగి ఉండాలని రవాణా శాఖ అధికారి బారాగాడి శ్రీనివాస్ తెలిపారు. దీనితో పాటు రోడ్డు భద్రత పట్ల, ట్రాఫిక్ రూల్స్ పట్ల విద్యార్థులకు క్విట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ముగ్గురు విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. రవాణాశాఖ అధికారులు ,రవాణాశాఖ సిబ్బంది, బిట్స్ పాఠశాల ప్రిన్సిపాల్, మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

**నడికూడ / ప్రజా పక్షం :** నడికూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.మండల కేంద్రంలో పరకాల ఇందిరా మహిళా డైరీ కి సంబంధించి బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. నడికూడలో చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి,అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా వాలీబాల్ టోర్నమెంట్

**ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో రాజుపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్బంగా రాజుపేట అంబెడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ములుగు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మెగా వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నారు ముఖ్య అతిధిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరు అవుతారు .మొదటి బహుమతి 20,000 రెండవ బహుమతి 10,000, మూడవ బహుమతి 8,000,నాల్గవ బహుమతి 5,000 రూపాయలతో నిర్వహిస్తున్నారు. వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొనే వారు 8 వ తారీకు సాయంత్రం లోపు అంబెడ్కర్ యూత్ మేనేజ్మెంట్ వారి నెంబర్ 8333968778,7013413102, 9347980395 లకు ఫోన్ చేసి టీమ్ నమోదు చేసుకున్న వాళ్లే టోర్నమెంట్ ఆడి ఈ కార్యక్రమం ను విజయవంతం చేయాల్సిందిగా టోర్నమెంట్ నిర్వాహకులు మీడియా ప్రకటన ద్వారా జిల్లా మండల ప్రజలకు తెలిపారు.

**సమీపిస్తున్న మేడారం మహాజాతర**

# నేటికీ పూర్తి కాని పనులు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాత రగా పేరొందిన మేడారం జాతరకు ఇంకా 21 రోజులు మాత్రమే ఉంది. అంటే సరిగ్గా మరో మూడు వారాలకే జాతర ప్రారంభం కానున్నది. ఇప్పటికే రోజూ లక్షలాది మంది ప్రజలు మేడారంను సందర్శిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు రెండు,మూడు లక్షలకు పైగా జనం తరలి వస్తున్నారు.కానీ జాతర పనులు మాత్రం నేటికీ పూర్తి కాలేదు. నిర్వహ ణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు 80,90 శాతం పూర్తయ్యాయని అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ జాతర ప్రారం భం నాటికి కూడా పనులు పూర్తయ్యేలా పరిస్థితులు లేవని భక్తులు అ భిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొదట డిసెంబర్ నాటికల్లా పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు, తర్వాత జనవరి ఐదో తేదీ అని చెప్పారు. కాగా మూడు రోజుల కిందట మేడారంలో పర్యటించిన మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 20 లోపు పూర్తి స్థాయిలో పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పడం పట్ల భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**కొనసాగుతున్న జాతర పనులు**

ఈ నెల 2,8,31 తేదీల మధ్య సమ్మక్కసారలమ్మ జాతర జరగనుంది. గద్దె ల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు వడివడిగా కొనసాగుతున్నాయి. గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చ రిత్రను చిత్రీకరించారు. మార్బుల్ శిలలతో గద్దెలు, జంపన్నవాగు సుంద రీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్‌మెంట్, 60 అడుగుల నుంచి నా లుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పను లు చురుగ్గా జరుగుతున్నాయి. జనవరి మొదటి వారం నుంచి భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి వీలుగా జంపన్నవాగులో నీటి ప్రవాహం సాగే లా చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్‌కు అధికారులు చర్యలు తీసుకున్నారు. జాతర జరిగే 4 రోజులు డ్రో న్ షో ప్రత్యేక ఆకర్ష ణ కానుంది. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాల తో పాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు.

**ప్రత్యేక ఆకర్ష ణగా వన దేవతల గద్దెలు**

మేడారం మహా జాతరలో వన దేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్ష ణగా నిలవనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.101 కోట్లు ఖర్చు చేస్తోంది. తాత్కాలిక ఏర్పాట్లతో పాటు రూ.251 కోట్ల నిధులతో శాశ్వత ని ర్మాణాలతో అభివృద్ధి చేపట్టింది. సమ్మక్క సారలమ్మ జాతర పునర్నిర్మాణ పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసింది. 4 వేల ట న్నుల గ్రానైట్‌పై ఆదివాసీ చరిత్ర సంస్కృతిని తెలిపేలా 7,000 బొమ్మలతో సమ్మక్కసారలమ్మ జాతర నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.200ఏళ్లపాటు చెక్కు చెదరకుండా, నా ణ్యతా ప్రమాణాలతో రాజీ పడకుండా పనులు చేస్తున్నా రు.

**ఈ నెల 18న సిఎం రేవంత్ రెడ్డి రాక**

ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం రానున్నారు. ఈ మేరకు జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఇన్‌చార్జి మంత్రి పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి సిఎంకు జాతరకు రావాలంటూ ఆహ్వానం అందజేశారు. ఆనాటి కల్లా పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు మంత్రులు, అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.



## ప్రజల పక్షాన నిలిచేదే 'ప్రజాపక్షం'

క్యాలెండర్ విడుదల చేసిన పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేసే ఏకైక పత్రిక ప్రజాపక్షమని మాజీ శాసనమండలి, శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ప్రజాపక్షం 2026 క్యాలెండర్‌ను పువ్వాడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా తీరు మారిందని, మారిన పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి ప్రజా గొంతుకను వినిపించే పత్రికలలో ప్రజాపక్షం ఒకటన్నారు. రానున్న కాలంలో ప్రజల ఆదరణతో ప్రజాపక్షం మరింత ముందుకు సాగాలని ఆయన కోరారు. నిక్కచ్చి సమాచారానికి ప్రజాపక్షం వేదిక కావాలని పువ్వాడ సూచించారు. ఒక పక్క మతోన్మాదం మరో పక్క ఆర్థిక అంతరాలు పెరుగుతున్న పరిస్థితుల్లో మీడియా క్రియాశీలక భూమిక పోషించాలన్నారు. అభూత కల్పనలతో అస్పష్ట సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని ఈ తీరు మారాలని మీడియాకు ఈ సందర్భంగా పువ్వాడ సూచించారు. క్యాలెండర్ విడుదల కార్యక్రమంలో ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, ఎడివిటి ఇన్‌చార్జి టికె ప్రసన్నన్, స్టాఫ్ రిపోర్టర్ కె.ప్రసాదరావు, వైరా ఆర్‌సి ఇంచార్జి పి.కృష్ణార్జున్‌రావు, రిపోర్టర్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శతాబ్ది వేడుకల బహిరంగసభ అవకాశం జిల్లాకు గర్వకారణం

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరంలో ఈనెల 18న నిర్వహించనున్న సిపిఐ శాతాబ్ధి వేడుకలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల అవేర్ కాలనీ, నారపొంగు బజార్, శాబాదు నగర్‌లో విజయవంతానికి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల వేడుకను నిర్వహించే అవకాశం జిల్లాకు దక్కడం మనకేంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక ఘటాన్ని వీక్షించేందుకు ప్రతిఒక్కరూ తరలి రావాలన్నారు. సిపిఐ శ్రేణులు ఎర్ర చీరలు, ఎర్ర చొక్కాలు ధరించి కదం తొక్కాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ నాయకులు దండి రంగారావు, వెంపటి రాము, శాబాదు పెద్ద సైదిరెడ్డి, చిన్న సైదిరెడ్డి, పొలంపల్లి ప్రభాకర్, లగిశెట్టి రమేష్, బూరెల రాము, నారపొంగు శ్రీను, పాల్వాయి యోబుకుమార్, పానమాకులు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల పండుగకు తరలాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కామేపల్లి:** సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మం నగరంలో ఈనెల 18న జరగనున్న వందేళ్ల పండుగకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జిమ్మల జితేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రమైన కామేపల్లి, ఊటుకూరు, తాళ్లగూడెం, మర్రిగూడెం, కొత్త లింగాల, పండితాపురం గ్రామాల్లో సిపిఐ జీప్ జాతీ కొనసాగింది. సిపిఐ జీపు జాతాకు కామేపల్లి మండల సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు, ఏపూరి లతాదేవి, నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటకృష్ణ, బండి శ్రీను, వీరస్వామి, కేశగాని తిరుపయ్య, దుంపటి వీరయ్య, అమరబోయిన తిరుపయ్య, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/కారేపల్లి:**భారత గడ్డపై శత వసంతాలు పూర్తి చేసుకున్న బడుగు బలహీన వర్గాల ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. శత వసంతాల ముగింపు బహిర్గ సభ జనవరి 18వ తేదీన జరుగుతున్న నేపథ్యంలో బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా జాతీయ బృందం మంగళవారం కారేపల్లి మండలంలోకి చేరుకుంది. చీమలపాడు గాదెపాడు మీదుగా కారేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ జాతాని ఉద్దేశించి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు బడుగు బలహీన వర్గాలు అండగా నిలుస్తూ విద్యార్థి యువజన కార్మిక రైతు ప్రజా కళాకారులను సంఘాలను నిర్మించి ప్రజలను చైతన్యపరిచిన పార్టీ సిపిఐ అని అన్నారు. జనవరి 18న ఖమ్మం నగరంలో జరిగే శతవసంతాల ముగింపు బహిరంగ సభకు పార్టీ సానుభూతిపరులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జాతాకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు, సీతామహాలక్ష్మి నాయకత్వం వహించగా ప్రజానాట్యమండలి బృందం ఆటపాటలతో ప్రజలను చైతన్యపరుస్తూ యాత్ర కారేపల్లి మండలంలో కొనసాగింది. కార్యక్రమంలో సిపిఐ నేతలు ఎర్రబాబు లతాదేవి, రావి శివరామకృష్ణ, మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు, మండల కార్యవర్గ సభ్యులు రాయల రామారావు, వీరు నాయక్, వెంకట్‌రెడ్డి, సయ్యద్ జానీ, పోతనబోయిన రవి, అమిర్ జానీ, పార్టీ అనంతరామయ్య, దుద్దుకూరు వెంకటేశ్వరరావు, బొమ్మగాని మహేష్ బాబు, సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ప్రచార జాతకు విశేష స్పందన

నేడు సుజాతనగర్‌లో ముగింపు

హాజరుకానున్న ఎంఎల్‌ఏ కూనంనేని

ఎస్‌కె.సాబీర్ పాషా





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శత వసంత ఉత్సవ ముగింపు సభను పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా నేతృత్వంలో జిల్లాలో కొనసాగుతున్న ప్రచారజాత మంగళవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ములకలపల్లి మండల కేంద్రం నుండి ప్రారంభమైన ఈ జాతా దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల మీదుగా సాగి ముగిసింది. ఈ ప్రచారజాతాకు ఆయా మండలాల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుండగా, మోటార్ సైకిల్ ర్యాలీలు, ఎర్రజెండా రెపరెపలు ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తున్నాయి. బుధవారం చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్, కొత్తగూడెం మండలంలోని రామవరం, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో కొనసాగనుంది. సుజాతనగర్ మండలంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రచార జాత ముగింపు కార్యక్రమానికి హాజరు కానున్నారు.

**పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే :** నాటి నుండి నేటి వరకు పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ప్రచారం జాత రథసారథిగా ఉన్న ఆయన మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో కొనసాగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతం కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలతో మమేకమై ఉందని చెప్పారు. కార్మికులు, కర్షకులు, పేదలు, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటాలు చేసిన సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ నూరేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలను చవిచూడటంతో పాటు ఎందరో యువ కిషోరాలు ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. ఈ ప్రాంతాల్లో గిరిజనులపై అటవీ అధికారుల దాడులను ఖండిస్తూ గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలిప్పించేందుకు సిపిఐ పెద్దన్న పాత్ర పోషించిందని, అనేక కాలనీలు నిర్మించి పేదవాడికి గూడు కల్పిందని చెప్పారు. పదవులున్నా లేకున్నా ప్రజల పక్షాన పోరాటాలు చేసే సిపిఐ మరో వందేళ్లు కూడా ప్రజా క్షేత్రంలో పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభ కనీవినీ ఎరుగని రీతిలో జరగనుందని, ఈ సభకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని, భారత గడ్డపై సిపిఐ వందేళ్ల ఉత్సవంలో అంతా భాగస్వాములై భవిష్యత్ పోరాటాలకు సరికొత్త నాంధి పలకాలన్నారు. ప్రచార జాత వెంట సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, ఎస్‌డి సలీం, మున్నా లక్ష్మి కుమారి, వేల్పుల మల్లిఖార్జున్, వర్క అజిత్, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ నాయకులు ఉయికే నారాయణ, బొర్రా కేశవులు, రామకృష్ణ, విజయ్, ధర్మ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఐనే

**అన్నపురెడ్డిపల్లి:** ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో సిపిఐ శత వసంతాల ముగింపు సభను పురస్కరించుకొని అంబేద్కర్ సెంటర్ నందు ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నున్న లక్ష్మి కుమారి, నేరెళ్ల రమేష్, సిపిఐ గార్లపాటి రామనాథం, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజిత్, ఎఐటియుసి జిల్లా నాయకులు వేల్పుల మల్లికార్జున్, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాలకు రూ.25వేలు విరాళం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని 18న జరగనున్న బహిరంగ సభకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు రూ.25వేలు విరళాన్ని సిపిఐ నాయకులకు అందజేశారు. మంగళవారం సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులను కలిసి విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, సింగరేణి వర్కర్స్ యూనియన్ నాయకులు మిరియాల రంగయ్య, పి.కోటేశ్వరరావు, టి.సీతారాములు, ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## తుళ్లూరు సత్యంకు ప్రజలహృదయాల్లో సుస్థిర స్థానం

సిపిఐ జాతీయసమితి సభ్యుడు

బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తుళ్లూరు పెద్ద సత్యంకు నేటికి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం ఉందని సిపిఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. కొణిజర్ల మండల పరిధిలోని తనికెల్లలో మంగళవారం తుళ్లూరు సత్యం 19వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత పెద్ద సత్యం విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఐ అభివృద్ధికి పెద్ద సత్యం అహోరాత్రులు కష్టపడ్డారని కొనియాడారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేవారన్నారు. కొణిజర్ల, చింతకాని, రఘునాధపాలెం మండలాల్లో విస్తతంగా పర్యటించి కార్యకర్తలకు ధైర్యాన్ని నింపి ప్రోత్సహించేవాడని పేర్కొన్నారు. నాటి నాయకులైన రజబ్‌ఆలీ, గడల సీతారామయ్య, దొండపాటి వెంకయ్య, బొమ్మిశెట్టి నారాయణ, చావా వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటపతి, తాళ్లపల్లి రాములుతోపాటు అనేక మంది నాయకులతో కలిసి పార్టీని విస్తరించడంలో ఎనలేని కృషిచేశారన్నారు. కొణిజర్ల మండలానికి ప్రథమ మండల అధ్యక్షుడిగా, జెడ్పీటిసిగా పనిచేశారని తెలిపారు. కొణపర్తి విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపైఇ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, దొండపాటి రమేష్, పివిరావు, పాపగంటి సుధర్శన్, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, పిన్నం పుల్లయ్య, పొట్లపల్లి సీతారాములు, గడల శ్రీనివాసరావు, కట్ల సత్యం, బాసా నాగరాజు, పసుమర్తి శంకర్రావు, బాణోత్ రామయ్య, బెజవాడ రాంబాబు, లేడిబోయిన సైదులు, సత్యం కుమారులు తుళ్లూరు ప్రసాద్, తుళ్లూరు మురళి, కోడలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తడి నేలలతో పర్యావరణానికి మేలు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చిత్తడి నేలల పరిరక్షణతో పర్యావరణానికి మేలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన వెట్‌ల్యాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. వెట్ ల్యాండ్ కమిటీ బాధ్యతలు, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా అటవీ అధికారి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల్లో చిత్తడి నేలల పరిధిలో వచ్చే పట్టా భూముల సర్వే నెంబర్లు స్పష్టంగా తెలిసేలా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో జెడ్పి సిఈవో దీక్షారైనా, ఎఫ్‌డివో మంజుల, తహసీల్దార్‌లు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్తపేరు, లోగో ఏర్పాటు

వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్తపేరు ట్యాగ్ లైన్ సూచించి నాలుగు వేల రూపాయల బహుమతి గెలుచుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ తో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్కు పబ్లిక్ కాంపిటిషన్ గోడప్రతిని ఆవిష్కరించారు. జెడ్పిసిఈవో దీక్షారైనా, ఎఫ్‌డివో మంజుల, తహసీల్దార్‌లు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కాటన్ మంజా వినియోగించాలి

సంక్రాంతి సందర్భంగా ఎగురవేసే పతంగులకు కాటన్ మంజాను మాత్రమే వినియోగించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ తో కలిసి తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన ఫ్లై గ్రీన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసే సమయంలో కాటన్ మంజాను మాత్రమే వినియోగించాలని తెలిపారు. పక్షులు, వైల్డ్‌లైఫ్, మనుషులకు ప్రమాదం కలిగించే షార్ప్ సింథటిక్ మంజాను బ్యాన్ చేయడం జరిగిందని దానిని ఎట్టి పరిస్థితులలో వినియోగించ వద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, ఎఫ్‌డివో మంజుల పాల్గొన్నారు.

## 15వ బెటాలియన్‌లో ఘనంగా ఇంటర్ స్పోర్ట్స్ మీట్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని 15వ బెటాలియన్ బి గంగారంలో ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ 2026ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఐ.ఏ.ఎస్ హాజరై క్రీడా వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఉద్యోగ ఒత్తిడిని తగ్గించడంలో క్రీడా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఇలాంటి ఆటల ద్వారా సిబ్బందిలో ఉత్సాహం, స్ఫూర్తి పెరుగుతాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహించిన కవాతు ఎంతో ఆకట్టుకుందని, క్రీడా స్ఫూర్తితో వారు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ వసుందర యాదవ్, కమాండెంట్ యన్. పెదబాబు, అడిషనల్ కమాండెంట్ ఏ అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ యస్. శ్రీధర్ రాజా, బి. వేణు గోపాల్ రెడ్డి ఏవో వి. అశోక్ కుమార్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.




## అందుబాటులో పంటలకు సరిపడే యూరియా

కలెక్టర్ దురిశెట్టి అనుదీప్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రైతులకు అవసరమైన మేర యూరియా సరఫరా ఉండేలా ముందస్తు సమాచారం, కూపన్ల జారీ చేపట్టాలని, అధిక కొనుగోళ్లు జరగకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీల నిర్వహణను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం వేంసూరు మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి మండల అధికారులతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, పన్నుల వసూలు పకడ్బందీగా జరగాలని సూచించారు. సమావేశంలో వేంసూరు తహశీల్దారు జె. మానిక్ రాజ్‌తో పాటు వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులదే కీలక పాత్ర

65 జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా నియామకం

ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి మంగళవారం 65 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా నియామకం చేస్తూ ఉత్తర్వుల ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. పారిశుధ్య నిర్వహణ, గ్రామాల్లో పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ద వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, పన్నుల వసూళ్లు, ప్రజలకు మెరుగైన వసతుల కల్పన, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులకు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, సబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి పని చేస్తున్నవి లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీ విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం, ఎఫ్ఎలసి చేపట్టుటకు కావాల్సిన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఏ రాజు, ఆర్అండ్‌బి డిఇ ఇ. లకన్‌నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్అండ్‌బి ఎఇ లలిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'రామమ్'. ఈ చిత్రాన్ని దోసపాటి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. లోకమాన్య దర్శకత్వం వహిస్తున్నారు. బి రైట్ ఆఫ్ అకేరా ట్యాగ్ లైన్ తో తెరకెక్కుతున్న రామమ్ సినిమా నుంచి బెల్లంకొండ సాయి శ్రీనివాస్ షాట్ తో లీక్ చేసిన ఫ్రీ లుక్ పవర్ ఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది.

# రీల్



## భారీ సెట్‌లో భోగి షూటింగ్


శర్వానంద్ హీరోగా సంపత్ నంది రూపొందిస్తున్న పాన్‌ఇండియా సినిమా భోగి. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు.1960 బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ సినిమా ఇది. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ స్పార్క్ అనే పవర్ ఫుల్ కాన్సెప్ట్ వీడియో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా కొత్త షూటింగ్ హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్లో ప్రారంభమయ్యింది. ఈ కీలక షెడ్యూల్లో టాకీ పార్ట్ ని చిత్రీకరించనున్నారు. శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఓపి కిషోర్ కుమార్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. భోగి సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి రచయిత, దర్శకత్వం: సంపత్ నంది.

## ఆది, సాయి కుమార్‌లతో బొమ్మరిల్లు - 2 తీయొచ్చు




యుగంధర్ ముని దర్శకత్వంలో ఆది సాయి కుమార్ హీరోగా ఇటీవల విడుదలైన శంబాల సినిమా థ్యాంక్స్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు హాజరై, చిత్రయూనిట్ మొత్తాన్ని అభినందించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ విడుదలైన అన్ని సినిమాల ఫాలో అప్ చేస్తుంటే శంబాల 100 పర్సెంట్ సక్సెస్ అని విన్నా. ఈ సినిమాకు పబ్లిక్‌లో మంచి టాక్ రావడం, విజయవంతంగా నిలబడటం చాలా సంతోషకర విషయం. ఈ సినిమా ఆదికి 25వ సినిమా, ఈ 25వ సినిమా విజయవంతం కావడం రియల్లీ హ్యాపీ. ఒకప్పుడు బొమ్మరిల్లు సినిమా సినీ ఇండస్ట్రీలో చాలా చేంజ్ తీసుకొచ్చింది. నిజంగా బొమ్మరిల్లు 2 తీయాలంటే మాత్రం ఆది, వాళ్ళ నాన్న సాయి కుమార్‌లతో తీయాలి. కొడుకు సక్సెస్ కోసం తండ్రి పడే తపన మాటల్లో చెప్పలేం. అలా సాయి కుమార్ తన కొడుకుతో పాటు శంబాల టీమ్ మొత్తానికి బ్యాక్ బోన్‌గా నిలిచి సినిమా విజయంలో భాగమయ్యారు. ఈ థ్యాంక్స్ మీట్ లో ఆది , సాయికుమార్ , దర్శకుడు యుగంధర్, నిర్మాత మహిధర్ రెడ్డి ,మరో నిర్మాత రాజశేఖర్, హీరోయిన్ అర్చన అయ్యర్ పాల్గొన్నారు.

## 9న జన నాయకుడు



దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న మూవీ 'జన నాయకుడు'. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై హెచ్.వినోద్ దర్శకత్వంలో సినిమా రూపొందుతోంది. సంక్రాంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున జనవరి 9న ఈ సినిమా రిలీజ్ కానుంది. మూవీపై భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఒక పేరే అలరారు..' అనే లిరికల్ వీడియో సాంగ్స్ రిలీజ్ చేశారు. రాక్స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యం వహిస్తోన్న జన నాయకుడు సినిమాలోని ఈ పాటను తెలుగులో శ్రీ వాస మౌళి రాయగా, శ్రీకృష్ణ, విశాల్ మిశ్రా ఆలపించారు. పాటలోని బలమైన సాహిత్యం దానికి తగ్గ బీట్ అందరిని మెప్పిస్తోంది. తన అభిమానులతో దళపతి విజయ్ ఉన్న గాఢమైన అనుబంధాన్ని ఈ పాట ద్వారా వ్యక్తం చేశారు. అన్నీ డిజిటల్ ప్లాట్ఫామ్స్‌లో పాట దూసుకెళ్తోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా మూవీ 'జన నాయకుడు' కావటం ఓ ప్రత్యేకత. అలాగే విజయ్ కెరీర్లో ఇదొక మైల్ స్టోన్ మూవీ. ఇంతకు ముందు ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్లు గమనిస్తే.. అందులో ఆయన తన అభిమానులతో కలిసి ఓ సెల్ఫీ తీసుకుంటూ కనిపించారు. విజయ్కు ఉన్న తిరుగులేని అభిమాన గణం. ఐదు రోజుల [illegible] ప్రపంచ వ్యాప్తంగా జన నాయకుడు సినిమాపై ఉన్న ఆసక్తితో సినిమా బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటుతుందని ట్రేడ్ సర్కిల్స్ అంటున్నాయి. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను భావోద్వేగంగా తాకే, చిరకాలం గుర్తుండిపోయే సినీ అనుభూతిని అందించనుంది.

## టాక్సిక్‌లో రుక్మిణీ వసంత్ పోస్టర్ రిలీజ్




కేజీఎఫ్ హీరో యష్ నటిస్తున్న తాజా చిత్రం టాక్సిక్ : ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' సినిమా రిలీజ్కు కౌంట్ డౌన్ మొదలైంది. మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్తో సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే రగ్డ్ లుక్లో యష్ పోస్టర్ ను విడుదల చేసి, హుమా ఖురేషి పోస్టర్, నయనతార పోస్టర్ ను విడుదల చేసిన సినిమా నిర్మాతలు తాజాగా రుక్మిణీ వసంత్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. రుక్మిణీ వసంత్ మెలిసా అనే పాత్ర చేస్తోంది. ఈ సినిమాను పండుగల సీజన్ గుడి పద్వ, ఉగాది, ఈద్ కలిసి వస్తున్న సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత రాజీవ్ రవి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, సంగీతాన్ని యష్తో కేజీఎఫ్ లో కలిసి పనిచేసిన రవి బస్రూర్ అందిస్తున్నారు. ఎడిటింగ్ వర్క్ను ఉజ్వల్ కులకర్ణి ..ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను టీపీ అబిద్ నిర్వహిస్తున్నారు. జాన్ విక్ వంటి చిత్రాలకు పని చేసిన హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ జెజె పెర్రీ, జాతీయ అవార్డు గ్రహీత అన్బరివ్ కలిసి ఈ చిత్రంలోని కీలక యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. యష్, గీతూ మోహన్ దాస్ రాసిన ఈ కథను గీతూ మోహన్ దాస్ డైరెక్టర్ చేస్తున్నారు. ఇంగ్లీష్, కన్నడలో సినిమాను చిత్రీకరిస్తోన్న ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, మలయాళం సహా ఇతర భాషల్లో అనువాదం చేసి రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ క్రియేషన్స్ బ్యానర్స్పై వెంకట్ కె.నారాయణ, యష్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## వేసవి సెలవుల్లో రానున్న చెన్నై లవ్‌స్టోరీ

కిరణ్ అబ్బవరం హీరోగా హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి మూవీస్ ప్రేక్షకులకు అందించిన దర్శక నిర్మాత సాయి రాజేశ్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సాయి రాజేశ్, ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రిలీజ్ చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఈ సమ్మర్ లో 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా గ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్, ఎడిటర్ సంతోష్ నాయుడు, డీవోపీ విశ్వాస్ డేనియల్, పాటలు అనంత శ్రీరామ్, సంగీతం మణిశర్మ, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ రవి నంబూరి.



## 'సరస్వతి' షూటింగ్ పూర్తి



వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రంతో తొలిసారిగా దర్శకురాలిగా మారిన వరలక్ష్మి శరత్ కుమార్, తానే ప్రధాన పాత్రలో నటిస్తూ పక్కా ప్లానింగ్, క్లియర్ విజన్తో అనుకున్న సమయానికి షూటింగ్ను పూర్తిచేశారు. ఫైనల్ అవుట్పుట్ అద్భుతంగా వచ్చింది. 'సరస్వతి' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ సరస్వతి చిత్ర షూటిం గ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం. ఈ ప్రయాణంలో నాకు పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్క ఆర్టిస్ట్కు, టెక్నీషియన్కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ను ప్రారంభించబోతున్నాం అన్నారు. ఈ చిత్రంలో జీవా, ప్రకాష్ రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, ఎ.ఎం. ఎడ్విన్ సకే కెమెరా మ్యాన్. వెంకట్ ఎడిటర్, సుధీర్ ఆర్ట్ డైరెక్టర్. ప్రవీణ్ డేనియల్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

## గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో 'రిమ్జిమ్'

1990ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా హేమ సుందర్ దర్శకత్వంలో, సచేతన్ రెడ్డి, డా.మానస, శ్రీనివాసరావు నిర్మాణంలో తెరకెక్కుతున్న సినిమా 'రిమ్జిమ్'. 'అస్లీదమ్' అనే ట్యాగ్‌లైన్‌తో సినిమా రూపొందుతోంది. స్నేహం, ప్రేమ కథగా రూపొందిన ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఎ వి సినిమాస్ , సి విజువల్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆస్కార్ అవార్డు విన్నర్ రాహుల్ సిప్లిగంజ్ కీలక పాత్రలో నటించగా, ఆయన పాడిన రెండు పాటలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. హేమ సుందర్ దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రధాన పాత్రలో అజయ్ వేద్, హీరోయిన్‌గా ప్రజన నటిస్తున్నారు. ఇతర ముఖ్య పాత్రల్లో బిత్తిరి సత్తి, రాజ్ తిరందాస్ కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం కొక్కిలగడ్డ ఇఫ్రాయిం, సినిమాటోగ్రఫీ వాసు పెండం, ఎడిటింగ్ పెనుమత్స రోహిత్ నిర్వహిస్తున్నారు. 'గ్యాంగ్స్టర్' నేపథ్యంలో సాగే ఈ సినిమా త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# వరంగల్ కోట భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించండి

### సిఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్ కోట భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, కాకతీయుల వారసత్వ సంపదను కాపాడాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కోరారు. వరంగల్ కోట భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని సిఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఎఎస్ఐ ఆధీనంలోని చారిత్రక వరంగల్ కోట భూములపై ఆక్రమణలు చట్టవిరుద్ధమన్నారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్న స్మారక ప్రదేశంలో ఆక్రమణలపై పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎఎస్ఐ అధికారులు లేఖలు రాసినా చర్యలు చేపట్టలేదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కోట భూములను ఎఎస్ఐకి చెందినవిగా కాకుండా ప్రభుత్వ భూములుగా చూపడం వల్ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ తప్పులను సరిదిద్దాలని కోరారు. ఇటీవల మట్టిగోడ, రాతి కోడ ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగి, కొత్త నిర్మాణాలకు మార్గం సుగమం చేస్తున్నారని తన లేఖలో కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ కోట పరిసరాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించడం, ఆక్రమిత భూములను తిరిగి భారత పురావస్తు శాఖకు అప్పగించాలన్నారు. చారిత్రక వారసత్వ పరిరక్షణలో భారత పురావస్తు శాఖకు పూర్తి సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వం తరపున లేన లేఖలో కిషన్ రెడ్డి కోరారు.

# 'విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ కమిటీని నియమించాలి'

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఉద్యోగులకు వేతన సవరణ కమిటీని నియమించి, ఏప్రిల్ నుంచి నూతన వేతనాలు చెల్లించాలని తెలంగాణ విద్యుత్తు ఒసి, బిసి ఉద్యోగుల జెఎసి విజ్ఞప్తి చేసింది. ంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో–కన్వీనర్ సి.భానుప్రకాశ్‌లు మాట్లాడారు. 1999–2004 మధ్యలో ఉద్యోగాల్లో చేరిన విద్యుత్తు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్టిజన్ ఉద్యోగులకు పదోన్నతులివ్వాలని, ఈపిఎఫ్ సీలింగ్‌ను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి ప్రతినిధులు యాదగిరి, విజయ్‌కుమార్, బొబ్బిలి మురళి, అశోక్ కుమార్, శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసిన క్రీడాకారుల బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యూఢిల్లీలో జరగనున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ (విబివైఎల్‌డి)–2026లో పాల్గొనడానికి తెలంగాణ నుండి ఎంపికైన 68 మంది యువ ప్రతినిధుల బృందంతో మంగళవారం తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ పోటీలు ఈ నెల 9 నుంచి 12 వరకు జరగనున్నాయని గవర్నర్‌కు క్రీడాకారులు తెలిపారు. లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమము లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ యువ నాయకులను అభినందించారు. జాతీయ స్థాయి కార్యక్రమంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. విబివైఎల్‌డి–2026 కు ఎంపిక ప్రక్రియ ద్వారా రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచిన యువ ప్రతినిధులు, తమ వినూత్న ఆలోచనలు, నాయకత్వ అనుభవాలు , దేశ నిర్మాణం కోసం దార్శనికతను గవర్నర్‌తో పంచుకున్నారు. యువ నాయకుల ఉత్సాహం, నిబద్ధత, భవిష్యత్తును చూసే ఆలోచనలను గవర్నర్ ప్రశంసించారు.వైబివైఎల్‌డి వంటి వేదికలు దేశ భవిష్యత్ నాయకులను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, సమాజానికి, ప్రజా జీవితానికి అర్థవంతంగా తోడ్పడటం కొనసాగించాలని పాల్గొనేవారిని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో యువజన సర్వీస్ ల శాఖ డైరెక్టర్ డాక్టర్ సోనిబాలా దేవి, సెట్విన్ ఎండి కె. వేణుగోపాల్ రావు, యువజన సేవల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# డెంగీ నియంత్రణలో హైదరాబాద్ దేశానికి ఆదర్శం

### జిహెచ్‌ఎంసికి కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భాగ్యనగరంలో డెంగీ సహా ఇతర కీటకజనిత వ్యాధుల నియంత్రణకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) తీసుకుంటున్న చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అత్యాధునిక సాంకేతికతను జోడించి వ్యాధుల కట్టడిలో జిహెచ్‌ఎంసి సాధించిన పురోగతిని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది.

**జాతీయ వేదికపై హైదరాబాద్ సక్సెస్ స్టోరీ**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించిన మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్స్ (ఎంఎస్‌యు) జాతీయ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ మోడల్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పాల్గొని, నగరంలో వ్యాధుల నియంత్రణకు చేపట్టిన వ్యూహాలపై 'సాంకేతిక ఆధారిత వాహకజనిత వ్యాధుల పర్యవేక్షణ, నిర్వహణ హైదరాబాద్‌లో డెంగీ నియంత్రణ విజయ గాథ' అనే అంశంపై ఆయన సమగ్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో డెంగీ కేసులను గణనీయంగా తగ్గించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించిందని కమిషనర్ కర్ణన్ వివరించారు. వెక్టర్ బోర్న్ డిసీజెస్ (విబిడి) యాప్ ద్వారా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసిన విధానాన్ని తెలిపారు. జిఐఎస్ ఆధారిత డ్యాష్‌బోర్డులు, రియల్ టైమ్ డేటా అప్‌డేట్స్ ద్వారా క్షేత్రస్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవడంతో డెంగీ నియంత్రణ సాధ్యమైందన్నారు. టెక్నాలజీ ఆధారిత డేటా విశ్లేషణతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయం కీల క పాత్ర పోషించిందని కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డేటా ఆధారిత విధానం ఫలప్రదంగా ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. హైదరాబాద్ అనుసరిస్తున్న ఈ వినూత్న విధానం ఇతర మెట్రోపాలిటన్ నగరాలకు ఆదర్శనీయమని కేం ద్ర అధికారులు ప్రశంసించారు. డేటా ఆధారిత పర్యవేక్షణ, వేగవంతమైన స్పందన వల్ల ప్రాణనష్టాన్ని నివారించవచ్చని, ఇదే నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.






# వెనిజులా అధ్యక్షుడి అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం: ఐప్సో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెనిజులా అధ్యక్షుడిని అమెరికా అక్రమంగా అరెస్ట్ చేసి తమ దేశానికి తీసుకెళ్లడాన్ని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, మదురోతో పాటు ఆయన సతీమణినీ వెంటనే విడుదల చేయాలని ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఉమామహేష్‌లు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, అమెరికా సైన్యం, వెనిజులా భూభాగంలోకి వచ్చి, ఇంట్లో ఉన్నటువంటి మదురోను, ఆయన సతీమణినీ అక్రమంగా అరెస్ట్ చేసి, తీసుకెళ్లడం గుండాయిజమనీ, అప్రజాస్వామికమని నాగేశ్వరరావు, ఉమామహేష్‌లు అమెరికా తీరును తీవ్రంగా ఖండించారు. మేడ్చల్ జిల్లా ఐప్సో కమిటీ ఆధ్వర్యంలో ఇసిఐఎల్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అమెరికా, వెనిజులాలోని చమురు నిక్షేపాల మీద కన్నేసి, తప్పుడు కేసులు పెట్టి, తప్పుడుగా వ్యవహరించడాన్ని ప్రపంచమంతా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర నాయకులు డి.జి.నరేంద్ర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రాంనారాయణ, వెంకటేశ్వర్లు, నిమ్మల నర్సింహా, రచ్చ కిషన్, మహాలక్ష్మి, ప్రమీల, జె.లక్ష్మి , సల్మాన్, బాబు తదతరులు పాల్గొన్నారు.

# ఐటి సెల్ యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నవారిని, వికలాంగులను విచారణలకు హాజరు కావాలని బలవంతం చేస్తోంది. ఈ ప్రక్రియ కోసం ఇసి, బిజెపి అభివృద్ధి చేసిన ఐటి మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించుకుంటోంది. ఇది చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికం. ఇది ఇలా కొనసాగకూడదు' అని మమతా బెనర్జీ అన్నారు. బిజెపి మార్గదర్శకత్వంలోనే ఎన్నికల సంఘం(ఇసి) పనిచేస్తోందని అంతకుముందు కూడా మమతా బెనర్జీ ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయ త్నం జరుగుతోందని విమర్శించారు. అదే విధంగా బంగాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చాలా తప్పులున్నాయని పేర్కొన్నారు. చట్టపరంగా ఓటు హక్కు కలిగిన అనేక మంది ఓట్లను తొలగించారని మండిపడ్డారు. కనీసం రెండేళ్లు పట్టే ఓట రు గణన ప్రక్రియ కేవలం రెండు నెలల్లోనే పూర్తిచేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటంటూ ప్రశ్నించారు. ఏకపక్షంగా, లోపభూయిష్టంగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తు (ఎస్ఐఆర్)ను బంగాల్‌లో నిలిపివేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ కు మమతా ఇదివరకే విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత రూపంలో సర్‌ను కొనసాగిస్తే చాలా మంది తమ ఓటుహక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్ఐఆర్ విచారణల కోసం నియమించిన కేంద్ర అధికారులపై కూడా మమత ఇదివరకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశా రు. స్థానిక భాషపై అవగాహన లేని వారిని పరిశీలకులుగా నియమించడం సరికాదన్నారు. వారు రెండో దశ ధ్రువీకరణ ప్రక్రియ నిర్వహించడానికి అనర్హులని పేర్కొన్నారు. రాష్ట్రంలోకి బిజెపి బయట రాష్ట్రాల నుంచి ప్రజలను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందని, వీరిని గుర్తించి నిలువరించాలని బిఎల్ఎలకు మమత దిశానిర్దేశం చేశారు.

# హతమార్చిన తండ్రి

(మొదటి పేజీ తరువాయి)

నారాయణపేట జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు. మరికల్ మండల పరిధిలోని తేలేరు గ్రామానికి చెందిన శివరాములు దంపతులకు రిత్విక (8), చైతన్య (5) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, భార్య గతంలోనే విడాకులు ఇవ్వగా శివరాములు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలోనే పిల్లలకు క్రిమి సంహారక మందులు తాగించినట్లుగా సమాచారం. పిల్లలు త్వరగా చనిపోకపోవడంతో కోయిల్‌సాగర్ కాలువలోని తీసుకెళ్లి కర్కశంగా తొక్కి చంపేసినట్లుగా తెలుస్తోంది. అనంతరం శివరాములు కూడా క్రిమిసంహారక మందు తాగినప్పటికీ ప్రాణాలు పోకపోవడంతో సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చివరకు చావలేని.. బతకలేని పరిస్థితులలో శివరాములు జరిగిన విషయాన్ని తెల్లవారుజామున గ్రామస్తులకు తెలిపాడు. ఈ సమాచారాన్ని పోలీసులకు తెలుపగా అక్కడికి మరికల్ సిఐ రాజేందర్, ఎస్సై రాములు పోలీసులతో కలిసి పిల్లలను పడేసిన కోయిల్ సగర్ కాలువ వద్దకు చేరుకున్నారు. అనంతరం పిల్లలను బయటకు తీయగా వారు అప్పటికే మృతిచెందారు. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్న శివరాములుకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాము పేర్కొన్నారు.

# 'ఫాల్కన్' ఎండి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఆమె తెలిపారు.

**నకిలీ వెబ్‌సైట్, యాప్‌తో మోసం:** నిందితులు www.falconsgroup.com పేరిట నకిలీ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను రూపొందించి, పేరున్న బహుళజాతి కంపెనీల పేర్లతో తప్పుడు ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ డీల్స్ సృష్టించారు. తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ప్రచారం చేసి పెట్టుబడిదారులను ఆకర్షించారని సిఐడి చీఫ్ చారుసిన్హా పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో మొత్తం 7,056 మంది డిపాజిటర్ల నుంచి సుమారు రూ.4,215 కోట్లను అక్రమంగా సేకరించగా, అందులో 4,065 మంది పెట్టుబడిదారులు రూ.792 కోట్ల మేర మోసపోయినట్లు గుర్తించామన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు 2025లో సైబరాబాద్ ఇఒడబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి, అనంతరం దర్యాప్తును తెలంగాణ సిఐడికి బదిలీ చేశారు. నిందితులపై బిఎ న్ఎస్ సెక్షన్లు 316(2), 318(4), 61(2)*తో పాటు టీఎస్‌పీడీఈఎఫ్ చట్టం, 1999 – సెక్షన్ 5 కింద కేసులు నమోదు చేశారు.

**ముంబయి విమానాశ్రయంలో అరెస్ట్..**

లుక్ అవుట్ సర్క్యులర్ ఆధారంగా, ఇరాన్ నుంచి తిరిగివస్తున్న సమయంలో జనవరి 5న ముంబై విమానాశ్రయంలో అమర్‌దీప్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారని చారుసిన్హా తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు డైరెక్టర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, ఒక చార్టెర్డ్ అకౌంటెంట్ సహా మొత్తం 11 మందిని అరెస్ట్ చేశామని ఆమె వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా నిందితులకు చెందిన 12 ప్లాట్లు,4 లగ్జరీ కార్లు,రూ.8 లక్షల నగదు,21 తులాల బంగారం, రూ.20 కోట్ల విలువైన షేర్లు, రూ.8 కోట్ల బ్యాంక్ నిల్వలు, మొత్తం సుమారు రూ.43 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించి, అటాచ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.అధిక లాభాలు ఇస్తామని హామీ ఇచ్చే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాస్తవికత లేని హామీలను నమ్మవద్దని సిఐడి అదనపు డిజి చారుసిన్హా హెచ్చరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com